సంపుటి : 78 సంచిక : 28 పుటలు : 52

# జాగృతి

కలి 5128 - శ్రీ పరాభవ వైశాఖ శుద్ధ ఏకాదశి
27 ఏప్రిల్ - 03 మే 2026
వెల : ₹20/-



# దుష్ట చతుష్టయం భ్రూణ హత్య

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

@Jagriti Tv 78 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక www.jagritiweekly.com

# కేదార్‌నాథుని సన్నిధిలో ఓంకారం

ఉత్తరాఖండ్ రాష్ట్రం, రుద్రప్రయాగ్ జిల్లాలోని కేదార్‌నాథ్ ఆలయం సమీపంలో ఓం చిహ్నం స్థాపన జరిగింది. ఇది ఆలయ ద్వారాలు తెరుచుకునే ముందు రోజు సన్నాహాల భాగంగా కేదార్‌నాథ్ ధామ్‌లోని గోల్ ప్లాజాలో ఏర్పాటైంది. ఈ ఓం ఆకృతి కంచు లోహంతో తయారైంది. **6,000** కేజీల బరువు ఉంటుంది. గుజరాత్ రాష్ట్రంలోని బరోడా నగరంలో ఈ ఆకృతిని తయారు చేశారు. ఓం ఆకృతి భద్రత కోసం నాలుగు వైపులా రాగితో తాపడం చేశారు. ఆకృతి మధ్య భాగం, అంచులకు మంచు నుంచి నష్టం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారు. జిల్లా మేజిస్ట్రేట్ మయూర్ దీక్షిత్ ఈ స్థాపన గురించి మాట్లాడుతూ జిల్లా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ, పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు హైడ్రా యంత్రం సహాయంతో ట్రయల్ స్థాపన చేపట్టగా అది పూర్తి విజయం సాధించిందని తెలిపారు. అలా జరిగిన కొద్ది రోజుల్లోనే ఈ ఓం ఆకృతి పూర్తి స్థాయిలో స్థాపితమైంది. ఈ చర్యతో కేదార్‌నాథ్ గోల్ ప్లాజా ఆధ్యాత్మికతను సంతరించుకుంటుందని అధికారులు తెలిపారు ఇది ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కలల ప్రాజెక్ట్ కింద కేదార్‌నాథ్‌ను ధార్మికంగా అభివృద్ధి చేయడంలో భాగం. ఆలయ సమీపంలో ఈ ఓం స్థాపన భక్తులకు పవిత్రమైన అనుభూతి కలిగిస్తుంది. యాత్ర సన్నాహాలను మరింత ఆకర్షణీయం చేస్తుంది. ఈ ఓం ఆకృతి గోల్ ప్లాజాలో ఆలయానికి దాదాపు ఇరవై అయిదు మీటర్ల ముందు ఉంది. భక్తులు వచ్చి దర్శనం చేసుకుంటూ ఆధ్యాత్మిక శాంతిని పొందవచ్చు. ఆలయ ద్వారాలు తెరుచుకునే సమయంలో ఈ స్థాపన భక్తుల సంఖ్యను పెంచి యాత్రను మరింత విజయవంతం చేస్తుందని అధికారులు తెలిపారు. తదనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేసి ఈ పనిని త్వరగా పూర్తి చేశారు. కేదార్‌నాథ్ ధామ్ అభివృద్ధికి మైలురాయి అవుతుంది. భక్తులు ఈ ఓం చిహ్నం చూసి శివుని అనుగ్రహం పొంది ఆనందంగా యాత్ర చేయవచ్చు. ఈ సన్నాహాలు యాత్రను సురక్షితంగా, ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దుతాయి.



# హింగ్లాజ్‌మాత దర్శనానికి మూడు లక్షల మంది భక్తులు

బలోచిస్తాన్‌లోని హింగోల్ పర్వతాలలో ఉన్న ప్రసిద్ధ హింగ్లాజ్ మాతా ఆలయంలో నాలుగు రోజుల వార్షిక పండుగ ఏప్రిల్ 17 నుంచి 20 వరకు జరిగింది. ఈ పండుగలో సుమారు మూడు లక్షల మంది భక్తులు పాల్గొన్నారు. పండుగ ల్యారి తహసీల్‌లోని హింగోల్ జాతీయ ఉద్యానవనంలో జరిగింది. సింధ్‌లోని థార్‌పార్కర్, ఉమర్‌కోట్, సంఘర్ వంటి ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు కాలినడకన రోజుల తరబడి, కొందరు 20 రోజులు కూడా ప్రయాణం చేసి చేరుకున్నారు. యుకె, అమెరికా వంటి దేశాల్లో నివసించే సింధీ హిందువులు కూడా హాజరయ్యారు. ఈ సంఖ్య గత సంవత్సరం కంటే మూడు రెట్లు ఎక్కువగా ఉండటం భక్తుల గాఢమైన విశ్వాసానికి నిదర్శనం. బలోచిస్తాన్ ప్రభుత్వం, ప్రాంతీయ విపత్తు నిర్వహణ సంస్థ, జిల్లా అధికారులు పండుగ సురక్షితంగా జరగడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. పాకిస్తాన్ సైన్యం, ఫ్రంటియర్ కార్ప్స్, పోలీసు, లెవీస్ దళాలు భారీ భద్రతా ఏర్పాట్లు చేశాయి. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు, చికిత్స అందించారు. వందలాది స్వచ్ఛందసేవకులు భక్తులకు 24 గంటలూ భోజనం, చల్లటి నీరు, షర్బత్, టీ వంటివి అందించారు. హింగ్లాజ్ మాత ఆలయం శక్తి పీఠాలలో ఒకటి. సతీదేవి శిరస్సు భాగం ఇక్కడ పడినట్లు ఐతిహ్యం. భక్తులు అమ్మవారిని దుర్గాదేవి రూపంలో పూజిస్తారు. రామాయణ కాలం నుంచి కూడా ఈ పుణ్యక్షేత్రం ప్రసిద్ధి. హింగోల్ నది ఒడ్డున పర్వత గుహలో ఉన్న ఈ ఆలయం భక్తులకు అత్యంత పవిత్రమైనది.





Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Managing Editor : kurra Durga Reddy.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు,**
**వ్యాపార ప్రకటనల వివరాల కోసం**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

ఎం. శ్రీనివాస్ : సర్క్యులేషన్ ఇన్‌చార్జ్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం**
**9959991304**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

డిజైనర్ : చిగుళ్ల కుమార్

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 | సంవత్సర చందా రూ.850

**బ్యాంకు ఖాతా వివరాలు**

A/c Name & No. Jagriti Prakashan Trust, 92001006140 5325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

– సర్క్యులేషన్ ఇన్‌చార్జ్, జాగృతి

యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః, – 'స్త్రీలను గౌరవించే చోట దేవతలు పూజలందుకొంటారు' అని మనుస్మృతిలో గొప్పగా వర్ణించారు. పురాణ, ఇతిహాసాలన్నీ మానవ జాతి భవిష్యత్తంతా స్త్రీ శక్తిమీద ఆధారపడి ఉంటుందని అనేక సందర్భాల్లో చెప్పాయి. ఉపనిషత్తులు మాతృదేవోభవ అని స్త్రీ వైభవాన్ని ఎలుగెత్తి చాటాయి. స్త్రీ ఉద్ధరణ లేకుండా భారతదేశం పురోగమించదని స్వామి వివేకానంద అన్నారు.

సూక్ష్మ గ్రాహ్యత స్త్రీ స్వభావం. బుద్ధికి బలమిచ్చేది బాహ్యసమాచారం. స్త్రీ దాని విశ్లేషణతకు ప్రాధాన్యతనిస్తుంది. కాబట్టి మేధోపరంగా పురుషుడి కన్న స్త్రీ ఒక మెట్టుపైన ఉన్నట్టు లెక్క. జనక మహారాజు విద్వత్ సభలో తర్కజ్ఞాని యాజ్ఞవల్క్యుడిపై మైత్రేయి పైచేయి సాధించింది. వైదిక కాలంలో మైత్రేయి, గార్గి వంటి గొప్ప మహిళా మేధావులు ఉండేవారు. వీరు బ్రహ్మజ్ఞానాన్ని చర్చించడంలో రుషులతో సమానంగా నిలిచారు. చారిత్రక అధ్యయనాలు, పౌరాణిక సాహిత్యాల ప్రకారం వైదిక యుగంలో భారతీయ స్త్రీలకు ఉన్నత స్థానం ఉండేది.

ప్రాచీన భారతీయ సమాజం స్త్రీలను అణచివేసిందని, అబలగా చూసిందనే భావనలను ప్రచారంలోకి తెచ్చి, సమ్మతి సాధించి మహాపరాధం చేశారు. భారతీయ నాగరికతా సంస్కృతులను పాశ్చాత్య ప్రమాణాలతో పరిశీలించి వెనుకబాటుతనంగా తేల్చేశారు. ఇదంతా వలసవాద భావన.

సమాన హక్కుల విషయంలో సహనమూర్తులైన స్త్రీలు ప్రపంచ వ్యాప్తంగా అన్యాయానికి గురవుతున్నారు. కానీ ఇందుకు రువాండ మినహాయింపు. ఈ దేశంలో దిగువసభలో 61శాతం ప్రాతినిధ్యాన్ని కల్పించడం ద్వారా మహిళల సమాన హక్కుల విషయంలో ప్రపంచ దేశాలలో ఆదర్శంగా నిలిచింది. మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం విషయంలో ప్రస్తుత వేగంతోనే దేశాలు కోటాలు నిర్దేశిస్తూ పోతే వారు పురుషులతో సమాన స్థాయికి రావడానికి మరో 300 ఏళ్లు పడుతుందని అమెరికా మహిళా నివేదిక వెల్లడించడంపై ఆశ్చర్యపోనవసరంలేదు. మన దేశానికి వస్తే 27 ఏళ్ల క్రితం ప్రవేశపెట్టిన మహిళా బిల్లును పితృస్వామ్య భావజాలాన్ని వీడని రాజకీయ

**శాలివాహన 1948 శ్రీ పరాభవ వైశాఖ శుద్ధ ఏకాదశి**

## లోపలి పేజీలలో...





ముఖపత్ర కథనం
**దుష్ట చతుష్టయం భ్రూణ హత్య**
6లో

ధారావాహిక నవల
33 **గణపతిదేవుడు**
– మత్తి భానుమూర్తి


20లో

వ్యక్తిత్వ వికాసం
**ప్రశాంత జీవనానికి దగ్గరిదారి ధర్మాచరణ**


26లో

# జాగృతి

## సంపాదకీయం

# ఇంకెన్నాళ్లీ నిరీక్షణ ?

పార్టీలు తమ వితండ వాదాలతో అడ్డుకోవడంతో ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు.

స్వాతంత్ర్యానంతర కాలంలో తిరిగి మహిళా సాధికారత విషయంలో మన పాలకులు మందకొడిగానైనా కొంత దృష్టిని సారించారు. విదేశీ పాలనలో చదువుకోవడం నేరంగా భావించి వంటింటికి పరిమితంచేసిన మహిళను గగనతలంలోకి పరిశోధనకై పంపగలిగేంత సాధికారతవైపు ప్రయాణిస్తున్నాం. ఆ విధంగా మహిళ విద్య, ఆర్థిక, సామాజిక రంగాలలో స్వావలంబి అవడం ద్వారా కుటుంబానికి, సమాజ అభ్యుదయానికి తోడ్పాటుగా నిలవాలనేది హిందూ దృక్పథం. ఆ కోణం నుంచే ఇటీవల మహిళ సాధికారతకు పెద్దపీట వేయాలని వాజపేయి, మన్మోహన్‌సింగ్ ప్రభుత్వాల సమయంలో కొంత ప్రయత్నం ప్రారంభమైనా సఫలం కాలేదు. మహిళ సామాజిక రంగంతోపాటు చట్టసభలలో కూడా చురుకుగా పాల్గొనాలనే ఉద్దేశ్యంతో 2023లో మోదీ ప్రభుత్వం 'నారీ శక్తివందన్ అధినీయమ్' బిల్లును లోకసభలో ప్రవేశపెట్టడంతో అన్ని పక్షాలు ఆమోదించి త్వరగా అమలుచేయాలని సూచించాయి. ఈ చట్టం ప్రకారంగా మహిళలకు చట్టసభలలో 33% రిజర్వేషన్లు లభిస్తాయి. అయితే 2024 ఎన్నికల తరువాత జనగణన, నియోజక వర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పూర్తయిన తరువాత 2034కు అమలుచేస్తామని ఆనాడు కేంద్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. అయితే ఇది ఆలస్యమౌతుందనే ఉద్దేశ్యంతో రాజ్యాంగ సవరణ ద్వారా 2029 నుండే అమలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం ఆలోచించి పార్లమెంటుకు ముందుకు తీసుకొచ్చింది.

ఇందులో మహిళా రిజర్వేషన్ బిల్లుతోపాటు డీలిమిటేషన్ బిల్లు ఉండడంతో దానిని సాకుగా చూపి ప్రతిపక్షాలు మహిళా బిల్లును వ్యతిరేకించాయి. వాస్తవంగా 2011 జనాభా లెక్కల ప్రకారం డీ లిమిటేషన్ జరపాలని ప్రభుత్వం భావించింది. దీని ద్వారా దేశంలో ఏ రాష్ట్రానికి అన్యాయం జరగదని గణాంకాలతో సహా కేంద్ర ప్రభుత్వం సూచిస్తున్నది. ఇది ప్రతిపక్షాలకు కూడా తెలుసు. జనాభా ప్రతిపాదికన డీలిమిటేషన్ అనేది రాజ్యాంగ నియమం. అది నచ్చకపోతే ఆ రాష్ట్రంలో ఉన్న సీట్లకు 50% పెంపు అనే ప్రత్యామ్నాయాన్ని ప్రభుత్వం సూచించింది. ఈ రెండింటిలో దేనినీ ఒప్పుకోకుండా మహిళా బిల్లును అడ్డుకోవడం ప్రతిపక్షాల మొండితనం. డీలిమిటేషన్ బిల్లు కూడా వెనక్కి వెళ్లింది. కాబట్టి 2026 జనగణన ప్రకారమే తదుపరి డీ లిమిటేషన్ ప్రక్రియ చేపట్టాల్సి వస్తుంది. అలాంటప్పుడు తాను కూర్చున్న చెట్టు కొమ్మను తనే నరుకుంటున్నట్లుగా దక్షిణ భారతదేశంలో కొన్ని రాజకీయ పార్టీలు సీట్ల పెంపు విషయంలో నష్టాన్ని కోరి తెచ్చు కుంటున్నాయి.

ఏప్రిల్ 17న గనుక డీలిమిటేషన్ బిల్లు ఆమోదమై ఉంటే దక్షిణ భారతదేశంలో ఎక్కువ నష్టపోయేది బీజేపీయే. అయినప్పటికీ నేషన్ ఫస్ట్ అనే భావనతో స్వాతంత్ర్యం సిద్ధించి వంద సంవత్సరాలు పూర్తి కాబోతున్న 2047 నాటికి 'వికసితభారత్'గా త్వరితగతిన ప్రయాణింప చేయడానికి మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే ఈ 131వ రాజ్యాంగ సవరణ. ఏ దేశంలోనైనా దేశాభివృద్ధి విషయంలో అధికారపక్షానిది, ప్రతిపక్షానిది ఒకే అభిప్రాయంగా ఉంటుంది. అయితే మన దేశంలో మాత్రం దేశ ప్రయోజనాల కన్నా తమ రాజకీయ పార్టీల ప్రయోజనాలకే ప్రాధాన్యతనివ్వడంతో మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కావడానికి ఇంకెంత కాలం పడుతుందో! ★

27 ఏప్రిల్ 2026, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్




140లో

కథ

**కంచయ్య కథ**

డా॥ దుగ్గరాజు శ్రీనివాసరావు





కార్పొరేట్ 'మత మార్పిళ్లు' (మతోన్మాదం) - 12
అవిగో పరిషత్ ఎన్నికలు... (తెలంగాణ) - 14
మృత్యు 'శకటాల'కు ముకుతాడు (ఆంధ్రప్రదేశ్) - 16
భక్తికవితా యోగిని వెంగమాంబ (ప్రత్యేక వ్యాసం) - 18
మళ్లీ భారీ యుద్ధం తప్పదా? (అంతర్జాతీయం) - 24
యుద్ధమూ వ్యాపారమే! (అంతర్జాతీయం-1) - 28
పిడిమన్ను పూజ - గండికోట యుద్ధం (గళమెత్తిన గతం) - 30
ఉష్ణ గోళమై మండుతున్న భూగోళం (పర్యావరణం) - 32
సమస్యలు, సవాళ్లతో సమ్రాట్ ఎదురీత! (జాతీయం) - 34
కశ్మీర్ లోయ నుండి 'ప్రచారక్‌లు'.. (ఆర్‌ఎస్‌ఎస్-100) - 36
చదరంగంలో వైశాలి సంచలనం (క్రీడ) - 43
నివురుగప్పిన నిప్పులా చిత్రసీమ! (సినిమా) - 50

# దుష్ట చతుష్టయం



**ఏప్రిల్ 18న ప్రధాని నరేంద్ర మోదీ జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగ పూర్తి పాఠం**

ఈరోజు నేను ఒక అత్యంత ముఖ్యమైన విషయంపై మాట్లాడటానికి వచ్చాను, ముఖ్యంగా దేశంలోని తల్లులు, సోదరీమణులు, కుమార్తెలను ఉద్దేశించి! మహిళా శక్తి పోరాటాన్ని ఎలా అడ్డుకున్నారో(విపక్ష నేతలు) ఈరోజు భారతదేశం లోని ప్రతి పౌరుడు చూస్తున్నాడు. వారి కలలను నిర్దాక్షిణ్యంగా అణచివేశారు. మేము ఎంతగానో ప్రయత్నించినప్పటికీ విజయం సాధించలేక పోయాము. నారీ శక్తి వందన్ చట్ట సవరణను ఆమోదింపజేయలేకపోయాము! అందుకు నేను తల్లులు , సోదరీమణులందరినీ క్షమించమని కోరుతున్నాను.

మిత్రులారా,

మనకు జాతీయ ప్రయోజనాలే సర్వోన్నతమైనవి, కానీ కొందరికి పార్టీ ప్రయోజనాలే సర్వస్వం అయినప్పుడు, జాతీయ ప్రయోజనాల కన్నా పార్టీ ప్రయోజనాలే గొప్పవైనప్పుడు, దాని పర్యవసానాలను మహిళా శక్తి, జాతీయ ప్రయోజనాలు భరించాల్సి వస్తుంది. ఈసారి కూడా అదే జరిగింది. కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీ వంటి పార్టీల స్వార్థ రాజకీయాలు దేశ మహిళా శక్తికి హాని కలిగించాయి.

మిత్రులారా,

నిన్న దేశంలోని కోట్లాది మంది మహిళల కళ్లు పార్లమెంటుపైనే ఉన్నాయి. దేశ మహిళా శక్తి చూస్తోంది. మహిళలకు అనుకూలమైన ఈ ప్రతిపాదన వీగిపోయినప్పుడు, కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఎస్పీ వంటి కుటుంబ ఆధారిత పార్టీలు ఆనందంతో చప్పట్లు కొట్టడం చూసి నాకు కూడా చాలా బాధ కలిగింది. మహిళల హక్కులను లాక్కొని, వారు బల్లలు చరిచారు. వారు చరిచింది కేవలం బల్లలను మాత్రమే కాదు, మహిళల ఆత్మగౌరవాన్ని, ప్రతిష్టను దెబ్బ తీశారు. మహిళలు అన్నీ మరిచిపోతారు కానీ తమకు జరిగిన అవమానాన్ని ఎప్పటికీ మర్చిపోరు. అందువల్ల, పార్లమెంటులో కాంగ్రెస్, దాని మిత్రపక్షాల ప్రవర్తన వల్ల కలిగిన బాధ మహిళల హృదయాల్లో ఎప్పటికీ నిలిచి పోతుంది. దేశంలోని మహిళలు తమ ప్రాంతాలలో ఈ నాయకులను చూసినప్పుడల్లా, మహిళా రిజర్వేషన్లను ఆపినప్పుడు పార్లమెంటులో సంబరాలు చేసుకున్నది, ఆనందించింది వీరేనని గుర్తు చేసుకుంటారు. నిన్న పార్లమెంటులో నారీ శక్తి వందన్ సవరణను వ్యతిరేకించిన పార్టీలకు నేను స్పష్టంగా చెబుతాను: ఈ వ్యక్తులు మహిళా శక్తిని తేలికగా తీసుకుంటున్నారు. 21వ శతాబ్దపు మహిళలు దేశంలోని ప్రతి సంఘటనను గమనిస్తున్నారని, వారి ఉద్దేశాలను గ్రహిస్తున్నారని, నిజానిజాలను పూర్తిగా అర్థం చేసుకున్నారని వారు మర్చిపోతున్నారు. అందువల్ల, మహిళా రిజర్వేషన్‌ను వ్యతిరేకించినందుకు ప్రతిపక్షాలు చేసిన పాపానికి వారికి తప్పకుండా శిక్ష తప్పదు. ఈ పార్టీలు రాజ్యాంగ రూపకర్తల మనోభావాలను కూడా అవమానించాయి. ప్రజల విధించే వచ్చే శిక్ష నుండి అవి తప్పించుకోలేవు.

మిత్రులారా,

నారీ శక్తి వందన్ సవరణ ఎవరి నుంచో ఏదో లాక్కోవడానికి ఉద్దేశించినది కాదు. నారీ శక్తి వందన్ సవరణ ప్రతిఒక్కరికీ ఏదో ఒకటి ఇవ్వడానికి ఉద్దేశించినది. అది ఇవ్వడానికి మాత్రమే ప్రతిపాదించిన సవరణ. 40 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న దానిని 2029 లోక్‌సభ ఎన్నికల నుంచి మహిళలకు హక్కును ఇవ్వడానికే ఇది ఉద్దేశించింది.

21వ శతాబ్దపు భారతదేశంలోని మహిళలకు కొత్త అవకాశాలు, కొత్త రెక్కలు ఇవ్వడానికి, వారి మార్గంలోని అడ్డంకులను తొలగించడానికి చేసిన గొప్ప ప్రయత్నమే నారీ శక్తి వందన్ సవరణ. దేశ జనాభాలో 50 శాతానికి హక్కులు కల్పించాలనే స్పష్టమైన ఉద్దేశంతో, నిజాయితీతో చేసిన పవిత్రమైన ప్రయత్నం ఇది. భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో మహిళలను సహ ప్రయాణికులుగా చేయడానికి, ప్రతి ఒక్కరినీ కలుపుకోవడానికి చేసిన ప్రయత్నం ఇది. నారీ శక్తి వందన్ సవరణ కాలపు అవసరం. ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ అనే తేడా లేకుండా ప్రతి రాష్ట్రం బలాన్ని సమానంగా పెంచడానికి చేసిన ప్రయత్నమే నారీ శక్తి వందన్ సవరణ. పార్లమెంటులో ప్రతి రాష్ట్రం స్వరానికి మరింత బలం చేకూర్చే ప్రయత్నం ఇది. రాష్ట్రం చిన్నదైనా, పెద్దదైనా, జనాభా తక్కువైనా, ఎక్కువైనా, ప్రతి ఒక్కరి శక్తిని సమాన నిష్పత్తిలో పెంచడమే దీని ఉద్దేశం. కానీ ఈ నిజాయితీతో కూడుకున్న ప్రయత్నాన్ని కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు పార్లమెంటులో భ్రూణహత్యకు గురిచేశాయి. కాంగ్రెస్, టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే... ఈ పార్టీలు ఈ భ్రూణ హత్యకు పాల్పడ్డాయి. అవి దేశ రాజ్యాంగానికి వ్యతిరేకంగా నేరం చేశాయి. దేశ మహిళా శక్తికి వ్యతిరేకంగా నేరానికి పాల్పడ్డాయి.

మిత్రులారా,

కాంగ్రెస్ మహిళా రిజర్వేషన్ల అంశాన్ని ద్వేషిస్తుంది, దానిని ఆపడానికి ఎప్పుడూ కుట్రలు పన్నుతూనే ఉంది. ఈ దిశగా ప్రయత్నాలు జరిగిన ప్రతిసారీ, కాంగ్రెస్ వాటిని అడ్డుకుంది. ఈసారి కూడా, కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మహిళా రిజర్వేషన్లను ఆపడానికి ఒకదాని తర్వాత ఒకటిగా అబద్ధాలపై ఆధారపడ్డాయి. కొన్నిసార్లు సంఖ్యల విషయంలో, మరికొన్నిసార్లు ఇతర విధాలుగా, కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు దేశాన్ని తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించాయి. అలా చేయడం ద్వారా, ఈ పార్టీలు భారతదేశ మహిళా శక్తి ముందు తమ నిజ స్వరూపాన్ని బయటపెట్టుకున్నాయి. తమ ముసుగును తొలగించాయి.

మిత్రులారా,

వ్యక్తిగతంగా, కాంగ్రెస్ తన దశాబ్దాల నాటి తప్పును సరిదిద్దుకుంటుందని కాంగ్రెస్ తన పాపాలకు పశ్చాత్తాపపడుతుందని నేను ఆశించాను. కానీ చరిత్ర సృష్టించే, మహిళలకు అనుకూలంగా నిలబడే అవకాశాన్ని కాంగ్రెస్ కోల్పోయింది. దేశంలోని చాలా



# భ్రూణ హత్య

ప్రాంతాలలో కాంగ్రెస్ ఇప్పటికే తన ఉనికిని కోల్పోయింది. కాంగ్రెస్ ప్రాంతీయ పార్టీల వీపుపై స్వారీ చేస్తూ ఒక పరాన్నజీవిలా మనుగడ సాగిస్తోంది. కానీ ప్రాంతీయ పార్టీలు బలోపేతం కావడం కూడా కాంగ్రెస్‌కు ఇష్టం లేదు, అందుకే ఈ సవరణను వ్యతిరేకించేలా చేసి, అనేక ప్రాంతీయ పార్టీల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడానికి కాంగ్రెస్ రాజకీయంగా కుట్ర పన్నింది.

మిత్రులారా,

కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, టీఎంసీ, ఇతర పార్టీలు ఎన్నో ఏళ్లుగా, ప్రతిసారీ అవే సాకులు, అవే తప్పుడు వాదనలు చేస్తూ, ఎప్పుడూ ఏదో ఒక సాంకేతిక అడ్డంకిని సృష్టిస్తూ మహిళల హక్కులను దోచుకున్నాయి. దేశం ఈ వికారమైన రాజకీయ సరళిని అర్థం చేసుకుంది. దాని వెనుక ఉన్న కారణాన్ని కూడా గ్రహించింది.

సోదర సోదరీమణులారా,

నారీ శక్తి వందన్ చట్టాన్ని వ్యతిరేకించడానికి ఒక పెద్ద కారణం ఈ కుటుంబ ఆధారిత పార్టీల భయమే. మహిళలు సాధికారత పొందితే, ఈ కుటుంబ ఆధారిత పార్టీల నాయకత్వం ప్రమాదంలో పడుతుందని వారు భయపడుతున్నారు. తమ కుటుంబాలకు వెలుపల ఉన్న మహిళలు ముందుకు రావడాన్ని వారు ఎప్పటికీ కోరుకోరు. ఈనాడు, పంచాయతీలలో, స్థానిక సంస్థలలో వేలాది, లక్షలాది మంది మహిళలు తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. వారు లోక్‌సభ, శాసనసభలలోకి అడుగుపెట్టి, దేశానికి సేవ చేయాలనుకున్నప్పుడు, ఈ కుటుంబ ఆధారిత పార్టీలు అభద్రతా భావానికి లోనవుతాయి. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత మహిళలకు మరిన్ని సీట్లు లభిస్తాయి, మహిళల స్థాయి పెరుగుతుంది. అందుకే ఈ పార్టీలు నారీ శక్తి వందన్ సవరణను వ్యతిరేకించాయి. ఈ పాపానికి దేశంలోని మహిళా శక్తి కాంగ్రెస్‌ను, దాని మిత్రపక్షాలను ఎన్నటికీ క్షమించదు.

నా ప్రియమైన దేశవాసులారా,

కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు నియోజకవర్గాల పునర్విభజన గురించి నిరంతరం అబద్ధాలు చెబుతున్నాయి. ఈ సాకుతో వారు విభజన అనే నిప్పును రాజేయాలని చూస్తున్నారు. ఎందుకంటే "విభజించి పాలించు" రాజకీయాలు కాంగ్రెస్‌కు బ్రిటిష్ వారి నుండి వారసత్వంగా సంక్రమించాయి. కాంగ్రెస్ ఈనాటికీ అదే దారిలో పయనిస్తోంది. దేశంలో చీలికలు సృష్టించే భావాలను కాంగ్రెస్ ఎల్లప్పుడూ రెచ్చగొడుతూ వచ్చింది. అందుకే, నియోజకవర్గాల పునర్విభజన కొన్ని రాష్ట్రాలకు నష్టం కలిగిస్తుందనే అబద్ధాన్ని ప్రచారం చేసింది! అయితే, ఏ రాష్ట్ర భాగస్వామ్య నిష్పత్తి మారదని, ఎవరి ప్రాతినిధ్యం తగ్గదని ప్రభుత్వం మొదటి రోజు నుంచే స్పష్టం చేసింది. వాస్తవానికి, అన్ని రాష్ట్రాల సీట్లు సమాన నిష్పత్తిలో పెరుగుతాయి. అయినప్పటికీ కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీ దీనిని అంగీకరించడానికి సిద్ధంగా లేవు.

మిత్రులారా,

ఈ సవరణ బిల్లు అన్ని పార్టీలకు, అన్ని రాష్ట్రాలకు ఒక మంచి అవకాశంగా ఉండేది. ఈ బిల్లు ఆమోదం పొంది ఉంటే, తమిళనాడు, బెంగాల్, ఉత్తర ప్రదేశ్, కేరళ ఇలా ప్రతి రాష్ట్రం సీట్లు పెరిగి ఉండేవి. కానీ తమ స్వార్థ రాజకీయాల వల్ల, ఈ పార్టీలు తమ సొంత రాష్ట్రాల ప్రజలకు కూడా ద్రోహం చేశాయి. ఉదాహరణకు, తమిళనాడు గొంతుకను బలోపేతం చేయడానికి, ఎక్కువ మంది తమిళ ప్రజలను ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా చేసే అవకాశం డీఎంకేకు లభించింది! కానీ ఆ అవకాశాన్ని అది కోల్పోయింది. బెంగాల్ ప్రజలను ముందుకు తీసుకువెళ్లే అవకాశం టీఎంసీకి కూడా లభించింది. కానీ టీఎంసీ కూడా ఆ అవకాశాన్ని కోల్పోయింది. మహిళా వ్యతిరేక పార్టీ అనే మచ్చను తొలగించుకునే అవకాశం సమాజ్‌వాదీ పార్టీకి లభించింది. కానీ ఎస్పీ ఆ అవకాశాన్ని కూడా జారవిడుచుకుంది. ఎస్పీ ఇప్పటికే లోహియాజీని మరిచిపోయింది. నారీ శక్తి వందన్ సవరణను వ్యతిరేకించడం ద్వారా, ఎస్పీ లోహియాజీ కలలన్నింటినీ కాలరాచింది. ఎస్పీ మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకి, ఈ విషయాన్ని యూపీ, దేశ మహిళలు ఎన్నటికీ మరచిపోరు.

మిత్రులారా,

మహిళా రిజర్వేషన్‌ను వ్యతిరేకించడం ద్వారా తాను సంస్కరణలను వ్యతిరేకించే పార్టీ అని కాంగ్రెస్ మరోసారి నిరూపించుకుంది. 21వ శతాబ్దపు అభివృద్ధి చెందిన భారతదేశానికి ఎలాంటి నిర్ణయాలు, ఎలాంటి సంస్కరణలు అవసరమైనా, దేశం ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా, కాంగ్రెస్ వాటిని వ్యతిరేకిస్తుంది, తిరస్కరిస్తుంది, అడ్డుకుంటుంది. ఇదీ కాంగ్రెస్ చరిత్ర. ఇవే కాంగ్రెస్



ప్రసంగంలో ప్రధాని హావభావాలు

చేస్తున్న ప్రతికూల రాజకీయాలు.

మిత్రులారా,

జన్ ధన్-ఆధార్-మొబైల్ త్రయాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించింది. కాంగ్రెస్ డిజిటల్ చెల్లింపులను వ్యతిరేకించింది. కాంగ్రెస్ జీఎస్టీని వ్యతిరేకించింది. సాధారణ కేటగిరీలో పేదలకు రిజర్వేషన్‌ను కాంగ్రెస్ వ్యతిరేకించింది. ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా చేసిన చట్టాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించింది. ఆర్టికల్ 370 తొలగింపును కాంగ్రెస్ వ్యతిరేకించింది. యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ) అవసరమని మన రాజ్యాంగం, మన న్యాయస్థానాలు చెప్పాయి, కానీ కాంగ్రెస్ దానిని కూడా వ్యతిరేకిస్తుంది. సంస్కరణల ప్రస్తావన రాగానే, కాంగ్రెస్ నిరసన ప్లకార్డులతో ముందుకు వస్తుంది. దేశాన్ని బలోపేతం చేసే ఏ పనికైనా అడ్డంకులు సృష్టించడానికి కాంగ్రెస్ తన పూర్తి శక్తిని ఉపయోగిస్తుంది. కాంగ్రెస్ 'ఒకే దేశం, ఒకే ఎన్నిక'ను వ్యతిరేకిస్తుంది. దేశం నుండి చొరబాటుదారులను తరిమివేయడాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తుంది. ఓటర్ల జాబితా ప్రక్షాళనను కాంగ్రెస్ వ్యతిరేకిస్తుంది. ఎస్ఐఆర్, వక్ఫ్ బోర్డులో సంస్కరణలను కాంగ్రెస్ వ్యతిరేకిస్తుంది.

మిత్రులారా,

శరణార్థులకు భద్రత కల్పించిన సీఏఏ చట్టాన్ని కూడా కాంగ్రెస్ వ్యతిరేకించింది. అబద్ధాలు చెప్పి, పుకార్లు వ్యాప్తి చేసి దేశంలో పెను తుపాను సృష్టించింది. మావోయిస్టు-నక్సలైట్ హింసను అంతం చేయడానికి దేశం చేస్తున్న ప్రయత్నాలకు కాంగ్రెస్ అడ్డుపడుతుంది. కాంగ్రెస్‌కు ఒకే ఒక పద్ధతి ఉంది అదేమిటంటే సంస్కరణ వచ్చినప్పుడల్లా, అబద్ధం చెప్పడం, గందరగోళం సృష్టించడం. దీనికి చరిత్రే సాక్షి. కాంగ్రెస్ ఎల్లప్పుడూ ఈ ప్రతికూల మార్గాన్నే ఎంచుకుంది.

మిత్రులారా,

దేశానికి ఏ నిర్ణయం అవసరమో, దాన్ని కాంగ్రెస్ చాప కిందకు నెట్టేసి మరుగున పడేస్తుంది. కాంగ్రెస్ ఈ వైఖరి కారణంగా, భారతదేశం తాను చేరుకోవాల్సిన అభివృద్ధి శిఖరాలను చేరుకోలేక పోయింది. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, మనతో పాటు అనేక ఇతర దేశాలు కూడా స్వాతంత్ర్యం పొందాయి. ఆ దేశాలలో చాలా వరకు మనకంటే చాలా ముందుకు వెళ్లాయి, దానికి కారణం కాంగ్రెస్ ప్రతి సంస్కరణను అడ్డుకోవడమే. ఆలస్యం చేయడం, దారి మళ్లించడం, ఇదే కాంగ్రెస్ సూత్రం, ఇదే కాంగ్రెస్ సంస్కృతి. పొరుగు దేశాలతో సరిహద్దు వివాదాల పరిష్కారంలో కాంగ్రెస్ ఆలస్యం చేసింది. పాకిస్థాన్‌తో నీటి పంపిణీ వివాదాల పరిష్కారంలో కాంగ్రెస్ ఆలస్యం చేసింది. ఓబీసీ రిజర్వేషన్‌పై నిర్ణయాన్ని కాంగ్రెస్ 40 ఏళ్లపాటు ఆలస్యం చేసింది. సైనికులకు 'ఒకే ర్యాంకు ఒకే పెన్షన్' పథకాన్ని కాంగ్రెస్ 40 ఏళ్లపాటు జాప్యం చేసింది.

మిత్రులారా,

కాంగ్రెస్ వైఖరి దేశానికి ఎల్లప్పుడూ గొప్ప హాని కలిగించింది. కాంగ్రెస్ ప్రతి వ్యతిరేకత, ప్రతి నిర్ణయరాహిత్యం, ప్రతి మోసం వల్ల దేశం నష్టపోయింది. దేశంలోని తరతరాలు బాధపడ్డాయి. ఈ రోజు, దేశం ముందున్న అన్ని ప్రధాన సవాళ్లు కాంగ్రెస్ వైఖరి నుండే ఉద్భవించాయి. అందువల్ల, ఈ పోరాటం కేవలం ఒక చట్టానికి సంబంధించినది కాదు, ఇది కేవలం ప్రతికూలతతో నిండిన కాంగ్రెస్ సంస్కరణ వ్యతిరేక మనస్తత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం మాత్రమే. కాంగ్రెస్ మనస్తత్వానికి దేశంలోని మహిళలు, కుమార్తెలు గట్టి సమాధానం ఇస్తారనడంలో నాకు ఎలాంటి సందేహం లేదు.

మిత్రులారా,

దేశంలోని మహిళల కలలను భగ్నం చేయడాన్ని కొందరు ప్రభుత్వ వైఫల్యం అని అంటున్నారు. కానీ ఈ విషయం ఎప్పుడూ విజయం లేదా అపజయం గురించి కాదు, ఘనత గురించి కూడా కాదు. నేను పార్లమెంటులో కూడా చెప్పాను: సగం జనాభాకు వారి హక్కులు లభించనివ్వండి, నేను వారి ఫోటోలతో ప్రకటనలు ప్రచురించి ఆ ఘనతను ప్రతిపక్షానికి ఇస్తాను. కానీ మహిళలను పాతకాలపు ఆలోచనలతో చూసేవారు ఇప్పటికీ తమ అబద్ధాలకు కట్టుబడి, దృఢంగా నిలబడ్డారు!

మిత్రులారా,

మహిళలకు అధికారం, భాగస్వామ్యం కల్పించాలనే పోరాటం దశాబ్దాలుగా కొనసాగుతోంది. సంవత్సరాలుగా దీని కోసం కృషి చేస్తున్న వారిలో నేను కూడా ఉన్నాను. ఎంతో మంది మహిళలు ఈ విషయాన్ని నా దృష్టికి తీసుకువచ్చారు. ఎంతో మంది సోదరీమణులు ప్రతిదీ వివరిస్తూ నాకు లేఖలు రాశారు. నా దేశపు తల్లులారా, సోదరీ మణులారా, కుమార్తెలారా.. మీరందరూ ఈ రోజు దుఃఖంలో ఉన్నారని నాకు తెలుసు. మీ దుఃఖంలో నేను కూడా పాలుపంచుకుంటున్నాను. ఈ రోజు, బిల్లును ఆమోదించడానికి అవసరమైన 66 శాతం ఓట్లు మాకు రానప్పటికీ, దేశంలోని నూటికి నూరు శాతం మహిళా శక్తి మమ్మల్ని ఆశీర్వదించిందని నాకు తెలుసు. దేశంలోని ప్రతి మహిళకు నేను హామీ ఇస్తున్నాను: మహిళా రిజర్వేషన్ల మార్గంలోని ప్రతి అడ్డంకిని మేము తొలగిస్తాము. మా ధైర్యం అపారమైనది, మా సంకల్పం అచంచలమైనది, మా దృఢ నిశ్చయం చెక్కుచెదరనిది. మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించే పార్టీలు, పార్లమెంట్ శాసనసభలలో ఈ దేశ మహిళా శక్తి భాగస్వామ్యాన్ని పెంచుకోవడాన్ని ఎప్పటికీ ఆపలేవు. దీనికి పెద్దగా సమయం పట్టదు. మహిళా శక్తి సాధికారత కోసం బీజేపీ-ఎన్డీఏ సంకల్పం చెక్కుచెదరలేదు. నిన్న మాకు సంఖ్యాబలం లేదు, కానీ దాని అర్థం మేము ఓడిపోయామని కాదు. మా అంతర్గత శక్తి అజేయమైనది. మన ప్రయత్నం ఆగదు, విరమించదు. మనముందు మరిన్ని అవకాశాలు ఉన్నాయి. జనాభాలో సగభాగం మంది కలల కోసం, దేశ భవిష్యత్తు కోసం, మనం ఈ సంకల్పాన్ని నెరవేర్చాలి. మీ అందరికీ చాలా ధన్యవాదాలు.★

# ఇండీ కూటమికి రాజకీయ ముప్పు

**ఈ సవరణను తిరస్కరించడం ద్వారా, ప్రతిపక్షం కేవలం ఒక శాసన నిబంధనను అడ్డుకోవడమే కాకుండా, భారత మహిళల రాజకీయ భవిష్యత్తుపై వాస్తవంగా స్టే ఆర్డర్ జారీ చేసింది. తద్వారా, వారు కోరుకోని, అర్హత లేని ఒక దశాబ్దం పాటు నిరీక్షణలోకి వారిని నెట్టివేసింది. నారీ శక్తి వందన అధినియమ్‌ను అమలు అంచున నిలిపివేయడం ద్వారా, ప్రతిపక్షం తన రాజకీయ పరాజయాన్ని తానే సృష్టించుకుంది. వారి వ్యూహాత్మక తప్పిదాలు, అంతర్గత వైరుధ్యాలు ఏకమై, దేశంలోని అత్యంత నిర్ణయాత్మక ఓటర్ల వర్గాన్ని దూరం చేసిన తరుణం ఇది.**



ఏప్రిల్ 17, 2026న లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు విఫలమవడం, భారత ప్రజాస్వామ్య ప్రస్థాన చరిత్రలో ఒక ఘోర ద్రోహ దినంగా చిరకాలం నిలిచిపోతుంది. ఇండి అలయన్స్ ముఖంపై ఉన్న ప్రగతిశీల ప్రసంగాల ముసుగు చివరకు తొలగిపోయి, దాని తిరోగమన నిరోధక వైఖరి, సంకుచిత రాజకీయ మనుగడవాదం బయటపడిన క్షణం ఇది. 2029 ఎన్నికల నాటికి మహిళలకు సంస్థాగత ప్రాతినిధ్యం కల్పించే దిశగా ఒక చారిత్రాత్మక ముందడుగుగా ఉద్దేశించిన దానిని, ఉద్దేశపూర్వకంగా అడ్డుకున్నారు. ఈ సవరణను తిరస్కరించడం ద్వారా, ప్రతిపక్షం కేవలం ఒక శాసన నిబంధనను నిరోధించడమే కాకుండా, భారత మహిళల రాజకీయ భవిష్యత్తుపై వాస్తవంగా స్టే ఆర్డర్ జారీ చేసింది. తద్వారా, వారు కోరుకోని, అర్హత లేని ఒక దశాబ్దం పాటు నిరీక్షణలోకి వారిని నెట్టివేసింది. నారీ శక్తి వందన అధినియమ్‌ను అమలు ప్రారంభ దశలోనే నిలిపివేయడం ద్వారా, ప్రతిపక్షం తన రాజకీయ పరాజయాన్ని తానే కొనితెచ్చుకుంది. వారి వ్యూహాత్మక తప్పిదాలు, అంతర్గత వైరుధ్యాలు ఏకమై, దేశంలోని అత్యంత నిర్ణయాత్మక ఓటర్ల వర్గాన్ని దూరం చేసిన తరుణం ఇది.

**మహా ద్రోహం: ఒక దశాబ్దపు నిరాకరణ**

2023 నాటి శాసనపరమైన ఉద్దేశానికి, 2029 నాటి వాస్తవ ఆచరణకు మధ్య ఉన్న కాలవ్యవధిని పూడ్చగలగడమే 131వ సవరణ ప్రాముఖ్యత.

అసలు నారీ శక్తి వందన అధినియమ్ దాదాపు ఏకగ్రీవంగా ఆమోదించబడినప్పటికీ, దాని అమలు మాత్రం జనాభా లెక్కల అనంతర నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియతో ముడిపడిపోయింది. ఆ క్షణం ఆవశ్యకతను, భారత మహిళల ఆకాశా న్నంటు తున్న ఆకాంక్షలనుగుర్తించి, ప్రభుత్వం ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి పూనుకుంది. తద్వారా, రాబోయే లోక్‌సభలో 33 శాతం రిజర్వేషన్ వాస్తవ రూపం దాల్చేలా చూసింది. ఈ సవరణకు వ్యతిరే కంగా ఓటు వేయడం ద్వారా, మరో పదేళ్లపాటు పార్లమెంట్ ద్వారాలు మహిళలకు మూసివేసేలా ఇండీ కూటమి నిర్ధారించింది. ఇప్పుడు దీని అమలు 2034కు వాయిదా పడింది. ఈ సుదూర భవిష్యత్తు, మహిళా నాయకుల తరం మొత్తానికి రాజకీయ బహిష్కరణ శిక్షలా అనిపిస్తోంది.

ఇది కేవలం ఒక విధానపరమైన జాప్యం మాత్రమే కాదు; ఇది స్వీయ నిర్ణయాధికారాన్ని చురుకుగా నిరాకరించడమే. 2023 చట్టంలో తక్షణ సాధికారత వాగ్దానాన్ని చూసిన లక్షలాది మంది మహిళలకు, ఈ విధ్వంసం ఒక చేదు నిజాన్ని గుర్తు చేస్తుంది. అదేమిటంటే, కొన్ని రాజకీయ పార్టీలకు అధికారం అనేది ఒక జీరో-సమ్ గేమ్ (ఒకరి లాభం మరొకరి నష్టం) గానే మిగిలిపోతుంది. ఇందులో మహిళల భాగస్వామ్యం అనేది పాతుకుపోయిన పితృస్వామ్యానికి, వంశపారంపర్య వ్యవస్థలకు ఒక ముప్పుగా పరిగణనకు నోచుకుంటుంది. తమ సంప్రదాయ అధికార పీఠాలకు భంగం కలుగు తుందనే భయంతో ఉన్న ఇండీ కూటమి వ్యూహాత్మక ఆందోళనల ముందు, మహిళల ప్రాతినిధ్యం అనేది ఒక ద్వితీయ ప్రాధాన్యత గల అంశమని ప్రతిపక్షం భారత మహిళలకు స్పష్టంగా చెప్పింది.

**విభజన భూతం: ఒక తప్పుడు కథన విశ్లేషణ**

ఈ ద్రోహాన్ని సమర్థించుకోవడానికి ప్రతిపక్షాలు ఉపయోగించిన ప్రధాన అస్త్రం, ఉత్తర-దక్షిణ అసమ తుల్యత గురించి సృష్టించిన భయమే. వ్యూహాత్మక కచ్చితత్వంతో విస్తరింపజేసిన ఈ కథనం, 131వ రాజ్యాంగ సవరణను ప్రాంతీయ అణచి వేతకు ఒక సాధనంగా చిత్రీకరించడానికి ప్రయత్నిం చింది. అయితే, ప్రతిపాదిత 816-సీట్ల లోక్‌సభ గణాంక వాస్తవికతను నిశితంగా పరిశీలిస్తే, ఈ ప్రచారం నిశ్చయంగా బట్టబయలవుతుంది. ప్రభుత్వ ప్రతి పాదన ఏ ప్రాంత ప్రాతినిధ్యాన్ని తగ్గించడం గురించి ఎన్నడూ కాదు; అది పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజాస్వామ్య అవకాశాలను విస్తరిం చడం, ఏ రాష్ట్రం తన సాపేక్ష ప్రాధాన్యతను కోల్పో కుండా చూడటం గురించే. 816-సీట్ల నమూనా ప్రకారం, దక్షిణ రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో మొత్తం సీట్ల సంఖ్య ప్రస్తుత 129 నుండి 195కి పెరిగి ఉండేది. ఇది సంపూర్ణ లాభం, జాతీయ శాసనసభలో దక్షిణాది గొంతును బలోపేతం చేసే ఒక గణనీయమైన విస్తరణ. అయినప్పటికీ, ప్రతిపక్షం ఈ గణాంకాలను విస్మరించి, మహిళా సాధికారతను అడ్డుకోవడానికి ప్రాంతీయవాదాన్ని రెచ్చగొట్టడానికే మొగ్గు చూపింది. మొత్తం సభలో దక్షిణ రాష్ట్రాల వాటా స్థిరంగానే ఉండేదని పరిగణనలోకి తీసుకుంటే, ఆ రాష్ట్రాలు నష్టపోతాయన్న వారి వాదన ఒక డొల్ల కల్పన. అందువల్ల, మిగిలింది ఒక చట్టబద్ధమైన నిర్మాణాత్మక ఆందోళన కాదు, ప్రాంతీయ అధిపతుల యథాతథ స్థితిని సవాలు చేయగల కొత్త, స్వతంత్ర మహిళా నాయకుల వర్గం ఆవిర్భవించకుండా



నిరోధించడానికి రూపొందించిన రాజకీయ ప్రేరేపిత దిగ్బంధనం మాత్రమే. ప్రాంతీయ గుర్తింపును లింగ న్యాయానికి వ్యతిరేకంగా నిలబెట్టడం ద్వారా, ఇండీ కూటమి రెండింటిలోనూ విఫలమైంది.

2029లో ఎన్నికల ఆధిపత్యం కోసం భారతీయ జనతా పార్టీ నియోజకవర్గాల పునర్విభజనను ఒక ఊతకర్రగా వాడుకుంటోందన్నది ప్రతిపక్షాల వాదనలో మరో కోణం. ఈ ఆరోపణ ఎంత నిస్సహాయమైనదో, వాస్తవానికి అంత దూరమైనది.

2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత భారత్ రాజకీయ ప్రస్థానం నిరూపించింది ఏమిటంటే, బీజేపీ బలం నియోజకవర్గాల పటాన్ని తిరిగి గీయడంలో కాకుండా అది సంస్థాగత పటిష్టత. సైద్ధాంతిక స్పష్టతలో పాతుకుపోయి ఉందని. 2024 ఫలితాలు స్థానిక నిర్లక్ష్యం కారణంగా వ్యూహాత్మకంగా వెనుకబడిన ఫలితమే అయినా, ఆ తర్వాత మహారాష్ట్ర, బిహార్, హరియాణా, ఢిల్లీలలో సాధించిన నిర్ణయాత్మక విజయాలు పార్టీ పునాది నిర్మాణాత్మకంగా చెక్కుచెదరకుండా ఉందని, వేగంగా సర్దుబాటు చేసుకోగల సామర్థ్యం ఉందని నిరూపించాయి.

ప్రస్తుత పరిమితులతోనే రాష్ట్రాల తర్వాత రాష్ట్రాలను కైవసం చేసుకోగల పార్టీకి విజయం సాధించడానికి కొత్త పటం అవసరం లేదు. 131వ సవరణ కోసం జరిగిన ఒత్తిడికి కారణం నారీ శక్తి పట్ల ఉన్న నాగరికతా నిబద్ధతే తప్ప, ఎన్నికల్లో విజయానికి అడ్డదారుల అన్వేషణ కాదు. ఈ బిల్లును అడ్డుకోవడం ద్వారా ప్రతిపక్షం బీజేపీకి ఆటంకం కలిగించలేదు; అది కేవలం భారత మహిళలకు మాత్రమే ఆటంకం కలిగించింది. అది ఒక పరివర్తనాత్మక జాతీయ సంస్కరణను ఒక పక్షపాత ఎత్తుగడగా పొరబడింది. అలా చేయడం ద్వారా, దృఢమైన మహిళా ఓటర్లు కుల, ప్రాంతీయ హద్దులను దాటి చైతన్యవంతమైన, సాంప్రదాయ ఓటు బ్యాంకుల స్థానంలోకి వస్తుండటంతో మారుతున్న రాజకీయ వాతావరణం పట్ల తనకున్న భయాన్ని బయటపెట్టుకుంది.

## చారిత్రక కపటత్వం-అడ్డంకుల నైజం

ఈ తాజా ద్రోహాన్ని అర్థం చేసుకోవాలంటే, మహిళా రిజర్వేషన్ బిల్లు సుదీర్ఘ చరిత్రను పరిశీలించాలి. ప్రస్తుతం ఇండీ కూటమిలో కీలకంగా ఉన్న పార్టీలే ఈ బిల్లును దశాబ్దాలుగా బందీగా ఉంచాయి. 1990ల చివరలో సభ మధ్యలో బిల్లును చించివేయడం నుండి యూపీఏ హయాంలోని వ్యూహాత్మక జాప్యాల వరకు, మహిళా నాయకత్వం పట్ల వ్యతిరేకత ప్రతిపక్ష నైజంలో ఒక స్థిరమైన పోకడగా ఉంది. నేటి తేడా ఏమిటంటే, మద్దతు అనే ముసుగు మరింత పలుచబడింది.

2023లో, ప్రజా ఒత్తిడి అధికంగా ఉండటంతో వారు బిల్లుకు అనుకూలంగా ఓటు వేశారు. 2026లో, జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజనలోని సాంకేతిక అంశాల వెనుక దాక్కోవచ్చని భావించి, దాని అమలును అడ్డుకున్నారు. సంక్షేమ పథకాలకు మహిళలను ఒక ప్రయోగశాలగా చూస్తూ, వారిని పరిపాలనలో భాగస్వాములుగా ఎన్నడూ పరిగణించని రాజకీయ వర్గానికి ఇది ఒక ప్రత్యేక లక్షణం. మహిళలు లబ్ధిదారులుగా ఉండటంతో వారు సౌకర్యంగా ఉంటారు. కానీ అదే మహిళలు నిర్ణయాలు తీసుకునేవారిగా ఉండటాన్ని చూసి భయపడతారు. 131వ సవరణ వారి చిత్తశుద్ధికి ఒక గీటురాయిగా నిలిచింది. కానీ వారు అందులో ఘోరంగా విఫలమయ్యారు. 2034 వరకు 33 శాతం కోటాను కేవలం కాగితపు వాగ్దానంగానే ఉంచడం ద్వారా, లింగ సమానత్వం పట్ల తమ నిబద్ధత అనేది, తమ అంతర్గత అధికార సమీకరణాలతో విభేదించినప్పుడు సులభంగా పక్కన పెట్టే ఒక ఎన్నికల ప్రదర్శన తప్ప మరేమీ కాదని వారు నిరూపించుకున్నారు.

## నిర్ణయాధికార శక్తి ఆవిర్భావం

2024లో తగ్గిన మెజారిటీలు బీజేపీ కార్యకర్తలకు ఒక కీలకమైన గుణపాఠంగా నిలిచాయి. సులభతరం చేసే ధోరణిలోని ప్రమాదాలను, నిరంతర క్షేత్రస్థాయి భాగస్వామ్యం ఆవశ్యకతను ఇది స్పష్టం చేసింది. అయితే, ప్రతిపక్షాలు దీనిని పార్టీ పతనానికి సంకేతంగా తప్పుగా అర్థం చేసుకున్నాయి. భారతీయ ఓటరు, ముఖ్యంగా మహిళా ఓటరు, ఇకపై కేవలం సందేశాలను నిష్క్రియంగా స్వీకరించే వ్యక్తి కాదని, ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకైన భాగస్వామి అని గ్రహించడంలో వారు విఫల మయ్యారు. ప్రస్తుతం ఓటర్లలో మహిళలు దాదాపు 49 శాతం ఉన్నారు. అనేక కీలక రాష్ట్రాలలో వారి ఓటింగ్ శాతం పురుషుల కంటే నిలకడగా ఎక్కువగా ఉంది. ఇదే నిర్ణయాధికార శక్తి, ప్రభుత్వాల మనుగడను నిర్ధారించే కీలకమైన అంశం. ఈ జనాభా వర్గం, స్పష్టమైన ప్రయోజనాలకు స్పందించి నంతగానే, సమ్మిళిత రాజకీయాలకు, ప్రతీకాత్మక గుర్తింపునకు కూడా స్పందిస్తుంది. మరో దశాబ్దం పాటు పార్లమెంటులోకి మహిళల ప్రవేశాన్ని సమర్థవంతంగా నిలిపివేయడం ద్వారా, ఇండీ కూటమి వ్యూహాత్మక ఆత్మహత్య చేసుకుంది. 2029 నాటికి మీకు మీ హక్కులను ఇవ్వడానికి మేము ప్రయత్నించాము, కానీ వారు దానిని అడ్డుకున్నారు అనే ఒక శక్తివంతమైన నైతిక కథనాన్ని అధికార పక్షానికి అందించింది. ప్రజల దృష్టిలో జన గణన కాలపట్టికలు, నియోజక వర్గాల పునర్విభజన కమిషన్ల సంక్లిష్టతలు తొలగిపోయి, అడ్డంకులకు, సాధికారతకు మధ్య ఉన్న సరళమైన, సూటియైన సత్యం బయటపడింది.

**డిజిటల్ అవగాహన - అడ్డుగోడలు ధ్వంసం**

ఆధునిక మహిళా ఓటరును తీర్చిదిద్దడంలో డిజిటల్ కనెక్టివిటీ పాత్రను ప్రతిపక్షం కూడా తక్కువ అంచనా వేస్తోంది. గత దశాబ్దాలలో, జాతీయ రాజధానిలోని రాజకీయ ఎత్తుగడలు ప్రాంతీయ మీడియా వల్ల మరుగున పడిపోయేవి లేదా విధానపరమైన పరిభాషలో కూరుకుపోయేవి. నేడు, బిహార్‌లోని మారుమూల గ్రామంలో గానీ లేదా బెంగళూరులోని ఒక వృత్తి కేంద్రంలో గానీ స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతి మహిళకు శాసనపరమైన అడ్డంకుల గురించి తెలుసు. నారీ శక్తి నినాదం కేవలం పైనుంచి వచ్చే నినాదం మాత్రమే కాదు; అది ఒక జీవన ఆకాంక్ష. 131వ రాజ్యాంగ సవరణ ఓడిపోయి నప్పుడు, ఆ వార్త కేవలం రాజకీయ ఉన్నత వర్గాలకే చేరలేదు. అది స్వయం సహాయక బృందాలకు, స్థానిక పారిశ్రామికవేత్తలకు, 2029లో తమ ప్రయోజనా లకు మహిళలు ప్రాతినిధ్యం వహించడాన్ని చూడాలని ఎదురుచూస్తున్న తొలిసారి ఓటు వేస్తున్న ఓటర్లకు కూడా చేరింది. పార్లమెంటుకు అడ్డుగోడలు కట్టాలనే ప్రతిపక్ష ప్రయత్నం, వారు ప్రసన్నం చేసుకోవాలను కుంటున్న ప్రజలకే ప్రత్యక్షంగా ప్రసారం చేయడ మైంది. ఈ పారదర్శకత వల్ల, తమ మేనిఫెస్టోలలో మహిళా అనుకూలురమని చెప్పుకుంటూ, పార్లమెంటరీ ఓట్లలో మహిళా వ్యతిరేకులమని చెప్పుకునే ద్వంద్వ గుర్తింపును కొనసాగించడం ఇండీ కూటమికి అసాధ్యమైంది. దాని మాటలకూ, చేతలకూ మధ్య అంతరం పూడ్చలేని అగాధంగా మారింది. భారత్ మునుపెన్నడూ చూడని స్థాయిలో రాజకీయ చైతన్యంతో మహిళా ఓటర్లు దీనిని గమనిస్తున్నారు.

**రాజకీయ కపటత్వానికి తగిన మూల్యం**

ఈ సవరణ విఫలం కావడం ప్రతిపక్ష జవాబు దారీతనంపై ప్రాథమిక ప్రశ్నలను లేవనెత్తుతోంది. దశాబ్దాలుగా, ఈ పార్టీలు ఎన్నికల సమయంలో మహిళా రిజర్వేషన్లను ఒక అనుకూలమైన నినాదంగా వాడుకుని, వాటి అమలు వాస్తవరూపం దాల్చగానే తెరమరుగులోకి వెళ్లిపోయాయి. 2023 ఏకాభిప్రాయం జాతీయ ఐక్యతకు ఒక అరుదైన క్షణం. కానీ 2029 నాటికి దానిని క్రియాశీలం చేయడానికి తదుపరి చర్య అవసరమైన తరుణంలో, ఆ ఐక్యత విధానపరమైన సాకుల మేఘంలో కలిసిపోయింది. ప్రాంతీయ భ్రమలు, వ్యూహాత్మక అడ్డంకుల బలిపీఠంపై మహిళల రాజకీయ ప్రాతినిధ్యాన్ని ఎందుకు బలిచ్చారో భారత మహిళలకు వివరించాల్సిన కఠినమైన సవాలును ఇప్పుడు ఇండీ కూటమి ఎదుర్కొంటోంది. మహిళా ఓటర్లు ఈ సంఘటనను ప్రజాస్వామ్య ప్రక్రియలో తమ న్యాయమైన వాటాను నిరాకరించడంగా భావిస్తే, ప్రతిపక్షానికి ఎన్నికల పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. వారు తమను తాము ఒక అవగాహన శూన్యంలో బంధించుకున్నారు. అక్కడ వారు పాత, పురుషాధిక్య వ్యవస్థకు సంరక్షకులుగా కనిపిస్తున్నారు. అదే సమయంలో ప్రధానమంత్రి, ఆయన పార్టీ ఒక నూతన, సమ్మిళిత భారత్ విజేతలుగా పరిగణనలోకి వచ్చారు. ఇది కేవలం శాసనపరమైన వైఫల్యం మాత్రమే కాదు; ఇది ఒక నైతిక దివాలా, ఇది దేశవ్యాప్తంగా ప్రతి పోలింగ్ బూత్‌లో ప్రతిపక్షాన్ని వెంటాడుతుంది.

**అపోహల ఉచ్చులో ప్రతిపక్షాలు**

రాజకీయాల్లో, శాసనపరమైన వివరాల కంటే అపోహలే తరచుగా బలంగా ఉంటాయి. సీట్ల విస్తరణపై ప్రభుత్వం విడుదల చేసిన పారదర్శకమైన గణాంకాల ద్వారా వారి వాదనలు ఇప్పటికే బహిరంగంగా పటాపంచలు కావడంతో, ప్రతిపక్షాల సందిగ్ధత మరింత తీవ్రమైంది. సంఖ్యలు ఏమాత్రం సమర్థించని ప్రాంతీయ అసమతుల్యత గురించిన ఆందోళనలను ప్రముఖంగా ప్రస్తావించడం ద్వారా, వారు ఆకాంక్షలు, గణాంకాలపై అవగాహన ఉన్న ప్రజలను ఇకపై ఆకట్టుకోలేని ఒక కథనానికి తమను తాము బంధించుకున్నారు. అదే సమయంలో, నియోజకవర్గాల పునర్విభజన లేకుండా 2029 నాటికి మహిళా రిజర్వేషన్లకు వీలు కల్పించే ఎలాంటి స్పష్టమైన ప్రత్యామ్నాయాన్ని వారు ప్రదర్శించలేక పోవడం, వారి దూరదృష్టి లోపాన్ని బయటపెడు తోంది. వారు 'కాదు' అని చెప్పే పక్షంగా, అడ్డుకునే పక్షంగా, మార్పుకు భయపడే పక్షంగా కనిపిస్తున్నారు. దీనికి భిన్నంగా, అధికార పక్షం మహిళలు, రాష్ట్రాల ఆకాంక్షలకు అనుగుణంగా లోక్‌సభ స్వరూపాన్నే విస్తరించడానికి సుముఖతను ప్రదర్శించింది. పురోగతి కోసం ప్రయత్నించే పక్షమే నైతికంగా ఉన్నత స్థానాన్ని పొందుతుంది. దీనిని అడ్డుకునే పక్షం తన విశ్వసనీయతను, భవిష్యత్తును కోల్పోతుంది. ఇండీ కూటమికి 131వ సవరణ ఓటమి ఒక వ్యూహాత్మక విజయం కాదు; అది వారిని చరిత్రలో తప్పుడు పక్షాన నిలబెట్టిన ఒక వ్యూహాత్మక విపత్తు.

**2034 తర్వాత.. విధ్వంసపు సుదీర్ఘ ఛాయ**

2029, 2034 సంవత్సరాలకు దారి తీసే మార్గం ఇప్పుడు ఈ విధ్వంసకర క్షణంతోనే నిర్వచించబడుతుంది. బీజేపీ గెలవడానికి నియోజక వర్గాల పునర్విభజన అవసరమనే అపోహ, దాని సంస్థాగత పటిష్టత, ఎదురుదెబ్బల నుండి పాఠాలు నేర్చుకునే సామర్థ్యం వల్ల పూర్తిగా పటాపంచలైంది. ముందున్న అసలైన పోరాటం నియోజకవర్గాల సరిహద్దుల కోసం కాదు, సాధికారత అనే నినాదం కోసం జరుగుతుంది. ఇండీ కూటమి బీజేపీకి ఒక శక్తివంతమైన సైద్ధాంతిక ఆయుధాన్ని అందించింది, అది భారతదేశంలోని ప్రతి ఇంటిలోనూ ప్రతిధ్వనిస్తుంది. మహిళా రిజర్వేషన్లను 2034 వరకు వాయిదా వేయడం అధికార పక్షానికి ఒక నినాదంగా, ప్రతిపక్షాల ద్రోహానికి నిరంతర గుర్తుగా మారుతుంది.

జాతీయ పురోగతి కంటే తమ మనుగడకే ఎక్కువ విలువనిచ్చే రాజకీయ వర్గం వల్ల తమ నాయకత్వ కలలు వాయిదా పడటాన్ని చూస్తున్న మహిళా ఓటర్ల నిశ్శబ్ద విప్లవాన్ని సమీకరించడానికి ఇది ఉపయోగించబడుతుంది.

దేశం తదుపరి ఎన్నికల చక్రం వైపు పయనిస్తున్న ప్పుడు, ఏప్రిల్ 17, 2026 జ్ఞాపకం మనసులో నిలిచిపోతుంది. నారీశక్తి యాత్రను అడ్డుకోవాలని ప్రతిపక్షం నిర్ణయించుకున్న రోజుగా ఇది గుర్తుండి పోతుంది, అలా చేయడం ద్వారా వారు తమ అంతిమ ఓటమిని ఖాయం చేసుకున్నారు. ఈ విధ్వంసం నీడ 2029 ఎన్నికలను దాటి చాలా కాలం పాటు కొనసాగుతుంది. ఆధునిక, అభివృద్ధి చెందుతున్న భారత్ ఆకాంక్షలకు తామే ప్రతినిధు లమన్న ప్రతిపక్ష వాదనలపై చీకటిని కమ్మేలా చేస్తుంది.

– జాగృతి డెస్క్





# కార్పొరేట్ 'మ

**భారతదేశంలో ఐటీ దిగ్గజంగా పేరు గాంచిన టీసీఎస్ నాసిక్ క్యాంపస్‌లో మత శక్తులు పన్నిన కుట్రలు దేశంలో సంచలనం రేపాయి. ఈ క్యాంపస్‌లో కొంతమంది సిబ్బంది మహిళా ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని లైంగికంగా వేధించడమే కాకుండా మత మార్పిడులకు కూడా పాల్పడ్డారనే ఆరోపణలపై కొందరిని మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేయడంతో యావత్ దేశం కలవరపడింది. కేవలం మహిళలనే కాకుండా హిందూ ధర్మాన్ని వ్యతిరేకిస్తూ పురుష సిబ్బందిని కూడా వేధించినట్టు వార్తలున్నాయి. ఉద్యోగుల ప్రయోజనాలకు కాపాడాల్సిన హెచ్ఆర్ మేనేజర్ సహా ఏడుగురు ఉద్యోగులను ఈ కుట్రలో భాగస్వాములుగా గుర్తించిన పోలీసులు వారిని అరెస్టు చేయడంతో మహారాష్ట్ర ప్రభుత్వం పూర్తి విచారణకు ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసింది.**

మహిళా ఉద్యోగులను నయానా భయానా లొంగదీసుకొని అనంతరం వారిని మచ్చిక చేసుకున్న కొందరు ఉద్యోగులు లైంగిక వేధింపులతో పాటు మత మార్పిడులకు ప్రోత్సాహించారు. 2022 నుండి 2026 వరకు నాలుగేళ్లుగా ఈ ప్రముఖ కంపెనీలో ఇలాంటి ఘటనలు జరుగుతుండగా ఇటీవల కొందరు మహిళలు ధైర్యంతో ముందుకొచ్చి ఫిర్యాదు చేయడంతో ఇక్కడి దుర్మార్గాలు వెలుగు చూశాయి. లైంగికంగా వేధిస్తూ మత మార్పిడి కోసం ఒత్తిడి తెచ్చినట్టు 8 మంది మహిళలతో పాటు హిందూ ధర్మాన్ని అవమానించారని మరో వ్యక్తి కూడా చెప్పడంతో మొత్తం మీద 9 ఫిర్యాదులపై స్థానిక పోలీసులు లోతైన విచారణ చేపట్టారు.

దురదృష్టవశాత్తు ప్రస్తుత కాలమానంలో అన్ని రంగాల్లో మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులు జరుగుతున్న వార్తలు తరచూ భయటపడుతున్నా టీసీఎస్ ఘటనలో మరింత బయంకరమైన అంశాలు వెలుగుచూశాయి. ఇక్కడ మహిళా సిబ్బందిని లైంగికంగా ఇబ్బందులు పెట్టడమే కాకుండా లవ్ జిహాద్ లక్ష్యంగా మతం మారాలనే ఒత్తిడి తెచ్చి వేధించారు. విచారణ చేపట్టిన పోలీసులు కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ నిదాఖాన్‌తో పాటు అసిఫ్ అన్సారీ, షఫీ షేక్, షారుఖ్ ఖురేషి, రజా మేమన్, తౌసిఫ్ అత్తర్, డానిష్ షెక్‌లను అరెస్టు చేశారు. మరికొందరు ఉద్యోగులు పరారీలో ఉన్నారు. పారిపోయిన ఉద్యోగుల్లో ఒక మహిళా ఉద్యోగి కూడా ఉన్నారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన వీరందరూ హిందూ మతాన్ని లక్ష్యంగా చేసుకొని సంస్థలో కుట్రలు పన్నారనేది బహిరంగ రహస్యం. అనుచితంగా తాకడం, అసభ్యకరంగా మాట్లాడడం, బాడీ షేమింగ్ చేయడం, ఇష్టంలేకపోయినా మాంసాహారం బీఫ్ తినాలని ఒత్తిడి తేవడం, హిందూదేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం వంటి చర్యలకు పాల్పడ్డారు. వీరిపై బాధిత మహిళలు హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్‌కు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోక పోవడంతో ఈ దుష్టశక్తులు మరింత రెచ్చిపోయాయి. వేధిస్తున్న వారిని చూసీ చూడనట్టు వదిలేయాలని, వారితో సన్నిహితంగా ఉండాలని, లేకపోతే వారితో మరిన్ని సమస్యలొస్తాయని హెచ్ఆర్ అధికారులు ఉద్యోగులకు ఉచిత సలహా లిస్తూ ఇలాంటి ఘటనలను ప్రోత్సాహించారు. మరోవైపు నిందితుల్లో కొందరు టీమ్ లీడర్లుగా ఉండడంతో విధుల్లో ఇబ్బందులో కలిగిస్తారేమోనని బాధితులు మౌనం దాల్చారు. ఉద్యోగుల బాగోగులు చూడాల్సిన హెచ్ఆర్ విభాగాధిపతే కుట్రలో భాగస్వామ్యం కావడంతో బాధితుల ఆవేదన అరణ్య రోదనగా మారింది. చివరికి ఒక మహిళా ఉద్యోగి తనను పెళ్లి పేరుతో మోసం చేశారని ఒకరిపై ఫిర్యాదు చేయడంతో తీగ లాగితే డొంకంతా కదిలింది.





నాసిక్ టీసీఎస్‌లో లైంగిక వేధింపులు, మత మార్పిడి ఘటనలను పోలీసులు సినిమా ఫక్కీలో బట్టబయలు చేశారు. క్యాంపస్‌లో అరాచకాలపై మహిళా ఉద్యోగులు చేసిన ఫిర్యాదుతో పోలీసులు కోవర్ట్ ఆపరేషన్ చేపట్టారు. ఏడుగురు మహిళా పోలీసులు మారువేషంలో పనిమనిషుల్లా విధులు నిర్వహిస్తున్నట్టు నటించారు. వారు టీసీఎస్ క్యాంపస్‌లో ఒక వ్యక్తి ఓ మహిళా ఉద్యోగితో అసభ్యంగా ప్రవర్తిస్తున్న సమయంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ క్రమంలో మిగిలిన వారిపై వచ్చిన ఆరోపణలపై విచారణలో భాగంగా సీసీటీవీ ఫుటేజీలను, వాట్సప్ సమాచారాన్ని పరిశీలించి చర్యలు తీసుకున్నారు. మార్చి నెలలో ఓ మహిళా ఉద్యోగి పెళ్లి పేరుతో తనను శారీరకంగా లొంగదీసు కున్నారంటూ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కోవర్ట్ ఆపరేషన్ చేపట్టడంతో సంస్థలో పలు దారుణాలు వెలుగులోకివచ్చాయి. లోతైన దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ ఇది కేవలం వ్యక్తిగత నేరం కాదని వ్యవస్థీకృత వేధింపులని పోలీసుల విచారణలో తేలింది. ఈ ఉదంతాన్ని తీవ్రంగా పరిగణించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ లోతైన దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేస్తూ ఆదేశించడంతో మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకా శాలున్నాయి.

వైట్‌కాలర్ ఉద్యోగులుగా చెలామణి అయ్యే సాఫ్ట్‌వేర్ సంస్థలో సహచర పైశాచిక ఉద్యోగుల అనాగరికమైన చర్యలకు బలైన ఒకరైన ఎస్సీ మహిళ తొలుత ముందుకొచ్చి ఫిర్యాదు చేయడంతో ఈ బండారం బయటపడింది. దనిష్ అనే ఉద్యోగి 2022లో ఆ మహిళతో పరిచయం పెంచుకొని కంపెనీలో ఉన్నత స్థానం కల్పిస్తానని బూటకపు మాటలతో నమ్మించి సన్నిహితంగా మెలుగుతూ




# త మార్పిళ్లు'

లైంగికంగా వేధిస్తూ పెళ్లి పేరుతో ఆమెను మోస గించాడు. ఒకే కార్యాలయంలో పనిచేస్తుండడంతో భోజన సమయంలో, ఇతర సమయాల్లో దనిష్‌తో పాటు మరో సహచర ఉద్యోగి తౌషిఫ్ హిందూ ధర్మం, ఇస్లాం మతం గురించి తరచూ చర్చిస్తూ తమ మతం హిందూ ధర్మం కంటే గొప్పదని చెబుతుండేవాడు. దీనిపై ఆమె అయిష్టత వ్యక్తం చేసినా వదిలిపెట్టేవారు కారు. ఈ చర్చల్లో సనాతన ధర్మాన్ని అవహేళన చేస్తూ శివలింగం రూపం గురించి అసభ్యంగా మాట్లాడేవారు. ద్రౌపదికి ఐదుగురు భర్తలు అని, శ్రీకృష్ణుడు స్త్రీలోలుడని అవమానించేవాడని ఆమె పేర్కొంది. వారు ఆమెను లైంగికంగా వేధించడమే కాకుండా బ్లాక్‌మెయిల్ చేశారు. వీరికి హెచ్‌ఆర్ నిదాఖాన్ కూడా తోడై హిందూదేవుళ్లపై అవ మానంగా మాట్లాడేవాడు. ఈ మహిళ ధైర్యంగా వీరి ఆగడాలను బట్టబయలు చేయడంతో ఆమె స్ఫూర్తితో ఇతర బాధితులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాసిక్ మత మార్పిళ్లలో మలేషియా లింక్ కనిపించడం ఆందోళనకరం. మలేషియాలో ఒక ఇస్లాం మత ప్రచారకుడితో వీరికి సంబంధాలున్నట్లు విచారణలో బయటపడడంతో పోలీసులు విస్తు పోయారు. ఈ పరిణామాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలిస్తే వీరి వెనుక అంతర్జాతీయ 'లవ్ జిహాద్' కుట్రలున్నట్టు అనుమానాలున్నాయి.

విచారణలో జిహాదీల కుట్రలు ఒక్కొక్కటి వెలుగు చూస్తుండడంతో భారత సమాజం విస్తు పోయింది. మహిళలతో పాటు మరొక వ్యక్తి సనాతన ధర్మంపై కార్యాలయంలో ఒక బృందం చేస్తున్న దాడులను, తనను, తన భార్యను అవమానించిన తీరు గురించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీసీఎస్ సంస్థలో మత ఛాందసవాదుల ఆగడాలపై హెచ్‌ఆర్ అధికారులకు సిబ్బంది మెయిల్ ద్వారా ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోలేదని పలువురు తెలిపారు. ఈ ఘటనలపై టీసీఎస్ అధికారులు స్పందిస్తూ సీనియర్ అధికారుల నేతృత్వంలో విచారణకు ఆదేశించారు. వాస్తవాలను నిర్ధారించడంతో పాటు బాధ్యులను గుర్తించడం, బాధితులను అండగా ఉండడం కోసం చర్యలు తీసుకుంది. కంపెనీలో 'జీరో టాలరెన్స్'–ఏ మాత్రం ఉపేక్షించని విధానానికి చర్యలు తీసుకుంటున్నట్టు కంపెనీ ప్రకటించింది.

**అమరావతిలో 180 మంది బాలికలపై లైంగిక వేధింపులు**

టీసీఎస్ సంస్థలో మతమార్పిడి కుట్రలు దేశంలో సంచలనం రేపిన సమయంలోనే మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలో 19 ఏళ్ల మహ్మద్ అయాన్ అలియాస్ తన్వీర్ అనే యువకుడు 180 మంది బాలికలను లైంగికంగా వేధించి వారికి సంబంధించిన 350కు పైగా అశ్లీల వీడియోలను తీసిన భయంకరమైన ఘటన వెలుగు చూసింది. ఈ ప్రబుద్ధుడు మిత్రులతో పందెం కాసి అమ్మాయి లను ట్రాప్ చేసి వీడియోలు రికార్డు చేసినట్టు విచారణలో తేలింది. ఇలాంటి అఘాయిత్యానికి పాల్పడిన ఈ నిందితుడికి మజ్లిస్ పార్టీతో సంబంధా లున్నాయి. అమరావతిలో ఇటీవల జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో భారీ విజయం సాధించిన మజ్లీస్ వెనుక తన్వీర్ హస్తం కూడా ఉంది. అతడు పార్టీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్‌గా పనిచేశాడు. నాసిక్, అమరావతి లైంగిక వేధింపుల ఘటనలు మన దేశంలో ప్రమాదకర శక్తుల పాత్రను తెలియజేస్తున్నాయి.

నాసిక్ టీసీఎస్, అమరావతి ఘటనలను మన దేశంలోని కుహనా మేధావులు, సెక్యులరిస్టులు కొట్టిపారేస్తూ యువత పరస్పరం అవగాహనతో ప్రేమించుకోవడం, పెళ్లిళ్లు చేసుకోవడం సర్వ సాధారణమని ఇందులో తప్పేముందని ప్రశ్నిస్తు న్నారు. ఈ రోజుల్లో చాలాచోట్ల లైంగిక వేధింపులు, మహిళల పట్ల వివక్ష ఘటనలు జరుగుతున్నాయని, ఇలాంటి ఘటనలను సమాజానికి మచ్చగానే చూడాలని, వీటిని మత కోణంలో చూడకూడదని చెబుతున్నారు. అయితే ఇక్కడ గమనించాల్సిన తీవ్రమైన అంశం ఏమిటంటే ఒక మత పైశాచిక ముఠా మరో సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని మహిళా ఉద్యోగులను లైంగికంగా వేధించడమే కాకుండా వారి ధర్మాన్ని అవహేళన చేయడం తగదు. సనాతన ధర్మాన్ని అవమాన పరుస్తూ, ఇస్లాం మతం గొప్పదని ప్రలోభాలకు గురి చేయడం మత కోణం కాదా? హిందూ దేవతలపై జుగుప్సాకరంగా వ్యాఖ్యలు చేయడం మత జాఢ్యం కాదా..? నాసిక్ టీసీఎస్ క్యాంపస్‌లో సనాతన ధర్మానికి వ్యతిరేకంగా ఇస్లాం మతమౌఢ్యులు ప్రత్యేకంగా ఒక వాట్సప్ గ్రూపు నిర్వహించుకుంటూ తరచూ సమాచారాన్ని చేరవేసుకోవడమే కాకుండా వారి లక్ష్యాలను నిర్దే శించుకునే వారు. దేశంలో బుజ్జగింపు రాజ కీయాలకు పాల్పడే రాజకీయ పార్టీలు, కుహనా మేధావులు లవ్‌జిహాద్ అనే మాట అంటే మండి పడుతారు. ప్రేమకు కులం, మతం ఉండదని, ప్రేమించడం వ్యక్తిగత స్వేచ్ఛ, మత స్వాతంత్ర్యం, చట్టబద్ధ హక్కులని వాదిస్తుంటారు. స్వేచ్ఛ అంటే ఇతర మతాలను, హైందవ ధర్మాన్ని కించపరచడమేనా? ఉద్దేశపూర్వకంగా, ప్రణాళిక బద్ధంగా చేసిన ఈ ఘటనలన్నింటినీ జాతీయవాదులు చేస్తున్న అసత్య ప్రచారాలుగా కుహనా సెక్యులరిస్టులు సమర్థిస్తారా? లేదా బుజ్జగింపు రాజకీయాలకు అలవాటు పడిన వీరు హిందూ ప్రజలకు మనో భావాలే ఉండవని భావిస్తూ, ముస్లిం మనోభావాలను పరిరక్షిస్తూ షరా మామూలుగానే ఈ ఘటన లన్నింటినీ జాతీయవాదులే సృష్టించారని ఆరోపిస్తూ చేతులు దులుపుకుంటారు.

లవ్ జిహాద్ పేరుతో దేశంలో హిందువులను లక్ష్యంగా చేసుకోవడం ఇటీవల పరిపాటిగా మారింది. ప్రేమ పేరుతో ప్రలోభాలకు గురిచేసి మత మార్పిడులు చేయిస్తున్న కేసులు దేశంలో తరచూ కనిపిస్తున్నాయి. ప్రత్యేకంగా భారత చట్టాల్లో లవ్ జిహాద్ పదం లేదు కాబట్టి అధికారికంగా ఆ పేరిట కేసులు నమోదు కావు. దేశంలో గత కొంతకాలంగా ఇదే తరహా ఘటనల్లో నమోదైన కేసులను పరిశీలిస్తే ప్రలోభాలతో మతమార్పిడి ఘటనలు భారీగానే కనిపిస్తున్నాయి.

లవ్ జిహాద్ వంటి మత మార్పిడులకు సంబంధించి మధ్యప్రదేశ్‌లో 2020 నుండి 2025 మధ్య సుమారు 250కు పైగా కేసులు నమోదయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లో దీనికి వ్యతిరేకంగా 2020లో ప్రత్యేకంగా చట్టం తీసుకొచ్చిన తర్వాత 400కు పైగా కేసులు నమోదయ్యాయి. మహారాష్ట్రలో కూడా భారీ సంఖ్యలో ఇలాంటి కేసులున్నాయి. ఈ గణాంకాలు సమాజంలో ఉన్న మతమౌఢ్యం ప్రమాదకరం తీవ్రతను తెలియజేస్తున్నాయి. దేశంలో ప్రేమ పేరుతో మోసం చేస్తున్న లవ్ జిహాదీలను అరికట్టేందుకు కొన్ని రాష్ట్రాలు ప్రత్యేకంగా చట్టాలు చేశాయి. ఉత్తరప్రదేశ్‌లో 2020లో, మధ్యప్రదేశ్‌లో 2021లో, గుజరాత్‌లో, కర్ణాటకలో 2021లో ప్రత్యేక చట్టం చేశారు. ఈ చట్టాల ప్రకారం బలవం తపు లేదా మోసం ద్వారా మత మార్పిడి చేయడం నేరం. నేరం నిరూపితమైతే 3 నుండి 10 సంవత్సరాల వరకు శిక్షలుంటాయి. ఇలాంటి చట్టాలను అన్ని రాష్ట్రాలు చేసి కఠినంగా వ్యవహరించాలి. ఆలస్య మైనా నాసిక్ టీసీఎస్ బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి యావత్ దేశాన్ని జాగృతం చేయడం అభినంద నీయం. ప్రధానంగా యువత ప్రలోభాలకు గురికాకుండా దేశ జాతీయత కోసం కట్టుబడడంతో పాటు సనాతాన ధర్మాన్ని పరిరక్షించాల్సిన ఆవశ్యక తను ఇలాంటి ఘటనలు నిరూపిస్తున్నాయి.

**– శ్రీపాద**




# అవిగో పరిష
# కాదు.. ఇప్పు

**రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల హడావిడి ముగిసింది. మున్సిపల్ ఎన్నికల సందడి తగ్గిపోయింది. ఎన్నికల వేడి చల్లారింది. అసలు వేసవి మొదలయ్యింది. కానీ, అందరూ మర్చిపోయిన మరో ఎన్నికల తంతు తలుపు తట్టబోతోంది. మరి.. ఈసారి వేదిక తెలంగాణలోని గ్రామాలు. ఇప్పటికే ఓసారి పంచాయతీ ఎన్నికల సందడి ముగిసింది. మధ్యలో పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీ పోరు మోగింది. ఇప్పుడు మరోసారి గ్రామీణ ప్రాంతాల ఓటర్లకు ఓటు వేసే సందర్భం రాబోతోంది. రాష్ట్రంలోని 566 మంది జడ్పీటీసీ స్థానాలు, 5,773 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నగారా మోగబోతోంది. అయితే, ఈ ఎన్నికల తంతు ఎప్పుడు మొదలవుతుందో అన్న అంశం సందిగ్ధంగా మారింది. ఓవైపు.. ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాను సిద్ధం చేసింది. అవసరమైన ఏర్పాట్ల కోసం అధికారులకు మార్గదర్శకాలు జారీచేసింది. దీంతో, పరిషత్ ఎన్నికల పోరు సమీపించిందని అంతటా చర్చ మొదలయ్యింది. కానీ, ప్రభుత్వం మాత్రం ఈ వేసవి గడవనీ..అన్నట్లుగా లీకులిచ్చింది. దీంతో, పరిషత్ ఎన్నికలపై క్లారిటీ రావడం లేదు. అయినప్పటికీ గ్రామీణ ప్రాంతల్లో ఎన్నికల సందడి అప్పుడే చిన్నగా మొదలయ్యింది.**

రాష్ట్రంలో జిల్లా, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (జడ్పీటీసీ, ఎంపీటీసీ) ఎన్నికల కోసం ఓటర్ల జాబితా తయారీకి రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఆయా పదవులకు పోటీ చేయడానికి ఆసక్తిగలవారు, ఆశావహులు సన్నద్ధమవుతున్నారు. కానీ... రాష్ట్ర మంత్రివర్గంలోని ఒక కీలక మంత్రి మాత్రం 'ఇప్పట్లో ఈ ఎన్నికలు జరగవు' సంకేతాలిచ్చారు. దీంత ఓ జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల ఎన్నికలు ఇప్పట్లో జరుగుతాయా? లేవా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

**ప్రత్యేకాధికారులే దిక్కు!**

2019 మే నెలలో మూడు దశల్లో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో విజేతలైన ప్రజా ప్రతినిధుల పదవీకాలం గత ఏడాది జూన్‌తో ముగిసింది. ఆ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. వారి అజమాయిషీలోనే పాలన సాగుతోంది. సాధారణంగా పదవీకాలం ముగిసిన వెంటనే లేదా దానికి కొద్దిరోజుల ముందు నుంచే ఎన్నికల ప్రక్రియ మొదలు కావాలి. గడువు ముగిసిన వెంటనే ఎన్నికలు పూర్తయి కొత్త పాలక వర్గాలు కొలువుదీరాలి. కానీ, పరిషత్ ఎన్నికల విషయంలో ప్రభుత్వం అంతగా దృష్టి సారించడం లేదు. గత ఏడాది సెప్టెంబర్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. కానీ, అప్పుడే బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఎన్నికల ప్రక్రియ కోర్టు ఆదేశాల మేరకు మధ్యలోనే నిలిచి పోయింది. నాటి ఈ ఎన్నికల నిర్వహణ సందిగ్ధంలో పడింది.

హైకోర్టు అనుమతి లభించడంతో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమ మైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం తమ కార్యాచరణ మొదలుపెట్టేందుకు సిద్ధమైంది. ఓటర్ల జాబితా తయారీకి కీలక ఆదేశాలు జారీ అయ్యాయి. హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి మినహా మిగిలిన 31 జిల్లాల కలెక్టర్లకు స్పష్టమైన దిశానిర్దేశ వెళ్లింది. జూలై 10,2025 నుంచి ఫిబ్రవరి 5, 2026 వరకు నవీకరించిన ఓటర్ల జాబితా ఆధారంగా అదనపు ఓటర్లను గుర్తించాలని, వారిని గ్రామ పంచాయతీలు, పోలింగ్ కేంద్రాల వారీగా వర్గీకరించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల అధికారులు ఆదేశించింది. ఏప్రిల్ 23వ తేదీలోగా డేటాలోని వ్యత్యాసాలను నివేదించాలని, ఆ తర్వాత ముసాయిదా జాబితా విడుదల చేసి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుది జాబితాను ప్రకటిస్తామని ఎస్ఈసీ స్పష్టం చేసింది. బ్యాలెట్ బాక్సుల తయారీకి కూడా పనులు మొదలుపెట్టాలని ఆదేశాలు వెళ్లాయి. ఈ పరిణామాలు ఎన్నికల నిర్వహణ ప్రక్రియ మొదలైనట్లే అన్న సంకేతాలు ఇచ్చాయి. ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు వెలువడగానే పల్లెల్లోని నాయకుల్లో సందడి మొదలైంది. కొందరు ప్రచారం రంగంలోకి కూడా దిగారు.

**ఆశలపై నీళ్లు చల్లిన మంత్రి**

కానీ, రాష్ట్ర ప్రభుత్వంలోని ఒక కీలక మంత్రి వ్యాఖ్యలతో ఒక్కసారిగా ఈ హడావిడికి బ్రేక్ పడింది. ఎండల తీవ్రత సమయంలో ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని, వానాకాలం మొదలైన తరువాత ఎన్నికలకు వెళతామని ఆయన స్పష్టం చేశారు. అంతేకాదు.. ఎన్నికల కోడ్ వస్తే అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతుందని, ఇప్పట్లో అలాంటి స్థితి వద్దని కూడా ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు. మరో అధికారి మరింత స్పష్టతనిస్తూ, 'మేలో ఎన్నికలు నిర్వహించడానికి ఉత్తర్వులు జారీ చేయలేదని, ప్రభుత్వం సంకేతాలు ఇచ్చినప్పుడు వెంటనే సిద్ధంగా ఉండేందుకు మాత్రమే పనులు మొదలుపెట్టాం'అని చెప్పారు.

**మే నుంచి జూలై... అక్టోబర్?**

పరిషత్ ఎన్నికలు మేలో నిర్వహించాలని ప్రభుత్వం తొలుత అనుకుంది. పరీక్షలకు అంతరాయం కలగకుండా పోలింగ్ నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారని వార్తలు కూడా వచ్చాయి. కానీ ఆ ప్రణాళికలు కార్యరూపం దాల్చలేదు. జనాభా గణన అనే కొత్త అడ్డంకి మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం జనాభా గణన చేపట్టనుండటంతో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ వాయిదా పడింది. ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్, మే 11 నుంచి జూన్ 9 వరకు జనాభా గణన నిర్వహించనున్నారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఈ కాలంలో పూర్తిగా జనాభా గణనలో నిమగ్నమవుతారు. దాంతో ఎన్నికల యంత్రాంగం మే నెలలో ఎన్నికల నిర్వహణకు అందుబాటులో ఉండదు. ఈ నేపథ్యంలో జూన్ చివరి వారం లేదా జూలైలో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం కొత్త ప్రణాళికను సిద్ధం చేసినట్లు సమాచారం. కానీ, ఇక్కడా అడ్డంకులు ఉన్నాయంటున్నారు. జూన్ నెల చివరి వరకు ఎండల భగభగ తగ్గదు. అంత వేడిలో ఎన్నికలు నిర్వహించడం ప్రజలకు కష్టమని ప్రభుత్వం భావిస్తోంది. మరి జూలైలో చూసినా అప్పటి పరిస్థితి అప్పటిది. అప్పటికి




# త్ ఎన్నికలు..
# డే కాదు..!

వర్షాకాలం మొదలవుతుంది. రైతు భరోసా నిధులు ఖాతాల్లో వేయాలి. ఇవన్నీ పూర్తయిన తర్వాతే షెడ్యూల్ ప్రకటించవచ్చని సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొందరైతే జూలైలోనూ కుదరకపోతే అక్టోబర్‌లో నిర్వహించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని కూడా అంటున్నారు.

**తగ్గిన స్థానాలు**

2019లో జరిగిన ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఎంపీటీసీలు, జడ్పీటీసీ స్థానాల సంఖ్యలో మార్పులు జరిగాయి. పట్టణీకరణ పెరగడంతో పలు గ్రామ పంచాయతీలు పురపాలికలు, నగరపాలికల్లో విలీన మయ్యాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 44 ఎంపీటీసీ స్థానాలు, 4 జడ్పీటీసీ స్థానాలు తగ్గిపోయాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాను పూర్తి అర్బన్ జిల్లాగా ప్రకటించారు. ఫలితంగా ఆ జిల్లా పరిషత్ అనివార్యంగా తొలగింపునకు గురైంది. హైదరాబాద్ జిల్లాలోనూ ఇదే పరిస్థితి. దీంతో ఎన్నికలు ఇప్పుడు 31 జిల్లా పరిషత్‌లకే జరగనున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 566 జడ్పీటీసీ స్థానాలు, 5,773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇవన్నీ గత ఏడాది జూన్ నుండి ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో నడుస్తున్నాయి.

**మూడు పార్టీలకూ అగ్నిపరీక్ష!**

ఈ ఎన్నికలు కేవలం స్థానిక ప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియగా మాత్రమే చూడకూడదు. తెలంగాణలోని మూడు ప్రధాన రాజకీయ పార్టీలకూ ఇవి అగ్నిపరీక్ష వంటివి. కాంగ్రెస్ పార్టీకి తమ పాలన పట్ల ప్రజల విశ్వాసాన్ని చూరగొనేందుకు ఇవి చివరి అవకాశం. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలలో స్పష్టమైన ఆధిక్యం సాధించింది. ఇదే ఊపును కొనసాగిస్తూ ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను కూడా గెల్చుకోవాలని హస్తం పార్టీ భావిస్తోంది. తమ సంక్షేమ పథకాలు, పాలనపై ప్రజల తీర్పు ఈ ఎన్నికల ద్వారా నిరూపించు కోవాలని చూస్తోంది. స్థానిక సంస్థలపై పట్టు సాధిస్తేనే క్షేత్రస్థాయిలో పార్టీ నెట్‌వర్క్ బలపడుతుందని నమ్ముతోంది.

అటు బీఆర్ఎస్ పార్టీ చూస్తే ఈ ఎన్నికలు వారికి 'జీవన్మరణ' సమరంగా చెప్పుకోవచ్చు. అసెంబ్లీ ఎన్నికలలో పరాజయం తర్వాత బీఆర్ఎస్ కొంత చతికిలపడింది. పార్లమెంటు ఎన్నికల తర్వాత మరింత దిగజారిపోయింది. తమ సంప్రదాయ ఓట్ల కంచుకోటలైన గ్రామీణ ప్రాంతాల్లో తిరిగి పట్టు సాధించేందుకు ఈ ఎన్నికలు ఒక అవకాశంగా మలుచుకోవాలని బీఆర్ఎస్ చూస్తోంది. బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు తీర్పు తర్వాత ఏర్పడిన పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకోవాలని వ్యూహరచన చేస్తోంది. పార్టీ అంతర్గత క్యాడర్‌ను తిరిగి ఏకం చేయడానికి ఈ ఎన్నికలు అవసరమని గులాబీ నాయకత్వం భావిస్తోంది.

ఇక, కేంద్రంలో అధికారంలో కొనసాగుతూ.. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు కలిగి ఉన్న భారతీయ జనతా పార్టీకి గ్రామీణ వ్యాప్తి లక్ష్యంగా ఈ ఎన్నికలను వినియోగించుకోవాలనుకుంటోంది. పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువగా కనిపించే బీజేపీ, గ్రామీణ తెలంగాణలో కూడా పాగా వేయాలని చూస్తోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తుపై జరగనుండడంతో ఈ ఎన్నికలు తమకు బ్రాండ్ బిల్డింగ్ అవకాశంగా కమలం పార్టీ భావిస్తోంది. ప్రతి మండలంలో పార్టీ జెండా పాతుకు పోతేనే భవిష్యత్ అసెంబ్లీ ఎన్నికలకు పునాది పడుతుందని వ్యూహకర్తలు అంటున్నారు.

**జాబితా వేరు-నిర్ణయం వేరు!**

ఈ మొత్తం వ్యవహారంలో అసలు విషయం ఏమిటంటే.. ఎన్నికల కమిషన్ సన్నద్ధత వేరు, ప్రభుత్వం ఆలోచన వేరు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్వతంత్ర సంస్థ. ఓటర్ల జాబితా తయారీ దాని బాధ్యత. కమిషన్ ఆదేశాలు, కార్యాచరణ ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండేందుకే అన్నది క్లియర్. అయితే, ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాలంటే రాష్ట్ర ప్రభుత్వం నుండి కమిషన్‌కు అనుకూల సంకేతాలు రావాలి. ప్రభుత్వ ఆలోచన వేరే విధంగా ఉందని మంత్రి వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. దాంతో కమిషన్ ఉత్తర్వులు ఉన్నా.. ఎన్నికల తేదీలు ఖరారు కావడానికి ఇంకా సమయం పట్టవచ్చంటున్నారు విశ్లేషకులు.

ఈ మొత్తం సందిగ్ధంలో అత్యంత ఇబ్బంది కరమైన స్థితిలో ఉన్నది స్థానిక నాయకులు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయో తెలియక, ఎప్పుడు నోటిఫికేషన్ వస్తుందో తెలియక నిరీక్షణతో రోజులు గడుపుతున్నారు. ఒకవైపు ఎన్నికల కోసం ముందస్తు ఖర్చులు చేయాలని ఒత్తిడి వస్తోంది. మరోవైపు ఎన్నికలే రాకపోతే ఆ పెట్టుబడి వృథా అవుతుందనే భయం ఉంది. పోటీ చేయడానికి మాత్రం అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. కానీ, ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో తెలీదు. ఈ అయోమయం మధ్య మండల, జిల్లా స్థాయి రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.

**సుజాత గోపగోని**
**సీనియర్ జర్నలిస్ట్, 6302164068**



# మృత్యు 'శకటాల'కు




**బస్సు ప్రమాదాలు అమాయకుల ప్రాణాలను బలిగొనడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోనున్నాయి. ఇతర రాష్ట్రాల్లో తక్కువ పన్నుతో రిజిస్ట్రేషన్ చేయించి, తెలుగు రాష్ట్రాల్లో దందా సాగిస్తున్న ట్రావెల్స్ ఆగడాలకు కేంద్ర ప్రభుత్వం ఫుల్‌స్టాప్ పెట్టింది. ఆయా వాహనాలు తిరిగే రాష్ట్ర ప్రభుత్వాలే వాటికి రిజిస్ట్రేషన్లు చేసేలా,పర్మిట్లను ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. స్లీపర్ బస్సులను రద్దు చేయాలని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కీ) ప్రభుత్వానికి సూచించింది.**

ఈ తీవ్రమైన సమస్యలన్నింటినీ ఆధారాలతో పదేపదే చేసిన విజ్ఞప్తుల మేరకు కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా ఇతర రాష్ట్రాల్లో పర్మిట్లు జారీ విధానాన్ని రద్దు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది.

**నిబంధనలు పాటించని స్లీపర్ బస్సులు**

ప్రస్తుతం కనువిందు చేస్తున్న స్లీపర్ బస్సులు ప్రయాణికులకు కేవలం విలాసానికి, రాత్రి వేళల్లో సౌకర్యవంతమైన ప్రయాణానికి చిహ్నాలుగా మాత్రమే కనిపిస్తున్నాయి. సుదూర ప్రాంతాలకు గంటల తరబడి ప్రయాణించే సామాన్యులు కూడా ఎంతో సుఖంగా, హాయిగా నిద్రపోతూ గమ్యస్థానం చేరుకోవచ్చన్న భావనతో ఈ బస్సులను విపరీతంగా ఆశ్రయిస్తున్నారు. అయితే, పైకి ఎంతో ఆకర్షణీయంగా కనిపించే ఈ విలాసం వెనుక అత్యంత భయానకమైన, ప్రాణాంతకమైన ముప్పు నిరంతరం పొంచి ఉందని తరచుగా జరుగుతున్న ఘోర రహదారి ప్రమాదాలు పదేపదే హెచ్చరిస్తూనే ఉన్నాయి. ప్రయాణికుల ప్రాధాన్యతను కేవలం ఒక వ్యాపార అవకాశంగా మలచుకున్న ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు, పరోక్షంగా వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

'ఒక దేశం-ఒకే విధానం' (వన్ నేషన్-వన్ పర్మిట్) మోటారు వాహనాల చట్టం ప్రైవేట్ బస్సు ఆపరేటర్లకు వరంగా, ప్రయాణికులకు ప్రాణ సంకటంగా పరిణమించింది. ఈ జాతీయ విధానం కింద వాహనాల యజమానులు ఆలిండియా పర్మిట్ కోసం కేవలం రూ. రెండు లక్షలు చెల్లిస్తే, అందులో సగం రాష్ట్రాలకు పంచుతామనడంతో రాష్ట్రాలు అంగీకరించాయి. ఈ విధానం వల్ల దేశంలో ఎక్కడైనా బస్సు(ల)ను రిజిస్ట్రేషన్ చేయించుకుని, ఏ రాష్ట్రంలోనైనా స్వేచ్ఛగా నడుపుకునే అత్యంత అనుకూలమైన వెసులుబాటు ప్రైవేట్ ఆపరేటర్లకు లభించింది. లాభాలను విపరీతంగా పెంచు కునేందుకు బస్సు ఆపరేటర్లు అత్యంత స్వార్థపూరిత ఆలోచన చేశారు. కఠిన నిబంధనలతో పాటు, త్రైమాసిక పన్ను సుమారు రూ. తొంభై వేల వరకు గల రెండు తెలుగు రాష్ట్రాల వంటి వాటిని ఉద్దేశ పూర్వకంగా పక్కనపెట్టి, పన్నుల భారం అత్యంత తక్కువగా (ఏడాదికి రూ. 50 వేలు మాత్రమే), నామమాత్రపు నిబంధనలు గల ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వైపు వారు మొగ్గుచూపారు. అలా ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు రూ. కోట్లలో లాభాలు గడించగా, రాష్ట్ర ప్రభుత్వాల ఖజానాకు పన్నుల రూపంలో రావాల్సిన ఆదాయానికి భారీగా గండి పడింది.

మరోవంక, బస్సుల భద్రతపై స్థానిక రవాణా శాఖ అధికారుల నియంత్రణ పూర్తిగా లోపించింది. రిజిస్ట్రేషన్ ఒక సుదూర రాష్ట్రంలో, బస్సుల నిర్వహణ మరో రాష్ట్రంలో ఉండడంతో ఆయా బస్సుల 'కండిషన్' ఎలా ఉంది? వాటికి సకాలంలో 'ఫిట్‌నెస్' పరీక్షలు జరుగుతున్నాయా? తదితర అంశాలను పర్యవేక్షించే నాథుడే కరవయ్యాడు. పాతబడిన, సరైన కండిషన్‌లో లేని బస్సులను యథేచ్ఛగా తిప్పడంతో ప్రమాదాలు విపరీతంగా పెరిగాయి. బాధిత రాష్ట్రాలు

శాస్త్రీయ కోణంలో, వాహన నిర్మాణ ప్రమాణాల పరంగా చూస్తే, స్లీపర్ బస్సుల నిర్మాణం రహదారి భద్రతా నియమాలకు పూర్తిగా విరుద్ధంగా ఉంటుంది. బెర్తుల ఏర్పాటుకు వీలుగా బస్సు ఎత్తును అసాధారణంగా పెంచడం వల్ల బస్సు గురుత్వాకర్షణ కేంద్రం (సెంటర్ ఆఫ్ గ్రావిటీ) తీవ్రంగా దెబ్బ తింటుంది. పర్యవసానంగా, ప్రమాదకరమైన మలుపుల వద్ద లేదా డ్రైవర్ అత్యవసర పరిస్థితుల్లో అకస్మాత్తుగా బ్రేకులు వేసినప్పుడు బస్సు అదుపు తప్పి బోల్తా పడే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి. 'సాధారణ సీటింగ్ బస్సులతో పోలిస్తే స్లీపర్ బస్సులు బోల్తా పడే ప్రమాదం 40 శాతం వరకు అదనంగా ఉంటుంది. సాధారణ సీటర్ బస్సుల్లో కూర్చుని ప్రయాణించేటప్పుడు సీటు బెల్టులు ధరించే అవకాశం ఉంటుంది. కానీ స్లీపర్ బస్సుల్లో పడుకున్నప్పుడు ఎలాంటి కనీస రక్షణ కవచం ఉండదు. బస్సు అకస్మాత్తుగా ఆగినా, లేదా బోల్తా పడినా, ప్రయాణికులు తమను తాము ఏమాత్రం నియంత్రించుకోలేక లోపల ఉన్న కఠినమైన ఇనుప రాడ్లకు లేదా బస్సు గోడలకు బలంగా తగిలి ప్రాణాలు కోల్పోవడమో లేదా తీవ్రంగా గాయపడటమో జరుగుతోంది' అని రవాణా రంగ నిపుణుల కచ్చితమైన అంచనాలతో చెబుతున్నారు. దేశంలో నడుస్తున్న ప్రైవేట్ బస్సుల్లో సుమారు 80 శాతానికి పైగా ప్రభుత్వ కనీస నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయన తెలుస్తోంది. బస్సు బాడీ నిర్మాణంలో వినియోగించే అత్యంత ఆందోళన కరమైన విషయం ఏమిటంటే, నాణ్యత లేని, సులభంగా మండే సామగ్రిని వాడడం అత్యంత ఆందోళనకరమైన అంశం.నాసి రకం మెటీరియల్ అగ్నిప్రమాదాల సమయంలో వేగంగా కరిగిపోతున్నాయి. ఫలితంగా ప్రయాణికులకు బయటపడే కనీస అవకాశం కూడా దక్కడం లేదు. ఇరుకైన సందులు, నిబంధనలకు విరుద్ధంగా నిండా నింపిన లగేజీ కారణంగా అత్యవసర ద్వారాలు పూర్తిగా మూసుకుపోతున్నాయి. బస్సుల్లో వేగ నియంత్రణ పరికరాలు ఉన్నా, వాటిని ధ్వంసం చేసి మృత్యువేగంతో దూసుకుపోతున్నారు. దీనికి తోడు, ప్రైవేట్ ఆపరేటర్లు ఖర్చులు తగ్గించుకునేందుకు, తక్కువ జీతాలకు ఏమాత్రం అనుభవం లేనివారిని డ్రైవర్లుగా నియమించు కుంటున్నారు. వారికి కనీస విశ్రాంతి లేకుండా వరుస ట్రిప్పులు వేయడంతో నిద్రలేమితో స్టీరింగ్ పడుతున్నారు.

**ప్రమాదాల పరంపర**

మార్చి 2025 నుంచి మార్చి 2026 వరకు గణాంకాలను పరిశీలిస్తే, ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా జరిగిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు



# ముకుతాడు



ప్రమాదాలు మునుపెన్నడూ లేని స్థాయిలో అత్యంత ఆందోళ నకరంగా పెరిగాయి. ఆధునిక రవాణా సౌకర్యాలు మెరుగు పడుతున్నాయని సామాన్యులు భావిస్తున్న తరుణంలో,జాతీయ రహదారులపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు మృత్యు శకటాలుగా మారుతుండటం తీవ్ర భయాందోళనలు కలిగిస్తోంది. తాజా నివేదికల ప్రకారం, కేవలం రెండు ఏళ్ల వ్యవధిలోనే ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే సుమారు వందకుపైగా అత్యంత తీవ్రమైన బస్సు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

వందలాది ప్రయాణికులు ప్రాణాలను కోల్పోగా, దాదాపు 2,500 మందికి పైగా తీవ్ర గాయాల పాలయ్యారు. వారిలో శాశ్వత దివ్యాంగులుగా మారడం అత్యంత విషాదకరం. మృతుల్లో ఎక్కువ శాతం యువకులు, కుటుంబాలకు ఏకైక ఆధారమైన కుటుంబ యజమానులు ఉండటం వల్ల ఆయా కుటుంబాలు దిక్కు తోచని స్థితిలో వీధిన పడ్డారు. జాతీయ రహదారులు, ముఖ్యంగా ఎన్‌హెచ్-16, ఎన్‌హెచ్-44లతో పాటు మారుమూల ప్రాంతాల్లోని ఘాట్ రోడ్లు ఈ మారణ హోమానికి ప్రధాన కేంద్రాలుగా మారాయి.

రాష్ట్రంలో చోటు చేసుకున్న హృదయ విదారక ఘటనలను పరిశీలిస్తే... మార్చి 26 వేకువజామున ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం రాయవరం సమీపంలో హరికృష్ణ ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను అతివేగంగా ఢీకొనడంతో 4 మంది ప్రయాణికులు సజీవ దహనంకాగా, 28 మంది తీవ్రంగా గాయపడ్డారు. కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద కావలి ట్రావెల్స్ బస్సు అతివేగంగా వెళ్తూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి, డివైడర్‌ను దాటి దూసుకెళ్లిన ఘటనలో 19 మంది మృతి చెందారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటమే దీనికి ప్రధాన కారణమని తేలింది. బాపట్ల జిల్లా అద్దంకి జాతీయ రహదారిపై నెల్లూరు నుంచి వస్తున్న బస్సు టైరు పేలి, అదుపుతప్పిన ఘటనలో అయిదుగురు, అల్లూరి జిల్లా చింతూరు ఘాట్ రోడ్డులో బస్సు లోయలో పడి తొమ్మిది మంది, అనంతగిరి ఘాట్ వద్ద ఆరుగురు పర్యాటకులు ప్రాణాలు విడిచారు. జాతీయ స్థాయిలో కూడా పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. సెప్టెంబర్ 14న రాజస్థాన్‌లో బస్సు దగ్ధమై అందులోని 57 మందిలో 20 మంది సజీవ దహనమయ్యారు. ఈ వివరాలు మచ్చుకు కొన్ని మాత్రమే.

**ఆస్కీ సూచన**

ఈ వరుస బస్సు ప్రమాదాల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎట్టకేలకు తీవ్రంగా స్పందించాయి. కేవలం విచారణ కమిటీలు వేసి చేతులు దులుపుకునే సంస్కృతికి స్వస్తి పలుకుతూ, ఈ ప్రమాదాలకు గల మూల కారణాలను అన్వేషించే దిశగా రాష్ట్ర రవాణా శాఖ ప్రతిష్ఠాత్మకమైన అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కీ) తో బస్సు బాడీల తయారీ, సాంకేతిక లోపాలు, నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర అధ్యయనం చేయించింది. ఆస్కీ తన నివేదికలో ప్రభుత్వానికి అత్యంత కఠినమైన, కచ్చితమైన సూచనలు చేసింది. ప్రధానంగా...స్లీపర్ బస్సులను తక్షణమే నిషేధించాలని, రాబోయే 22 నెలల వ్యవధిలో ఒక్క స్లీపర్ బస్సు కూడా రోడ్లపై తిరగకుండా కఠిన చర్యలు అమలు చేయాలని కుండబద్దలు కొట్టినట్లు స్పష్టం చేసింది. అంతర్జాతీయ రవాణా రంగం, అభివృద్ధి చెందిన దేశాల విధానాలను పరిశీలిస్తే... అమెరికా, బ్రిటన్లతో పాటు చైనా, జర్మనీ, స్వీడన్, డెన్మార్క్ వంటి దేశాలు ప్రయాణికుల భద్రతే ఏకైక ప్రాధాన్యంగా స్లీపర్ బస్సులను ఎన్నడో నిషేధించాయి. చైనాలోని యన్‌యాన్‌లో 2012 మార్చిలో ఓ డబుల్ డెకర్ స్లీపర్ బస్సు మిథనాల్ ట్యాంకర్‌ను ఢీకొట్టి 36 మంది ప్రయాణికులు సజీవ దహనమైన ఒకే ఒక్క ప్రమాదంతో మేల్కొన్న ఆ దేశ ప్రభుత్వం, డబుల్ డెకర్ స్లీపర్ బస్సుల తయారీపైనే శాశ్వత నిషేధం విధించింది. అంతేకాకుండా డ్రైవర్లు నిద్రమత్తుకు లోనుకాకుండా అర్ధరాత్రి నుంచి వేకువజాము5 గంటల వరకు బస్సులు నడపకూడదనే నిబంధనను అమలు చేస్తోంది. మన దేశంలో సైతం స్లీపర్ , సీటర్ బస్సుల కోసం ఆటోమోటివ్ ఇండస్ట్రీ స్టాండర్డ్స్ (ఏఐఎస్), సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ (సీఐఆర్‌టీ) అనేక నిబంధనలు పేర్కొన్నాయి.

ప్రతి స్లీపర్ బస్సులో కనీసం 4 అత్యవసర ద్వారాలు ఉండాలని, ప్రయాణికులు నడిచే మార్గం 40-60 సెంటీమీటర్లు, బెర్తులు కనీసం 1,800 మిల్లీమీటర్ల పొడవు, 600 మి.మీ. వెడల్పుతో ఉండాలని స్పష్టం చేశాయి. ముఖ్యంగా, ప్రమాదం సమయంలో ప్రయాణికులు వేగంగా బయట పడలేకపోవడానికి ప్రధాన కారణమవుతున్న డ్రైవర్ క్యాబిన్‌ను ప్రయాణికుల బెర్తులను విభజించే డోర్ (తలుపు)ను తక్షణమే తొలగించాలని ఆదేశించాయి. ప్రతి బస్సులో కనీసం పది కిలోల సామర్థ్యం గల అగ్నిమాపక పదార్థాలు కచ్చితంగా ఉండాలని, రిజిస్ట్రేషన్ సమయంలోనే బస్సు లేఅవుట్ డ్రాయింగ్ తప్పనిసరిగా జత చేయాలని, జీపీఎస్, సీసీటీవీ పర్యవేక్షణ ఉండాలని సూచించాయి. ఆస్కీ అందజేసిన ఈ సమగ్ర నివేదికను ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోంది. ప్రయాణికుల ప్రాణాలను బలితీసుకుంటున్న ప్రైవేట్ ట్రావెల్స్ యజమానుల ఈ రక్త వ్యాపారాన్ని అరికట్టడానికి, ఈ సూచనలన్నీ తూచా తప్పకుండా అమలయ్యేలా చూడాలంటూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరనుంది. రవాణా వ్యవస్థలో ఈ సమూల మార్పులు వస్తేనే అమాయకుల ప్రాణాలకు నిజమైన రక్షణ లభిస్తుంది.



**తురగా నాగభూషణం**
**సీనియర్ జర్నలిస్ట్**

# భక్తికవితా యోగిని

**తిరుమలేశుడి అనుగ్రహపాత్రులైన పరమభక్తుల్లో తరిగొండ వెంగమాంబ ఒకరు. ఆమె ప్రహ్లాద అవతారమని కొందరు, మీరాబాయి అంశంతో జన్మించారని ఇంకొందరు భావిస్తారు. ఆమె ఆధ్యాత్మికవాది మాత్రమే కాదు. సంస్కర్త. మూఢాచారాలను, కులమతాలను నిరసించారు.**

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత ఉమ్మడి చిత్తూరు జిల్లా తరిగొండ గ్రామంలో సా.శ. 1730లో కృష్ణయామాత్య, మంగమాంబ దంపతులకు వెంగమాంబ జన్మించింది. ఆమె స్వగ్రామంలోని ఇలవేల్పు శ్రీలక్ష్మీనరసింహస్వామిని, తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని అభేదంగా అర్చించసాగారు. బాలకృష్ణుడిని ఇష్టదైవంగా ఆరాధించారు. ఆమె భక్తి శ్రద్ధలను గ్రహించిన తండ్రి కోరిక మేరకు సుబ్రహ్మణ్య దీక్షితులు అనే గురువు తనకు తెలిసిన పరిజ్ఞాన మంతా ఆమెకు బోధించారు. మదనపల్లిలోని రూపావతారం సుబ్రహ్మణ్యయోగి వద్ద ఆమె యోగాభ్యాసం చేసి సిద్ధి పొందారు.

పుట్టుకతోనే దైవభక్తి అలవడిన వెంగమాంబది మధురభక్తి. తనకు తాను పరమాత్మకు అంకితం చేసుకుంది. బాల్యంలోనే భక్తిగీతాలు ఆలపిస్తూ, నృత్యం చేసే తీరు కన్నవారికి కొంతవరకు ముచ్చట గొలిపినా, ఆమె వైఖరిని బట్టి వివాహానికి అంగీకరించదేమోననే సందేహం బలపడింది. నారగుంటపాలెం గ్రామానికి చెందిన ఇంజేటి వేంకటాచలపతితో పెళ్లి చేశారు. ఒకరకంగా అది బలవంతపు పెళ్లే. కొంతకాలానికి భర్త దూర మయ్యాడు. అతను మరణించాడని, ఇల్లు వదలి వెళ్లిపోయాడని చెప్పుకొనేవారు. భర్తలేనందున సువాసినీ ఆనవాళ్లను తొలగించాలన్న ప్రయత్నాలను ప్రతిఘటించిన వెంగమాంబ, తాను మానసికంగా తిరుమలేశుని సతిని కావడం వల్ల సువాసినేనని వాదించారు. అయినా కొందరు సంప్రదాయవాదులు బలవంతంగా కేశఖండన చేయించారని, స్నానానంతరం శిరోజాలు యథాతథంగా వచ్చాయని కథనం. ఇలా ఆమె మహిమలపై అనేక కథనాలు ఉన్నాయి. ‘వెంగమాంబ బాలవితంతువు. ఆమె జీవితంలో శిరోజాలను తీయలేదని చెబుతారు. వితంతువులకు కేశవపనం చేయడం ఆమెకు ఇష్టంలేదని తెలుస్తోంది. ఆమెకు ఇష్టం లేని ఈ కృత్యం ఏ స్త్రీలకునూ సమ్మతం కాదు’ అని తొలి తెలుగు కథా రచయిత్రి భండారు అచ్చమాంబ (అబలా సచ్చరిత్ర రత్నమాల) అభిప్రాయపడ్డారు

వెంగమాంబ ఒకనాడు ఇంట్లో ఎవరికి చెప్పకుండా తిరుమల చేరుకున్నారు. అక్కడి మహంతు ఆత్మారాందాస్‌జీ ఆమె భక్తిప్రపత్తులను గుర్తించి ఆమె నివాసానికి ఒక కుటీరం ఏర్పాటు చేయించారు. కొన్నాళ్లకు తాళ్లపాక వంశీయులు తమ ఇంటిలో కొంత భాగాన్ని ఉచితంగా ఆమె వసతికి ఇచ్చారు. ఆమె హయగ్రీవ మంత్రోపదేశాన్ని పొంది, శ్రీనివాసుడిని సేవిస్తూ, కొండపై తులసివనాన్ని పెంచి, దానితో అల్లిన మాలలను స్వామికి సమర్పించేది. ఆ వనానికే ‘వెంగమాంబ బృందావనం’ అని పేరు.

**సాహితీవేత్తగా....**

వెంగమాంబ మధురభక్తి భావనతోనే కాక జ్ఞానాత్మకమైన యోగభక్తితో సరళశైలిలో రచనలను చేశారు. అంతగా చదువు, అక్షరజ్ఞానంలేని తనకు తగు మాత్రం పాండిత్యం అలవడడానికి తరిగొండ నారసింహుడి కృపాకటాక్షాలే కారణమని తమ ‘వేంకటాచల మహాత్మ్యం’ అవతారికలో పేర్కొన్నారు. తమ కృతి ‘నృసింహశతకం’ను ఆ స్వామికి

# సత్యనాథా... నమోస్తుతే..!!

**ఏప్రిల్ 27 సత్యనాథుని కల్యాణం**



అంతరంగంలో నిత్యం సత్యదీప్తితో వెలుగొందే పరమాత్మే సత్యనారాయణ స్వామి. నిర్మలమైన మనసుతో సత్యదేవుడిని ప్రతిష్ఠించుకోవడమే సత్యనారాయణవ్రతం. తూర్పుగోదావరి జిల్లాలో పంపానదీ తీరాన రత్నగిరిపై హరిహర హిరణ్యగర్భ త్రిమూర్త్యాత్మకుడై అనంతలక్ష్మీ సత్యవతి రమాదేవి సమేతుడై సత్యదేవుడు విరాజిల్లుతున్నాడు. కలి ప్రభావంతో జనులు సత్యధర్మాలను వీడి ప్రవర్తిస్తున్న సమయంలో నారద మహర్షి వినతి మేరకు శ్రీహరి సత్యసంధాతగా, సత్యస్ఫూర్తి ప్రదాతగా సత్యనారాయణ మూర్తిగా ఆవిర్భవించాడని పురాణ కథనం. శ్రీసీతారామచంద్రస్వామి క్షేత్రపాలకుడిగా ఉండడం విశేషం. ఆపన్నులకు అన్ని వరాలను అనుగ్రహించే ఈ దివ్య ధామానికి ‘అనన్యవరం’ అని పేరని, కాలక్రమంలో అది ‘అన్నవరం’గా స్థిరపడిందని చెబుతారు. ఈ వ్రతానికి సంబంధించిన మూలకథా వస్తువు స్కంద పురాణం రేవా ఖండంలో అయిదు అధ్యాయాలలో ఉంది. ఎన్ని వ్రతాలు ఉన్నా తెలుగు వారికి సత్యనారాయణ వ్రతం ప్రీతి పాత్రం. శుభశోభనాదుల సందర్భంలో, మనసు కలత చెందిన పుడు ఈ వ్రతాన్ని ఆచరించడం తెలుగు వారికి ఆనవాయితీగా వస్తోంది. అలా అయన ‘వ్రతాధిష్ఠాన’ దైవంగా అర్చనలు అందుకుంటున్నారు.

సత్యం అంటే కేవలం నిజమే చెప్పడమే కాదని, లోకంలోని పరమార్థాన్ని గ్రహించడం, రుజు మార్గంలో జీవించడం కూడానని పెద్దల మాట. సాధారణ మాటలో చెప్పాలంటే ఇచ్చినమాటకు, చేసిన సంకల్పానికి కట్టుబడడం. సత్యనారాయణ వ్రత అధ్యాయాలూ అదే చెబుతున్నాయి. ఈ కథలలో ఆధ్యాత్మికతతో పాటు సామాజిక హితవూ కనిపిస్తుంది. ఉదాహరణకు, చేసే పనిలో చిత్తశుద్ధి, అంకితభావం ఉండాలి. అందుకు భిన్నంగా అశ్రద్ధ, మొక్కుబడితనం, అనిష్ఠల వల్ల ఫలితం ఉండదని (స్వామికి ఆగ్రహం కలుగుతుంది) మూడు, నాలుగు అధ్యాయాలలోని వర్తకుడి కథ వెల్లడిస్తోంది. భగవంతుడి దృష్టిలో అంతా సమానమే. అయితే పామరులు/పేదలు చేసే వ్రతాన్ని చిన్న చూపు చూసిన రాజు పతనమవుతాడని చెప్పే అయిదవ అధ్యాయం పూజకు పేద,ధనిక భేదంలేదన్న సందేశానిస్తోంది.

ఈ వ్రతాచరణకు తిథివారాలతో నిమిత్తం లేదని చెబుతారు. స్వామికి నివేదించే మధుర పదార్థాన్ని ‘సుపాద’అంటారు. గోధుమ నూక, ఆవునెయ్యి, బెల్లం, సుగంధ ద్రవ్యాల సమ్మేళనమైన ఈ ప్రసాదంలో తన మహిమ నిక్షిప్తమై ఉంటుందని సత్యనారాయణుడే పేర్కొన్నాడని అంటారు. అందుకే ఆ వ్రత ప్రసాదానికి అంత ప్రశస్థి ఏర్పడింది.. సత్య నాథుడికి వైశాఖ శుద్ధ దశమి నుంచి బహుళ పాడ్యమి వరకు వార్షిక సప్తాహ్నిక కల్యాణోత్సవాలు జరుగుతాయి అందులో భాగంగా ఏకాదశి నాడు కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ★

# వెంగమాంబ



సభక్తిపూర్వకంగా సమర్పించారు.

'వేంకటాచలమహాత్మ్యం, అష్టాంగయోగసారం' అనే పద్యకావ్యాలు; 'రమాపరిణయం, రాజయోగా మృతసారం, వాసిష్ఠ రామాయణం' అనే ద్విపద కావ్యాలు; 'తరిగొండ నృసింహ శతకం, శ్రీకృష్ణ మంజరి' అనే శతకాలు; 'నృసింహ విలాసం, విష్ణుపారిజాతం, శివలీలా విలాసం, ముక్తికాంత విలాసం, చెంచు నాటకం' అనే యక్షగానాలు.. తదితర రచనలు ఆమె లేఖిని నుంచి వెలువడ్డాయి.

**తిరుమలేశుడికి వెంగమాంబ హారతి**

ఆనందనిలయంలోని శ్రీనివాస పెరుమాళ్ నిత్యసేవలలో చిట్ట చివరిది 'ఏకాంతసేవ'. మూల విరాణ్మూర్తికి ప్రతి రాత్రి వెంగమాంబ పేరిట 'ముత్యాల హారతి' కర్పూర నీరాజనం సమర్పిస్తారు. రాములవారి నడవలో తాళ్లపాక వంశీయులు 'జో అచ్యుతానంద.. జోజో ముకుంద' అని జోల పాట ఆలపిస్తుండగా, ఒకవైపు వెంగమాంబ హారతిని అందుకుంటూ స్వామివారు యోగనిద్రకు ఉపక్రమిస్తారు. అలా 'తాళ్లపాక వారి లాలి... తరిగొండ వారి హారతి' అనే సూక్తి ఆవిర్భవించింది.

ఈ హారతి నేపథ్యాన్ని పరిశీలిస్తే, తిరువీధులకు వేంచేసే స్వామి వారికి ఉత్తరమాడ వీధిలో వెంగమాంబ నిత్యం ముత్యాలహారతి ఇచ్చేవారు. కొందరు అందుకు అభ్యంతరం చెప్పడంతో బాధ పడిన ఆమె హారతి ఇవ్వడాన్ని విరమించుకున్నారు. దాంతో స్వామివారి రథం నిలిచిపోయిందట. 'ఎవరో భక్తుల పట్ల అపచారం జరిగి ఉంటుంది. అదీగాక రథం వెంగమాంబ నివాసం వద్ద నిలిచిపోవడాన్ని బట్టి ఆమె విషయంలోనే అపరాధం జరిగి ఉంటుంది' అని ఒక అర్చక స్వామికి అనుమానం కలిగిం దట.ఆమెను ఆహ్వానించి హారతి ఇప్పించడంతో శ్రీవారి వాహనం ముందుకు కదిలిందట. ఆమె నివసించిన స్థలంలోనే తిరుమల తిరుపతి దేవస్థానం 'మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ' పేరిట నిత్యాన్నదాన కేంద్రాన్ని నిర్వహిస్తోంది.

**తాళ్లపాక-తరిగొండ**

శ్రీవేంకటేశ్వరుని పరమభక్తులుగా పేరొందిన తాళ్లపాక అన్నమాచార్య, తరిగొండ వెంగమాంబల జీవితకాలాల మధ్య శతాబ్దాల తేడా ఉన్నా, ఇరువురి భక్తి భావనల్లో అనేక సాదృశ్యాలు కనిపిస్తాయి. ఇద్దరూ అనివార్యకారణాలతో తిరుమల చేరుకు న్నారు. అన్నమయ్య వైష్ణవ దీక్షను స్వీకరించినట్టే, వెంగమాంబ హయగ్రీవ మంత్రోపదేశం పొందారు. అహోబిల నారసింహుడిని, తిరుమల శ్రీ వేంకటేశ్వ రుని అన్నమయ్య అభేద భావంతో ఆరాధించగా, వెగమాంబ తరికొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామిని, తిరుమలేశుడిని సమానంగా అర్చించి తన రచనలను అంకితం చేశారు. ఈ ఇద్దరూ సహస్ర చంద్రదర్శనం చేసిన పరమ భాగవతోత్తములు.



# నమో కచ్ఛప రూపా..!

**మే 1 కూర్మ జయంతి**



**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**

**సీనియర్ జర్నలిస్ట్**

శ్రీమహావిష్ణువు ప్రసిద్ధ అవతారాలలోని అ'ద్వితీయం' కూర్మావతారం. దూర్వాసుని శాపం కారణంగా దేవతలు బలహీనులయ్యారు. వారు తరచూ దానవుల చేతిలో పరాజితులవుతున్నారు. ఆ ముప్పు తప్పించుకొనేందుకు క్షీరసాగర మథనం ద్వారా అమృతం సాధించాలన్న శ్రీమహావిష్ణువు సలహాపై దేవతలు దానవుల సహకారంతో ఆ ప్రక్రియకు ఉపక్రమించారు. సాగర మథనానికి కవ్వంగా నిర్దేశించిన మందర పర్వతం జలాల్లో మునగకుండా కాపాడేందుకు హరి కూర్మరూపుడిగా అవతరించాడు. గిరిని వీపున మోస్తూ కార్య పరిసమాప్తికి చేయూతనిచ్చాడు

యావత్ భారత దేశంలోనే ఏకైక స్వయంభూ కూర్మనాథాలయం (శ్రీకూర్మం) ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం జిల్లాలో వంశధార, నాగావళి నదుల మధ్య వెలసి ఉంది. శ్వేతచక్రవర్తి తపోఫలితంగా కూర్మనాథుడు వెలిశాడని పురాణాలు చెబుతున్నాయి. ఆదికూర్మక్షేత్రం నెలవైన శాలిహుండం కొండను 'కూర్మాద్రి' అని వ్యవహరిస్తారు. ఈ క్షేత్రం వైష్ణవ,శైవ సంప్రదాయాల సమ్మేళనం. కూర్మనాథ ఆలయం చుట్టూ ఐదు శివాలయాలు (సుందరేశ్వర, కర్పూరే శ్వర, కోటేశ్వర, హాటకేశ్వర, పాతాళ సిద్దేశ్వర)తో పంచలింగాత్మక క్షేత్రంగా ప్రసిద్ధిపొందింది. బ్రహ్మ ప్రతిష్ఠిత పంచలింగ క్షేత్రంగా ప్రతీతి. ఆయన పర మేశ్వరుడిని (పాతాళ సిద్దేశ్వరుడు) క్షేత్రపాల కుడిగా నియమించినట్లు పద్మ, బ్రహ్మపురాణాలు పేర్కొంటున్నాయి.

ఇక్కడి పుష్కరిణి (సుధాకుండతీర్థం)లోని శ్వేతమృత్తిక/గోపీచందనం (తెల్లమన్ను) తిరుమణిగా ధరించడం వల్ల భక్తులు నిర్మల మనస్సుతో జీవితాంతం భక్తిశ్రద్ధలు కలిగి ఉంటారని స్థల పురాణం. శ్రీమహాలక్ష్మి ఈ పుష్కరిణిలో అవతరించి 'శ్రీకూర్మనాయిక'గా పూజలందుకుంటున్నారు. 'మోక్షస్థానం'గా వ్యవహరించే ఈ పుష్కరిణిలో కాశీ, పూరీ క్షేత్రాలలో మాదిరిగా పిండ ప్రదానాలు, నదీతీరాలలో మాదిరిగా అస్థి నిమజ్జనం చేస్తారు. అస్థికలు అవి సాలగ్రామాలవుతాయని చెబుతారు.

ఈ ఆలయంలోని శంఖనిధి, పద్మనిధులకు బలరామకృష్ణులు పాలకులుగా ఉంటారు. ఆలయ గోపురానికి శ్రీకూర్మ విమానమని పేరు. గర్భాలయం లోకి భక్తులను అనుమతించడం ఇక్కడి ప్రత్యేకత. ఏ వైష్ణవ క్షేత్రంలో లేని విధంగా జంట ధ్వజ స్తంభాలు ఉండడం ఈ ఆలయ విశిష్టత. విశిష్టాద్వైత మత ప్రవక్తులు రామానుజాచార్యులు ఆరాధనతో స్వామి వారు దిశమార్చి చూడడం వల్ల ఈ జంట ధ్వజ స్తంభాలు ఏర్పడినట్లు తెలుస్తోంది. ఆలయ తూర్పు దిక్కున ధ్వజ స్తంభం ఉండడం సర్వ సాధారణం. ఈ క్షేత్రంలో స్వామి పడమరవైపు చూస్తున్నాడు కనుక అటువైపున రెండవ ధ్వజస్తంభం ఏర్పాటైంది. ★

# గణపతిదేవుడు



## ఏకైక తెలుగు చక్రవర్తి

33

పాతికేళ్లు కారాగారశిక్ష అనుభవించాక విడుదలైన నాగతిస్య అక్కడే అడుక్కుని తింటూ బతుకుతున్నాడు.

అప్పటికే అతని శరీరం శిథిలమయ్యింది. ఓ గూఢచారిగా అద్భుతమైన ఆలోచన నైపుణ్యం, అమాయకంగా కనిపించే శారీరంపై అదుపు, చురుకైన బలిష్టమైన ఆకృతి, వాక్చాతుర్యం, సమయ స్ఫూర్తి, దేనికైనా వెనుకాడని నిబ్బరత, కారాగారవాస భయం లేకపోవడం.. ఇన్ని ప్రత్యేకతలు ఉంటేనే శత్రురాజ్యకోటలో గూఢచారిగా ప్రవేశ పెడతారు. అన్ని లక్షణాలతో ఒకప్పుడు ప్రభువుల ఆదరణ కూడా చూరగొన్న నాగతిస్య ఇప్పుడొక చిన్న నల్లని కొండలాంటి ఆకారంతో వంకర కాళ్లతో, కనిపించని చూపుతో ఓ అతిసాధారణ జీవిగా మిగిలాడు. ఎక్కడికి వెళ్లలేదు. ఎవ్వరూ గుర్తించరు.. చెప్పినా కనికరిస్తారని నమ్మకం లేదు. భార్యాపిల్లలు లేరు. స్వగ్రామం అనుమకొండలోని బంధువులు నాగతిస్య ఏమయ్యాడని ఆరా తీసినట్లు తెలియరాలేదు.

ఇక కేవలం దేవగిరి వీధుల్లో అడుక్కోవడమే అతనికి మిగిలిన ఏకైక అవకాశం. అదే చేస్తూ పొట్ట పోషించుకుంటున్నాడు. కుంటుతూ అడుక్కుంటూ తిరుగుతున్నాడు కాబట్టి అందరూ 'కుంటోడు' అనే పిలుస్తున్నారు. పేరు ఏవిటి అని అడిగేవాళ్లు లేరు. అడిగితే.. అతడు కూడా కుంటోడు అనే చెబుతాడు.

అయితే నాగతిస్యకు తన జీవితాన్ని పాతాళానికి పంపిన ఆనాటి ముఖ్య సంఘటనలు.. కాకతీయుల మెరుపుదాడి.. దాని అనంతర సంఘటనలన్నీ ఖచ్చితంగా గుర్తున్నాయి.



మత్తి భానుమూర్తి

ముఖ్యంగా ఆనాడు ఆ కోష్టాగారం ముందు పడివున్న కవ్వల శరీరభాగాలు.. ఆమె నిర్జీవ చూపులు.. అవే అవే.. నిరంతరం నిర్విరామంగా అవే కళ్లముందు.. మనసు అంతటా.. అవే అవే!

అప్పట్లో గణపతిదేవుని పట్టి బంధించారని.. ఉరి తీయబోతున్నారని.. ఆఖరి నిమిషంలో వాయిదా పడిందని కూడా విన్నాడు. చివరికి రకరకాల అంశాలు పరిగణనలోకి తీసుకుని గణపతిదేవునికి జైత్రపాల మహారాజు ఏకైక కుమార్తె సోమలదేవినిచ్చి వివాహం జరిపించి గణపతిదేవుని సతీసమేతంగా అనుమకొండ పంపారని విన్నాడు.

గణపతిదేవుని పేరు స్మరిస్తే చాలు.. పొంగి పోతాడు. కాకతీయ మహాప్రభువు ఇక్కడ కారాగారవాసిగా ఉన్నప్పుడు తనే ఆయన రక్షణ బాధ్యత వహించానని.. ఆయన తనను ఆత్మీయ మిత్రుడుగా భావించేవాడని అనుకుంటే చాలు.. వొళ్లంతా పులకింత.. తనకు అంతకంటే ఏమి కావాలి.ఆ తృప్తి చాలు!!

ఆ ఉద్వేగంతో ఓసారి అనిపించింది.. అనుమ కొండ వెళ్లి ఆ ప్రభువును కలిస్తే??

అతని బతుకు చూసి అతనికే నవ్వొచ్చింది. ఉన్నవి రెండు గోచీగుడ్డలు. ఓ చిరుగుల పంచె. ఓ చేతిలో బొచ్చె. మరో చేతిలో కర్ర. కుంటి నడక.. గుడ్డి చూపు. అసలు అనుమకొండ కోటలోకి ప్రవేశమే దొరకదు. ఇక మహాప్రభువును చూసే భాగ్యం ఎలా కలుగుతుంది.?!!

చూస్తే మాత్రం ఆ బంగారుతండ్రి తనను గుర్తిస్తాడు. కళ్లనిండా నీళ్లు నింపుకుంటాడు. నాగతిస్యా! బాగున్నావా అంటాడు.. హత్తుకుంటాడు. పంచభక్ష్య పరమాన్నాలు పెట్టి పట్టుబట్టలతో సత్కరిస్తాడు. గ్రామాలా.. భవనాలా.. మడులా మాన్యాలా ఏమి కావాలి అని అడుగుతాడు.

కాని కాని ఆయన, 'నాగతిస్యా.. నా కవ్వల ఏది.. ఏమైంది' అని అడిగితే తను ఏమి సమాధానం చెప్పాలి.. ప్చ్.. ఏ చెట్టుకో జేరగిలబడి కుళ్లికుళ్లి ఏడుస్తాడు.

ఆకలి వేస్తే వీధుల వెంట బిచ్చమెత్తుకుంటాడు. ఏ అమ్మో గుప్పెడు మెతుకులు వేస్తే ఎక్కడో కూర్చుని తింటాడు. కూర్చున్నా, నిలుచున్నా, పడుకున్నా అవే దృశ్యాలు.. కవ్వల నిర్జీవ శరీర భాగాలు!!

అడుక్కుని తినే అందరు సంచార బిచ్చగాళ్లలాగే సంధ్యవేళకు మెల్లమెల్లగా కోట ప్రాంగణం బయట దట్టంగా ఓ మాదిరి అడవిలా పెరిగిన చెట్ల క్రిందకు చేరతాడు. ఎవ్వరి వంకా చూడకుండా మెల్లగా ఓ చెట్టుకు జారగిలబడతాడు. ఒంటరిగా ఉండటమే ఇష్టం. కాని దేవగిరికోటలో, అనుమకొండ కోటలో ఏమేమి జరుగుతున్నాయో.. నిద్ర వచ్చేవరకు బిచ్చగాళ్లు కబుర్లు చెప్పుకుంటుంటారు. అవి వినడం ఇష్టం.

కాసేపటి తర్వాత వాళ్లకు దూరంగా మరో చెట్టు కింద పడుకుంటాడు.

అందరూ నిద్రపోతున్నా ఒక్కడే మేల్కొని కోటపై నడిచే కాపలాదార్లను, కదిలే కాగడాలను చూస్తూ.. గాలిలో తేలివచ్చే వారి మాటల సవ్వడి, నవ్వుల అలికిడి వింటూ ఎప్పుడో నిద్రలోకి జారుకుంటాడు.

ఏ రాత్రి వేళో చటుక్కున మెలకువ వస్తుంది మళ్లీ నిద్ర పట్టదు. అప్పుడు లేచి కోట ప్రహరీ వద్దకు వెళతాడు. కోట లోపలికి వెళ్లి ఆ కోష్టాగారాన్ని చూడాలని ఏదో వెర్రి ఆవేశం కలుగుతుంది.

ఎలా వెళ్లడం?!

తీవ్రమైన కోరిక మార్గాన్ని చూపుతుంది.

యోజనాల కోట ప్రహరి మొత్తంగా చుట్టూ తిరిగి మొత్తంగా జాగ్రత్తగా పరిశీలించి చూశాడు. రక్షణ కోసం కోట ప్రహరి చుట్టూ అగడ్తలు, లోతైన నీటిలో మొసళ్లు ఉంచుతారు. రాజ్యానికి శత్రుభయం లేనప్పుడు మహారాజుల్లో, కోటరక్షణ చూసే దండనాయకుల్లో ఈ రక్షణవ్యవస్థ పట్ల జాగ్రత్తలు తగ్గి ఉదాసీనత ఎక్కువౌతుంది. ఇప్పుడూ అదే పరిస్థితి. మొసళ్లు చచ్చి చాలా కాలమయ్యింది సరికదా నీళ్లు కూడా నింపడం లేదు. అగడ్తల నిండా మట్టి, రాళ్లు పేరుకు పోయాయి. కుంటోడులాంటి బిచ్చగాడు ప్రహరీ వద్ద కూర్చున్నా పడుకున్నా పైనున్న కాపలాభటులు చూసి చూడకుండా వదిలేస్తున్నారు.

అదే నాగతిస్యకు వరమయ్యింది.

అర్ధరాత్రుల వేళ మౌనంగా ఎవరికీ సందేహం కలగకుండా ప్రహరీ మొత్తం రాయి రాయి తడిమి చూశాడు. ఎక్కడో చిన్నరాయి ఊడి కనిపించింది. రోజూ ఆ దగ్గరగా పొడుకుంటూ.. అనేక రాత్రుళ్లు కొద్ది కొద్దిగా రాళ్లను కదపసాగాడు. అలా కొంతకాలానికి ఓ రహస్య మార్గాన్ని సృష్టించుకున్నాడు. అప్పటి నుంచి ప్రతి రాత్రి ఆ రాళ్లను తొలగించుకుని లోపలికి వెళతాడు.

**‘జాగృతి’ నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన**

కోష్టాగారాన్ని, కొన్నేళ్లు గడిపిన కారాగారాన్ని తడిమి చూసుకుంటాడు. కవ్వల శరీర భాగాలు ఇంకా అక్కడే ఉన్నట్టుంటుంది. ఆమె నిర్జీవ నేత్రలు తనతో వాదనకు దిగినట్లుంటుంది. ఆమెకు తను తప్పు చేసినట్లు చెంపలు వేసు కుంటాడు. ఏవేవో మాటలు అల్లుకుని చెప్పుకుని మెల్లగా బయటకు వస్తాడు.

ఇలా దాదాపు నిత్యమూ.. పాతికేళ్లుగా చేస్తున్నాడంటే ఎవ్వరూ నమ్మరు. కానీ నిజం.

రానురానూ నాగతిస్యకు అనుమకొండ పోవాలనే కోరిక పుట్టి వటవృక్షంలా పెరుగుతోంది. మహారాజు గణపతిదేవుని చూడటం, కలవడం అలా ఉంచి ఆయన పాలనా రాజధాని.. పైగా తన స్వగ్రామమైన అనుమకొండలో తిరుగా డుతూ అక్కడ అడుక్కుని బతకడం.. గొప్ప ఆనందమని భావించ సాగాడు.

దానికి కారణం తోటి బిచ్చగాళ్లు అనుమకొండ గురించి.. అక్కడి బిచ్చగాళ్ల అద్భుత జీవనం గురించి కథలు కథలుగా చెప్పుకోవడం వింటూ తానూ కూడా అక్కడ బతకాలన్నవాంఛను పెంచుకున్నాడు. ఒక చోట బిచ్చగాళ్లకు కొత్త బట్టలు ఇస్తున్నారని తెలిసి వెళ్లి ఓ రెండు పంచెలు తెచ్చుకున్నాడు. కొత్త పంచె కట్టడంతో నడక కూడా కొంత మారింది. నిస్తేజంగా బతకడం తగ్గింది. ఉత్సాహం హెచ్చింది.

ఇవ్వాళో రేపో అనుమకొండకు వెళ్లిపోవాలని ప్రయాణం పెట్టుకున్నాడు కాని ఇంతలో అనుకోని దృశ్యం కంట పడింది.

ఒకరోజు వీధిలో అడుక్కుంటూ పోతుండగా ఓ పల్లకిలో ఓ రాచయువతిని చూశాడు.

ఆమెను గుర్తించగానే మతిపోయింది.

ఆమె కవ్వల!

అంతే!! నాగతిస్య జీవితం మరో మలుపు తిరిగింది.

* * *

ఆ రోజు అర్ధరాత్రి ఎప్పటిలాగే ప్రహరి రాళ్లు తొలగించి లోపలికి వెళ్లాడు నాగతిస్య. కాని ఈసారి బయటకు రాలేదు. ఆ శిథిల కోష్టాగారంలోనే దాగి ఉండి పోయాడు.

అది అప్పటికే పాడుపడి ఉంది. దానిని ఎవ్వరూ ఉపయోగించడం లేదు. అది కూడా కారాగారాల పక్కన ఉండటంతో బంధీల మలమూత్రాదులతో ఆ ప్రదేశమంతా భరించలేని దుర్గంధంతో ఉండడంతో అటు వైపు ఎవ్వరూ రారు. కోట లోపలే ఆ రాత్రి, పగలు కూడా గడిపి సంధ్యవేళకు మెల్లగా బయటకు వచ్చి రాజప్రాసాదం లోపలికి వెళ్లాడు. గూఢచారిగా రాజప్రాసాదమంతా అతనికి కొట్టిన పిండి.

అనుమకొండ ప్రయాణం పెట్టుకున్న సమయం లోనే ఓరోజు పల్లకిలో ఓ పరిచిత మహిళ.. కవ్వలను చూశాడు.

ఇదేవిటి చనిపోయి తనతో ప్రతి రాత్రి తన కళ్లముందు కదలాడుతున్న కవ్వల బ్రతికి పల్లకిలో కనిపించింది ఏవిటి?

కాసేపటికి వాళ్లు కవల సోదరీమణులని గుర్తొచ్చింది.. ఆమె చెల్లెలు.. బాల కవ్వల అని గ్రహించాడు.

మళ్లీ నాగతిస్య జీవితంలో పెద్ద కదలిక మొదలయ్యింది. బాలకవ్వల కనిపించడంతో ఆసక్తి పెరిగి అనుమకొండ ప్రయాణం వాయిదా వేసుకున్నాడు. అతనిలో చనిపోయిన గూఢచారి మళ్లీ జీవం పోసుకున్నాడు.

దినమూ కవ్వల కనిపించిన రాచబాటలోనే తచ్చాడసాగాడు.

ఆమె ఒక్కరుగానే కాదు మహారాజు సింఘణ దేవునితో ఆయన పల్లకిలో కలిసి కూర్చుని తిరగడమూ.. అలాగే మహారాణి చిల్లాదేవితో కలసి దేవాలయాలకు, మంత్రవేత్తల వద్దకు వెళ్లడమూ, రావడమూ చూసి ఆసక్తి మరింత పెరిగింది.

ఊహాతీతంగా ఓరోజు కవ్వల, కేయూర కలసి వెళ్లడం చూసి నివ్వెర పోయాడు. కేయూరను కూడా సరిగానే పోల్చాడు. వారిద్దరూ భార్యాభర్తలుగా కనిపించగా మరింత మ్రాన్పడిపోయాడు. వారి పెళ్లి మహారాజు సింఘణ దేవుడు జరిపించాడని బిచ్చగాళ్లు చెప్పుకోవడం విన్నాడు. ఆమె అక్కను ఎవరో చంపేశారని.. ఆమె శవాన్ని చూసి ఈ చెల్లెలు మూర్ఛపోయి చాలాకాలం మంచంలో ఉన్నదని.. అప్పుడు ఆమెకు ప్రత్యేక వైద్యం చేయించాడని.. అనేక మంది పురోహితులు, మంత్రవేత్తల సలహాపై సింఘణ ఈ వివాహం జరిపించాడని బిచ్చగాళ్ల కబుర్లలో విన్నాడు.

కారాగారం నుండి బయటపడి ఓ అనామకుడిగా బిచ్చమెత్తుకుని బతుకుతున్నాడు కాని సహజంగా గొప్ప గూఢచారి అయిన నాగతిస్యకు బాలకవ్వలను చూశాక దేవగిరికోటలో కవ్వల విషయంలో ఏమి జరుగుతోంది అనే ఆసక్తి పెరిగింది.

ఈ సమయంలో తను రాజప్రాసాదంలో ఉంటేనా.. అనుకున్నాడు. అనుకుని ఊరుకోలేదు.

లోపలికి కేవలం శిథిలమైన కోష్టాగారం వద్దకు వెళ్లడం కాదు.. రాజ ప్రాసాదంలో పగలు లేదా రాత్రి అందరూ మేలుకుని ఉన్నప్పుడే పరిశీలించాలనే ఉబలాటం పెరిగింది.

అందుకే ఓరోజు కోటలోపలికి వెళ్లి కోష్టా గారంలో ఉండిపోయి మర్నాడు తొలి జామునే బయటకు వచ్చి తలవంచుకుని రాజప్రాసాదం వైపు కదిలాడు. అందులో తనకు తెలియని ప్రదేశం లేదు. కాపలాభటులు ఎక్కడెక్కడ ఎలా ఉంటారు. వాళ్ల ఉద్యోగ సమయాలు మారే విధానం.. ఎక్కడ దుస్తులు మార్చుకుంటారు.. ఎక్కడెక్కడ రాజోచిత బట్టలు పడి ఉంటాయి.. భటులు ధరించే శూలాలు మొదలైన ఆయుధాలు ఎక్కడ ఉంటాయి.. వారికి భోజనాలు



ఏర్పాట్లు ఏవిటి.. ఎక్కడెక్కడ జన కదలికలు ఉండవు.. ఇలా... తెలియని అంశం లేదు.

అవన్నీ మళ్లీ ఇన్నేళ్ల తర్వాత మననం చేసుకుంటూ పోయి దుస్తులు మార్చుకునే చోట నక్కి ఎవ్వరూ లేని సమయంలో అక్కడున్న భటుల రాజోచిత దుస్తులు తొడిగి ఓ శూలం పుచ్చుకుని మరోవైపు వెళ్లాడు. అట్లా ఎవరికీ అనుమానం రాకుండా అటూ ఇటూ తిరుగుతూ ఆకలి దహించుకు పోవడంతో అంతఃపుర వంటశాల వైపు వెళ్లి వంటవాళ్లను అడిగి ఇంత అన్నం తిన్నాడు. అలా తిరుగుతూ పాతికేళ్లనాటి భవనాలలో వచ్చిన మార్పులను చూసాస్తూ ఎవరికీ అనుమానం కలగకుండా అందరి మధ్య తిరగసాగాడు. రాత్రి వచ్చి శిథిల కోష్టాగారంలో పడుకొంటూ రెండు మూడు రోజులుగా అక్కడే ఉన్నాడు.

ఇప్పుడు నాగతిస్య అసలు సిసలు అనుభవజ్ఞుడైన వృద్ధ గూఢచారిగా అప్రమత్తతతో కోటలో ఓ కాపలా భటుడిలా తిరుగాడుతున్నాడు. అంతఃపురం నుంచి బయటకు వచ్చే నడవ మార్గం అతనికి తెలుసు.

వీళ్లంతా గణపతిదేవునికి కీడు తలపెడుతున్నా రని స్పష్టంగా కనిపిస్తోంది. బాలకవ్వల తీవ్రత చూస్తుంటే, ఆమె పగ సాధనలో తీవ్రంగా మమేకమై ఉందనిపిస్తోంది. అందుకు మహారాజైన సింఘణ సహకారం, చిల్లాదేవి ప్రోత్సాహం ఉన్నాయి. కాబట్టి ఏమి జరిగినా జరగవచ్చు. గణపతిదేవుడు మహా యోధుడు, యుద్ధతంత్రజ్ఞుడు కావచ్చు కాని ఆడదాని దెబ్బకు..అంతఃపుర కుట్రలను తట్టుకోగలడా.. సందేహమే!!
తను ఇక్కడే ఉండాలి.. దేవగిరిలోనే ఉండి బాలకవ్వల ప్రయత్నాలను గుర్తించాలి. వీలయితే వీళ్ల కుట్రలను గణపతిదేవుని వద్దకు చేర్చాలి. గట్టిగా నిర్ణయించుకుని అనుమకొండ వెళ్లడం ప్రస్తుతానికి విరమించుకున్నాడు నాగతిస్య.

గతంలో అటు నుంచే కవ్వల బయటకు వచ్చేది. ఆ నడవాలో బయటకు వచ్చే మహిళలపై ఓ కన్ను వేయడమే ఇప్పుడు అతని ఆసక్తి.

మూడో రోజు అతని ప్రయత్నం ఫలించింది.

అతనికి బాలకవ్వల బయటకు వస్తూ కనిపించింది. ఆమె నిటారుగా బయటకు వచ్చి వేగంగా బయటకు వెళుతోంది. ఆమె నుంచి కాస్త ఆవలగా నడుస్తూ..ఆమెను అనుసరించసాగాడు. ఆమె ఆ శిథిల కోష్టాగారం వద్దకు వెళ్లింది.

అక్కడ.. ఎక్కడ అక్క కవ్వల శరీరభాగాలను అందరూ చూశారో అక్కడే కూలబడిపోయింది. వెక్కివెక్కి ఏడ్వసాగింది. భవనం మరో పక్కగా వెళ్లి చాటుగా ఆమెను చూడసాగాడు నాగతిస్య.

ఆమె ఆ గడ్డిలో పడి ఆ గడ్డిని వణికే వేళ్లతో స్పృశిస్తూ వలవలా ఏడుస్తోంది. నాగతిస్యకు కూడా ఏడుపు తన్నుకొచ్చింది. ఆమె కూడా తనలాగే స్పందిస్తోందే అనుకున్నాడు. హఠాత్తుగా లేచి నిలబడింది. గట్టిగా అరచింది. "రేయ్.. పాపాత్ముడా..! కాకతీయ నీచుడా..! ఎంత దారుణం చేశావురా? నా అక్క ఏమి పాపం చేసిందిరా?నిన్ను ప్రేమించడమే ఆమె చేసిన తప్పు కదూ. అందుకే ఆమెను దారుణంగా చంపించావ్. ఇంతకు ఇంత నాశనమై పోతావురా. మా కుటుంబం ఉసురు నీకు తగులుతుంది. నువ్వూ నీ కుటుంబమూ. నీ రాజ్యమూ సర్వనాశనమై పోతాయి. మా ఉసురు నీకు తగులుతుంది. ఇదే నా శాపం. నిన్ను ఏనాటికైనా ఇక్కడికే రప్పించి.. నిన్నూ.. ఇలాగే ఖండఖండాలుగా నరక్కపోతే నేను అక్క కవ్వలకు తోడబుట్టిన దాననే కాను" ఇదే నా సవాల్.

నడుముకున్న చురకను బయటకు లాగి బొటన వేలిని చివ్వున కోసుకుంది. రక్తం చిందిన వేలితో నుదుటన రక్తతిలకం దిద్దుకుంది. అంతే వేగంగా వెనుదిరిగి వెళ్లిపోయింది.

దిమ్మెరపోయి నిలబడిపోయాడు నాగతిస్య.

ఇదేవిటి?? గణపతిదేవునిపై ఇంత అభాండాలా!.. ఇదంతా ఆయనే చేశాడని ఈమె ప్రగాఢంగా నమ్ముతున్నట్లుంది. నమ్మితే మాత్రం ఇంతకంటే అన్యాయం మరి లేదు.

అక్కడే కూలబడ్డాడు.

ఈమె గణపతిదేవుని తప్పు పడుతుందని నాగతిస్యకు మొదట తోచలేదు. సమస్య తిరిగి తిరిగి గణపతిదేవునిపై పడుతుందని అతడు అస్సలు ఊహించ లేదు.

నాగతిస్యకు కవ్వల అప్పాచెల్లెళ్ల పట్ల జాలి, అభిమానం ఉన్నాయి కాని గణపతిదేవుని తప్పుపడితే సహించడానికి, అంగీకరించడానికి అతడు సిద్ధంగా లేదు. బాలకవ్వల గణపతిదేవునిపై పగబట్టడం అతనికి సుతరామూ నచ్చలేదు.

ఆమె మర్నాడు కూడా వచ్చింది. ఆ తర్వాత వచ్చింది. చాలా రోజులు.. బహుశా అక్కడున్నన్ని రోజులు రోజూ వచ్చి ప్రతిజ్ఞ చేసి వెళుతోంది.

నాగతిస్య కూడా లోపలే ఉండి రోజూ కవ్వల రావడం, ఏడవటం, ప్రతిజ్ఞలు చేయడం వినివిని చివరికి ఆమె పట్ల భయం పట్టుకుంది. ఈమె నిజంగానే అన్నంత పని చేసేలా ఉందే అనుకున్నాడు.

అనుకోవడమే కాదు అది నిజమయ్యే సన్నివేశం ఒకటి చూశాడు.

ఒకానొక రోజు బాలకవ్వలతో పాటు వృద్ధురాలు చిల్లాదేవి, మహారాజు సింఘణదేవుడు కూడా వచ్చారు. ఆమె ప్రతిజ్ఞ చేశాక చిల్లాదేవి ఆమె దగ్గరకు వెళ్లి ఆమె కన్నీరు తుడిచి హత్తుకుంది.

సంఘణదేవుడు ఆమె భుజం తట్టి అభినందించాడు.

"నీ క్రోధం చూస్తుంటే నీ ప్రతిజ్ఞ నిజం చేసుకునేలా ఉన్నావ్.. కవ్వలా.." అంది చిల్లాదేవి.

"తప్పక నిజం అవుతుంది. ఇక్కడే అతన్ని నువ్వు ఖండఖండాలుగా నరకడం నేను చూడాలి కవ్వలా.." అన్నాడు మహారాజు సింఘణదేవుడు.

మతిపోయింది నాగతిస్యకు.

ఇదేవిటి.. వీళ్ల సహకారం ఏవిటి? ఇలాంటి పిచ్చిపిచ్చి ప్రతిజ్ఞలు పక్కన పెట్టి నీ కాపురం నువ్వు ప్రశాంతంగా చేసుకో అని చెప్పాల్సింది పోయి ఆమెను అభినందిస్తూ ప్రోత్సహించడం ఏవిటి! పైగా ఆయనిప్పుడు ఆమెకు అల్లుడు, ఈయనకు స్వయానా బావమరిది..అలాంటి స్వంత బంధువును ఈమె చంపుతానని ప్రతిజ్ఞలు చేస్తుంటే వీళ్లు ప్రోత్సహించడం??

స్వయంగా ఆ ఇంటికి అల్లుడైనా.. కాకతీయ మహారాజుగా ఆయనను వీళ్లు శత్రువుగానే చూడటం గుర్తించి నాగతిస్య కుమిలిపోయాడు.. రాజ్యాక్రమణకు ఎలాంటి భవబంధాలు, రాగబంధాలు, ఆత్మీయతలు.. ఉండవని తెలిసిన నాగతిస్య కూడా ఈ దేవగిరి, కాకతీయ విద్వేషాల పట్ల చలించి పోయాడు.

వీళ్లంతా గణపతిదేవునికి కీడు తలపెడుతున్నా రని స్పష్టంగా కనిపిస్తోంది. బాలకవ్వల తీవ్రత చూస్తుంటే, ఆమె పగ సాధనలో తీవ్రంగా మమేకమై ఉందనిపిస్తోంది. అందుకు మహారాజైన సింఘణ సహకారం, చిల్లాదేవి ప్రోత్సాహం ఉన్నాయి. కాబట్టి ఏమి జరిగినా జరగవచ్చు. గణపతిదేవుడు మహా యోధుడు, యుద్ధతంత్రజ్ఞుడు కావచ్చు కాని ఆడదాని దెబ్బకు.. అంతఃపుర కుట్రలను తట్టుకోగలడా.. సందేహమే!!

తను ఇక్కడే ఉండాలి.. దేవగిరిలోనే ఉండి బాలకవ్వల ప్రయత్నాలను గుర్తించాలి. వీలయితే వీళ్ల కుట్రలను గణపతిదేవుని వద్దకు చేర్చాలి.

గట్టిగా నిర్ణయించుకుని అనుమకొండ వెళ్లడం ప్రస్తుతానికి విరమించుకున్నాడు నాగతిస్య.

ఒకవేళ ఆమె ప్రయత్నాలు ఫలించి.. ఆమె గణపతిదేవుని బందీగా ఇక్కడివరకూ తెస్తే తానెంటో చూపాలని.. ప్రాణాలు పణంగా పెట్టి అయినా గణపతిదేవుని రక్షించుకోవాలని అక్కడే ప్రతిజ్ఞ చేశాడు.. కాకతీయ గూఢచారి ఒకప్పటి గణపతి దేవుని రక్షకుడు అయిన నాగతిస్య!

"అమ్మా.. మహాతల్లి కవ్వలా.. గణపతిదేవుల వారు తమర్ని ఎంతగా ప్రేమించారో.. మీరు ఆయనను ఎంతగా ప్రేమించారో స్వయంగా చూసిన వాడిని.. సహాయపడినవాడిని. తమరిని ఏ మహమ్మారి.. ఎందుకు హత్య చేసిందో నాకు తెలియదు. కానీ తెలుసుకుని తీరతాను. ఆ మహమ్మారిని పట్టి బంధించి ఇక్కడే మీకు బలి ఇస్తాను. మీ కోసం తల్లడిల్లిపోతున్న గణపతిదేవుల వారిని రక్షించుకుంటాను. ఇదే నా ప్రతిజ్ఞ!!"

* * *

ఏడవ మెట్టు: మతం – తిక్కన హరహరతత్వం

**శ్రీయన గౌరినా బరగు చెల్వకు జిత్తము పల్లవింప భ / ద్రాయిత మూర్తియై హరిహరంబగు రూపమ్ము దాల్చి విష్ణురూ**

**పాయ నమశ్శివాయ అని పల్కెడు భక్త జనంబు వైదిక / ధ్యాయిత కిచ్చుమెచ్చు పరతత్వము గొల్చెద నిష్టసిద్ధికిన్**

(భక్తి ముఖ్యం కాని హరిహర భేదము లేదు. హరిహరులు సమ్మిళితమై రూపం దాల్చినదే పరతత్వం. అదే హరిహరతత్వంగా కొలుస్తున్నాను.)

"విష్ణు రూపాయ నమశ్శివాయ..

దేవుడు ఓ మహాశక్తిగా తొలినాటి ప్రజలు నమ్మిన రోజున మతం లేదు. సమాజానికి రాచపుండు ఈ మత వ్యవస్థ. దేవుడు అనే శక్తిని ఎందుకు పూజిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. దేవుడు అనే మహాశక్తికి అర్చనా విధానమే శైవం.. లేదా వైష్ణవం. శైవ సంప్రదాయాలకు దైవం శివుడు అయితే వైష్ణవ సంప్రదాయాలకు దైవం విష్ణువు. ఎవరి నమ్మకం వారిదిగా ఈ సమాజం ఎందుకు తీసుకోదు?! తీసుకోకుండా ఎవరు అడ్డగిస్తున్నారు? నా దేవుడే గొప్ప... నా దేవుడినే అందరూ పూజించాలి అనే ధోరణి ఉన్నవాళ్లు ఈ అసహ్యమైన మత దుర్గంధానికి కారణం. ఈ పిచ్చి ఎంతవరకు పోయిందంటే...మరో దేవుడిని పూజించేవాళ్లకు అడ్డంకులు సృష్టించడం.. దాటి ఇప్పుడు మరో దేవుడి భక్తులను చంపేసేవరకు వెళ్లింది. శైవభక్తులు, వైష్ణవభక్తులు అనే రెండు గుంపులు ఏర్పడ్డాయి. మళ్లీ ఇందులో వీరశైవులు, వీరవైష్ణవులు అనే తెగలు పుట్టుకొచ్చాయి. ఎదుటి దేవుడి భక్తులను చంపడమే వీళ్ల ధ్యేయం. ఈ అసహ్యకరమైన సంస్కృతి ఏ విజ్ఞానానికి పరాకాష్ఠ?

అతి జుగుప్సాకరం!! దీనిని తక్షణమే నివారించాలి. మాటలతో చాలదు. దీనిని అసహించు కుంటున్న వ్యక్తిగా సమాజంలో మార్పు తేవడానికి నా వంతు ప్రయత్నం నేను చేస్తున్నాను. పాలక వర్గంగా మీరు దీనిని తక్షణమే నివారించవలసిన అంశంగా స్వీకరించాలని మనవి మహారాజా.. – తిక్కనామాత్యుడు

"కాకతీయ మహారాజులు ఏనాడూ ఏ మతాన్ని ప్రోత్సహించలేదు. వారికి వారు ఇష్టదైవంగా మహాశివుడిని కొలుస్తారు. అంతమాత్రం చేత వైష్ణవులను చంపడాన్ని.. కనీసం అణచివేతను కూడా అంగీకరించరు. వారిది అలీన విధానం. వారు త్రికూటాలయాలు, పంచకూటాలయాలు నిర్మించారు. నిర్మిస్తున్నారు. అంతెందుకు..నేనే వైష్ణవ దేవాలయాలు నిర్మించాను. బుద్ధుడికి కూడా గుడి కట్టించాను. అది నాటి మహారాజు రుద్రదేవులవారికి, ఇప్పటి పాలకులు గణపతిదేవులవారికి కూడా తెలుసు. కానీ వారు నన్నెన్నడూ అడ్డుకోలేదు. మతం అనేదొక రావణకాష్టం. దానిని అధికారవర్గాలు కట్టడి చేయలేవని నా అభిప్రాయం. ప్రజలే తన దైవాలుగా భావించే గణపతిదేవుల వారు ప్రజల బలమైన మత దృక్పథా విషయంలో కలగజేసుకుంటారని నేను భావించలేను. –మహాప్రధాని వెల్లంకి గంగాధరుడు

తొలుత శిబిరం ప్రారంభంలోనే మహామాత్యులు తిక్కన పండితులు చెప్పారు. రాచవ్యవస్థ, వాణిజ్య వ్యవస్థ, మత వ్యవస్థ చెట్టాపట్టాలు వేసుకుని బలిష్ట మౌతున్నాయని. చిన్నరాజ్యాలవల్ల జరుగుతున్న దారుణాలలో ఈ మతాలకు లభిస్తున్న ప్రోత్సాహం ఒకటి. వణిజులే కాదు అక్కడక్కడా మహారాజులు కూడా మతాలను ప్రోత్సహించడంతో మత ద్వేషాగ్ని సమాజాన్ని మరింత మండిస్తోంది. అలాంటి స్వతంత్రరాజులను అడ్డుకోవడం కష్టం. ఈ మత చీడను నాశనం చేయాలంటే తెలుగుసామ్రాజ్య స్థాపనే దానికి తరుణోపాయం.

చిన్నరాజ్యాల సమన్యల నిపుణుడు శాంభవరాయుడు.

వణిజులకు మతం అంటగట్టి కొన్ని గ్రామాల లోకి అమ్మకాలకు రానివ్వడం లేదు. కొన్ని సంతలలో, కొన్ని పేటలలో వర్తకబిడారు రాబోయే ముందే ఆ వర్తకశెట్టి ఏ మతమో.. తెలుసుకుని మరీ సరుకు అమ్మడానికి అనుమతిస్తున్నారు. ఇప్పుడు వణిజుని భాషను కూడా.. అంటే ఆయన తెలుగువాడా.. మరాఠమా.. కన్నడమా..తమిళమా.. అనీ అడుగు తున్నారు. ఆయా గ్రామాల సమయశెట్టిలు. సంత సుంకాధికారులు కూడా కిమ్మనడం లేదు. కాబట్టి మేము శ్రీతిక్కనామాత్యుల హరిహరతత్వాన్ని ప్రభోదిస్తున్నాము. వారికి సహకరిస్తాము."

వస్త్రవ్యాపారశ్రేణి సభ్యుడు చెల్లప్పసెట్టి, చింతనా శిబిరంలో.

* * *

మానుకోట రాజ్యం.. సంభాలపూండి స్థల. ఐదు గ్రామాల కూడలి.

పగలు మూడవజాము.. రైతులు పొలాలకు వెళ్లి తిరిగివచ్చి బువ్వ తిని కాస్త విశ్రాంతిగా పడుకోగా గ్రామమంతా మాగన్నుగా కునుకు తీస్తోంది. ఓ శివభక్తుడు.. చిన్నరైతు ఇంటివైపు నడుస్తున్నాడు. దగ్గరలో ఉన్న శైవ మహాపండితుని ఉపదేశం.. శివలీలలు విని తన్మయుడై.. విన్న శైవగీతాలను కూనిరాగాలు తీస్తూ పోతున్నాడు. అప్పుడే ఎవరో ఆగంతుకుడు ఎదురుగా వచ్చాడు.

అతని నెత్తిపై పెద్దకుండ. ఖచ్చితంగా ఎదురుగా వచ్చి ముందుకు వెళ్లకుండా అడ్డంగా నిలబడ్డాడు.

"ఎవరు నువ్వు?? శివ శివా.. అలా అడ్డుగా నిలబడతావేమయ్యా.. తొలగు తొలగు.." అన్నాడు శైవ రైతు.

అతన్ని ఆ ఆగంతుకుడు ఎగాదిగా చూస్తూ అన్నాడు.

''అయితే నువ్వు ఆ శ్మశానం గాడి భక్తుడివన్నమాట.."

అతని మాటలో కరుకుతనం, ముఖంలో కాఠిన్యం తెలుస్తోంది.

**(సశేషం)**





# మళ్లీ భారీ యు

పశ్చిమాసియా సంక్షోభం కాస్తా 'కోతి పుండు బ్రహ్మ రాక్షసి' అన్నట్లుగా మారింది. ఏప్రిల్ 22తో అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ముగిసినా రెండో విడత చర్చలు మొదలు కాలేదు. దీంతో యుద్ధం మరింత తీవ్రంగా మారే ప్రమాదం పొంచి ఉంది. తమ డిమాండ్లను అమెరికా ఏమాత్రం పట్టించుకోకుండా తమకు ఆమోదయోగ్యం కాని షరతులు విధించడంపై ఇరాన్ ఆగ్రహంతో ఉంది. ఇస్లామాబాద్ వేదికగా జరుగుతున్న రెండో విడత చర్చలు ఏప్రిల్ 20న జరగాల్సి ఉన్నా, రెండు దేశాల ప్రతినిధులు వెళ్ల కుండా దూరంగానే ఉండిపోయారు. యుద్ధానికి చర్చలతో ముగింపు పలకాలని ప్రపంచ దేశాలు మొదటి నుంచి సూచిస్తున్నా అమెరికా, ఇరాన్ తమ మొండి పట్టుదలను అలాగే కొనసాగిస్తున్నాయి. మళ్లీ యుద్ధం మొదలైతే పరిస్థితులు అత్యంత భయానకంగా ఉంటాయి.

యుద్ధం ముగించేందుకు అమెరికా విధించిన షరతులు ప్రకారం...ఇరాన్ తన అణు సామర్థ్యాన్ని, బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాలను వెంటనే నిలిపేయాలి. ఇప్పటి వరకూ తయారైన ఆయుధాలను నాశనం చేయాలి. శుద్ధి చేసిన యురేనియంను తమకు అప్పగించాలి. లెబనాన్, యెమెన్, సిరియా, ఇరాక్‌లలో ఇరాన్ మద్దతు ఉన్న మిలిషియా గ్రూపులకు ఆయుధాలు, నిధుల సరఫరాను ఆపాలి. అంతర్జాతీయ చమురు సరఫరాకు ఆటంకం కలిగించకుండా హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచాలి. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నియంత్రణ తగ్గించాలి. అమెరికా, ఇజ్రాయెల్ దాని మిత్రదేశాలపై దాడులు, సైబర్ దాడులు ఆపాలి. ఇరాన్ తమ షరతులకు అంగీకరించకపోతే ఆ దేశంలోని విద్యుత్ కేంద్రాలు, వంతెనలను నాశనం చేస్తాం. ఇక మీదట అంత మంచివాడిలా ఉండను' అంటూ ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్, ఓవైపు చర్చలకు సిద్ధం అంటూనే మరోవైపు ఇరాన్ ఓడ రేవులను దిగ్బంధించారు.

అమెరికా షరతులు తమకు ఏమాత్రం ఆమోద యోగ్యంగా లేవని స్పష్టం చేసింది ఇరాన్. శాంతి ప్రయోజనాల కోసం చేపట్టిన తమ అణు కార్యక్రమాన్ని వదులుకునేది లేదని ప్రకటించింది. యురేనియంను అమెరికాకు అప్పగించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్.

ఇక ఇరాన్ అమెరికా ముందు పెట్టిన డిమాండ్లు ఇవి: అమెరికా, ఇజ్రాయెల్ తమపై జరుపుతున్న దాడులు, హత్యలు తక్షణమే ఆగిపోవాలి. ఇరాన్‌పై మళ్లీ ఎప్పుడూ ఇలాంటి సైనిక దాడులు జరగవని పటిష్టమైన అంతర్జాతీయ హామీ ఉండాలి. తాము కోరుకోని యుద్ధం కారణంగా జరిగిన నష్టానికి అమెరికా, ఇజ్రాయెల్ స్పష్టమైన పరిహారం చెల్లించాలి. ఇరాన్‌తో పాటు, ఈ ప్రాంతంలోని తమ ప్రతిఘటన సమూహాలపై దాడులు నిలిపివేయాలి. హర్మూజ్ జలసంధిపై ఇరాన్ చట్టపరమైన సార్వభౌమాధికారాన్ని (టోల్ వసూలుతో సహా) గుర్తించాలి.

తమ దేశ ప్రయోజనాలు, భద్రత కోసం ఏం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని ఇరాన్ చెబుతోంది. అయితే, అమెరికన్లు తమ బెదిరింపు విధానంతో అధిక డిమాండ్లను సాధించుకునేందుకు చర్చల వేదికలను వాడుకుంటే కుదరదని హెచ్చరించింది. తమతో అమెరికా కుదుర్చుకునే ఎలాంటి ఒప్పందంలో అయినా లెబనాన్ ఉండి తీరాల్సిందే అని ఇరాన్ స్పష్టం చేసింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని పట్టించుకోకుండా, లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడులను ఖండించింది.

**యుద్ధం మళ్లీ మొదలైతే..**

అమెరికా, ఇరాన్ దేశాల మధ్య శాంతి చర్చలు విఫలమైతే తలెత్తే ప్రమాదాలు ఇలా ఉన్నాయి.. కాల్పుల విరమణ గడువు ముగిసిన తర్వాత సైనిక ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉంది. పూర్తి స్థాయి యుద్ధానికి దారితీసే పరిస్థితి ఏర్పడుతుంది. పశ్చిమాసియాలో భద్రతా పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉంది. ఇతర దేశాలు ఈ ఘర్షణలో చేరే ప్రమాదం ఉంది. దౌత్య చర్చలు పూర్తిగా నిలిచిపోయి దీర్ఘకాలిక అస్థిరత నెలకొనే అవకాశం ఉంది. హర్మూజ్ జలసంధి వద్ద రవాణా అంతరాయం వల్ల చమురు సరఫరా దెబ్బతింటుంది.. గ్యాస్, ఇంధన కొరత పలు దేశాల్లో ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. అంతర్జాతీయ చమురు ధరలు పెరగడంతో పాటు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రపంచ స్టాక్ మార్కెట్లు కుదేలయ్యే పరిస్థితి రావచ్చు.

**ట్రంప్ నాలుకలు ఎన్నో..**

అసలు అమెరికా అధ్యక్షుని డొనాల్డ్ ట్రంప్ ఆలోచనలు, ప్రకటనలు చూస్తుంటే ఆయనకు సంక్షోభానికి తెరదించే ఆలోచన ఏమాత్రం లేనట్లే కనిపి స్తోంది. ఆయన మాటలు ఉద్రిక్తతలను మరింతగా పెంచుతున్నాయి. తాము అమెరికా విధించిన షరతులకు తలొగ్గామని ట్రంప్ చేస్తున్న ప్రకటనలు అన్నీ అవాస్తవాలే అంటున్నారు ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్. ఆయన గంట వ్యవధిలోనే పరస్పర విరుద్ధ ప్రకటనలు చేశారని చెబుతున్న ఇరాన్ వాటికి ఖండనలు, వివరణలు కూడా ఇచ్చేసింది. అవి ఇలా ఉన్నాయి..

హర్మూజ్ జలసంధి పూర్తిగా తెరిచి ఉందని ట్రంప్ చెప్పారు.. తమ అనుమతితోనే తెరుస్తామని ఇరాన్ అంటోంది.

నావికాదళ ఆంక్షలు త్వరగా ముగుస్తాయని ట్రంప్ తెలిపారు.. అమెరికా బ్లాకేడ్ కొనసాగుతోందని ఇరాన్ చెప్పింది.

ఇరాన్ యుద్ధంలో ఓడిపోయిందని ట్రంప్ అన్నారు.. తాము యుద్ధంలో నిలబడ్డామని ఇరాన్ స్పష్టం చేసింది.

చర్చలు దాదాపుగా పూర్తయ్యాయని ట్రంప్ తెలపగా.. ఆయన చెప్పిన అంశాలపై చర్చలు జరగలేదని ఇరాన్ చెబుతోంది.

శుద్ధి యురేనియం ఇరాన్ అమెరికాకు తరలిస్తుందని ట్రంప్ చెప్పగా. శుద్ధి చేసిన యురేనియం ఎక్కడికీ తరలించబడదని ఇరాన్ అంటోంది.

హర్మూజ్ ద్వారా అమెరికాకు ఫ్రీ చమురు రాబోతోందని.. ఇరాన్ ఒప్పుకుందని ట్రంప్ చెప్పడంతో అదంతా అబద్ధమేనని ఇరాన్ ప్రకటించింది.

త్వరలోనే ఒప్పందం అని ట్రంప్ చెబుతుండగా.. చర్చలు క్లిష్ట దశలో ఉన్నాయని ఇరాన్ స్పష్టీకరించింది.

హర్మూజ్ తెరచినట్లే తెరచి..

అమెరికాతో చర్చల వేళ హర్మూజ్ జలసంధిని



# ద్ధం తప్పదా?

తెరిచినట్లు ప్రకటించిన ఇరాన్, కొద్ది గంటల్లోనే తిరిగి మూసేసింది. దాదాపు నెలరోజులకు పైగా హర్మూజ్ మార్గాన్ని దిగ్బంధించిన ఇరాన్ ఏప్రిల్ 17న దానిని తెరుస్తున్నట్లు ప్రకటించింది. ఇకపై అన్ని రకాల వాణిజ్య నౌకల రాకపోకలకు అనుమతి నిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ప్రపంచ దేశాలు ఊపిరి పీల్చుకున్నాయి. దీనిపై వెంటనే స్పందించారు ట్రంప్. ఇరాన్‌కు ధన్యవాదాలు తెలిపిన ట్రంప్.. కాసేపటికి దాన్ని ఇప్పుడు తాము మూసివేస్తున్నట్లు ప్రకటించారు. హర్మూజ్ జలసంధి ఇక తమది అనే సంకేతాలిచ్చి ఇరాన్‌ను మళ్లీ బెదిరించే యత్నం చేశారు. దీంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ట్రంప్ తన ఇష్టాను సారం ప్రకటనలు ఇచ్చుకుంటూ పోతున్నారు. అమెరికా దిగ్బంధం కొనసాగితే తాము సహించేది లేదని ఇరాన్ ప్రకటించింది. ఏప్రిల్ 18 నాడు తిరిగి హర్మూజ్ జలసంధిని మూస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ప్రపంచ దేశాలు మరోసారి తలపట్టుకోవాల్సి వచ్చింది.

అంతర్జాతీయ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిపై మరింత పట్టు కోసం ఇరాన్ ప్రణాళికలు, కొత్త చట్టాలను అన్వేషిస్తోంది. ఇప్పటి వరకు ఇరాన్‌కు నష్టం కలిగించిన ఇజ్రాయెల్ సహా పలు దేశాలపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఇరాన్ సిద్ధమైంది. జలసంధిపై నియంత్రణను కట్టుదిట్టం చేసే కొత్త చట్టాన్ని ఇరాన్ రూపొందించి నట్లు తెలుస్తోంది. హోర్మూజ్ జలసంధిలో నౌకల భద్రత ఉచితం కాదని ఇరాన్ ఉపాధ్యక్షుడు మహ్మద్ రెజా ఆరిఫ్ అన్నారు. ఇరాన్ చమురు ఎగుమతులపై ఆంక్షలు విధిస్తూ ప్రపంచ దేశాలు తమ నౌకల భద్రతను ఉచితంగా ఆశించడం కుదరదని తేల్చి చెప్పారు.

**భారత నౌకలపై కాల్పుల కలకలం**

శాంతి చర్చలకు ఆటంకం కారణంగా హర్మూజ్ జలసంధి మరోసారి రణరంగంగా మారింది. రెండు భారత వాణిజ్య నౌకలపై ఇరాన్ గన్ బోట్స్ కాల్పులు జరిపాయి. చమురుతో మన దేశానికి వస్తున్న ఈ నౌకలపై ఒమన్ తీరానికి 20 నాటికల్ మైళ్ల దూరంలో ఐఆర్‌జీసీ ఒక్కసారిగా మెషీన్‌గన్లతో విరుచుకుపడింది. దీంతో సన్మార్ హెరాల్డ్, జాగ్ ఆర్నావ్ సహా సుమారు 13 భారత నౌకలు తమ ప్రయాణాన్ని రద్దు చేసుకుని హర్మూజ్ జలసంధి నుంచి వెనుదిరిగాయి. వాస్తవానికి ఇరాన్ అనుమతి ఇచ్చిన తర్వాత ఈ నౌకలు ముందుకు కదిలాయి. అయినా ఇలా కాల్పులు జరపడంపై భారత విదేశాంగ శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఢిల్లీలోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీని కార్యాలయా నికి పిలిపించి తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. అంతర్జాతీయ జలాల్లో భారత జెండా ఉన్న నౌకలపై ఇలాంటి దాడులు సహించబోమని స్పష్టం చేసింది. ఈ ఘటనపై ఇరాన్ కూడా స్పందించింది. భారత నౌకలపై కాల్పులు జరిపింది తమ దళాలేనా అన్న అంశంపై దర్యాప్తు చేపట్టినట్టు వెల్లడించింది. ఈ మేరకు ఆ దేశ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘేయి ఒక ప్రకటన చేశారు.

మరోవైపు గల్ఫ్ ఆఫ్ ఒమన్ ప్రాంతంలో ఇరాన్ పతాకంతో ప్రయాణిస్తున్న తౌస్కా అనే వాణిజ్య నౌకపై అమెరికా దళాలు కాల్పులు జరిపి స్వాధీనం చేసు కున్నాయి. ఇరాన్ పతాకంతో వెళుతున్న 900 అడుగుల పొడవున్న రవాణా నౌక తౌస్కా అమెరికా నౌకాదళ దిగ్బంధాన్ని దాటుకొని వెళ్లాలనుకొంది. దీన్ని అమెరికా నౌకాదళ విధ్వంసక నౌక హెచ్చరిక లతో అడ్డుకోబోయింది. ఇరాన్ నావికులు దారికి రాకపోవడంతో దాని ఇంజిన్ రూమ్‌పై కాల్పులు జరిపి ఆపారు అని ప్రకటించారు ట్రంప్. ఓ నౌక ఇరాన్ పోర్టు వైపు ప్రయాణించబోతే సీజ్ చేశామని అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఈ ఘటనపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. అమెరికా యుద్ధ నౌకల పైకి డ్రోన్లను ప్రయోగించి నట్లు ఐఆర్‌జీసీ ప్రకటించింది. అమెరికా నౌకలను తరిమేశామని, ఈ చర్యలు సాయుధ పైరసీగా అంటూ అభివర్ణించింది.

**ఇరాన్ మీద ఐఆర్‌జీసీ పట్టు**

అసలు ఇరాన్‌లో ఏం జరుగుతోంది. అమెరి కాతో చర్చలు విఫలం కావడానికి కారకులు ఎవరు? ఆ దేశం మీద ప్రజలతో ఎన్నికైన ప్రభుత్వానికి పట్టు లేదా? అనే అనుమానాలు బలపడుతున్నాయి.

ఇరాన్ సైన్యంతో పాటు దౌత్య చర్చల బృందాలపై అతివాద ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) పట్టు సాధించిందనే వార్తలు వస్తున్నాయి. ఐఆర్‌జీసీ కమాండర్-ఇన్- చీఫ్ అహ్మద్ వాహిది, ఆయన సన్నిహితులు కలిసి ఇరాన్ సైనిక, దౌత్యపరమైన నిర్ణయాధికారాలను తమ చేతుల్లోకి తీసుకున్నారని తెలుస్తోంది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వంటి మితవాద నాయకులను అహ్మద్ వాహిది వర్గం పక్కన పెట్టినట్లు సమాచారం. అమెరికాతో చర్చలు, లెబనాన్ - ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం హర్మూజ్ జలసంధిని తాత్కాలికంగా తిరిగి తెరవ డానికి అబ్బాస్ అరాగ్చీ అంగీకరించారు. అయితే ఈ నిర్ణయాన్ని అహ్మద్ వాహిది వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో 24 గంటల్లోపే హర్మూజ్‌ను మళ్లీ మూసివేస్తున్నట్లు ఐఆర్‌జీసీ సారథ్యంలోని ఇరాన్ మిలిటరీ కమాండ్ మరో కీలక ప్రకటన జారీ చేసింది.

ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మహ్మద్ బాఘర్ జోల్ఘదర్, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ హుస్సేన్ తయేబ్‌ల మద్దతుతో ప్రభావ వంతమైన శక్తిగా ఐఆర్‌జీసీ చీఫ్ అహ్మద్ వాహిది అవతరించినట్లు చెబుతున్నారు. ఏప్రిల్ 10, 11 తేదీల్లో అమెరికాతో చర్చల కోసం పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌కు వెళ్లిన ఇరాన్ ప్రతినిధి బృందంలో మహ్మద్ బాఘర్ జోల్ఘదర్ కూడా ఉన్నారు. అయితే మీడియాలో కేవలం ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాఘేర్ ఘాలిబాఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చిల పేర్లే ప్రముఖంగా వినిపించాయి. హమాస్, హిజ్బుల్లా మిలిటెంట్ గ్రూపులకు మద్దతును ఆపాలనే అమెరికా ప్రతిపాదన విషయంలో అరాగ్చీ మెతక వైఖరితో స్పందించారని జోల్ఘదర్ ఆరోపించి నట్లు సమాచారం. దీంతో వెంటనే టెహ్రాన్‌కు తిరిగి వచ్చేయాలని ఇరాన్ ప్రతినిధి బృందానికి సుప్రీం లీడర్ ముజ్తబా ఖమేనీ సన్నిహితుడైన హుస్సేన్ తయేబ్ వర్గీయుల నుంచి ఆదేశాలు అందినట్లు తెలిసింది. ఇరాన్‌లో ప్రస్తుతానికి సుప్రీం లీడర్ ముజ్తబా ఖమేనీతో పాటు ఐఆర్‌జీసీ చీఫ్ అహ్మద్ వాహిదియే కీలక నిర్ణయాలన్నీ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.



**క్రాంతిదేవ్ మిత్ర**
సీనియర్ జర్నలిస్ట్



# ప్రశాంత జీ
# దగ్గరిదారి

'మరొకరి ధర్మాన్ని అద్భుతంగా ఆచరించడం కంటే, లోపాలున్నా సరే మన స్వధర్మాన్ని ఆచరించడం మిన్న'– భగవద్గీత

నేటి కార్పొరేట్ ప్రపంచంలో ఉద్యోగం ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని స్థితి. ఇలాంటి సమయంలో ఒక వ్యక్తి "ధర్మాచరణ" ఎలా చేయగలడు?

ప్రస్తుత కాలంలో సాఫ్ట్‌వేర్ రంగంలో జరుగుతున్న లేఆఫ్స్–సామూహిక ఉద్యోగాల తొలగింపు, ఉద్యోగ అనిశ్చితి నేపథ్యంలో ఆధ్యాత్మిక ధర్మాచరణ అనేది కేవలం ప్రశాంతంగా ఉన్నప్పుడు మాత్రమే కాదు, ఇలాంటి సంక్షోభ సమయాల్లోనే మనకు నిజమైన పరీక్ష పెడుతుంది.

**స్థితప్రజ్ఞత**

లేఆఫ్స్ జరిగినప్పుడు భయం, ఆందోళన కలగడం సహజం. అయితే ఆధ్యాత్మిక ధర్మం మనకు 'స్థితప్రజ్ఞత'ను నేర్పుతుంది. అంటే, బాహ్య పరిస్థితులు ఎలా ఉన్నా, మన అంతర్గత ప్రశాంతతను కోల్పోకూడదు. 'నా ప్రతిభ, నా కర్మ నా దగ్గరే ఉన్నాయి, కంపెనీ మారవచ్చు కానీ నా సామర్థ్యం మారద'నే నమ్మకం ధర్మాచరణలో ఒక భాగం. చాలామంది తమ ఉద్యోగాన్ని తమ 'గుర్తింపు'గా భావిస్తారు. ఉద్యోగం పోగానే తమ ఉనికి కోల్పోయినట్లు భావిస్తారు. కానీ ఆధ్యాత్మికంగా మనం అంటీముట్టనట్టు ఉండాలి. అంటే, ఉద్యోగాన్ని పూర్తి బాధ్యతతో చేయాలి, కానీ అది పోయినప్పుడు కుప్పకూలిపోకూడదు. మనం ఒక పాత్రను పోషిస్తున్న నటుడి లాంటి వాళ్లమే అని గుర్తించడం ఇక్కడ ఉదాత్తమైన భావన. కంపెనీ తన లాభాల కోసం లేఆఫ్స్ చేసినా, ఒక ఉద్యోగిగా తన 'స్వధర్మం' ఏమిటి? ఆఫీసులో ఉన్నంత కాలం తన పనిని నిజాయితీగా చేయడం, తోటి ఉద్యోగులకు అండగా ఉండటం. సంక్షోభ సమయంలో తోటివారిని తొక్కేసి మనం నిలబడాలి అనుకోవడం 'అధర్మం'. అందరి హితాన్ని కోరుకుంటూ మన ప్రయత్నం మనం చేయడం 'ధర్మం'.

**ఆపద్ధర్మం**

లేఆఫ్స్ ఎదురైనప్పుడు అధైర్యపడి తప్పుడు మార్గాల్లో వెళ్లకుండా, ఓపికతో కొత్త అవకాశాల కోసం వెతకడం, ఉన్న వనరులను పొదుపుగా వాడుకోవడం 'ఆపద్ధర్మం' కిందకు వస్తుంది. ఇది మనల్ని మానసికంగా దృఢంగా ఉంచుతుంది.

ప్రాణి కోటి ఎలా ప్రవర్తించాలో తెలియజేసేదే ధర్మం. అది మార్పు చెందే ప్రసక్తే ఉండదు. మనిషికి ఆధ్యాత్మికోన్నతి అందించేదే ధర్మం. మానవ ధర్మాల్లో ముఖ్యమైనవి– నిగ్రహం, ప్రేమ, సంతృప్తి, త్యాగం. అలాగే మనిషిని దహింపజేసేవి–అత్యాశ, ద్వేషం, పరదూషణ, పగ. ధర్మాన్ని ఆచరించడం అంటే బాధ్యతల నుండి పారిపోవడం కాదు. వాటిలో ఉంటూనే వాటికి బందీ కాకపోవడం. ఆధ్యాత్మికంగా ధర్మం అంటే మన అంతరాత్మ చెప్పే మాటను వినడం. బయటి ప్రపంచం ఏమనుకుంటుందో అన్నదాని కంటే, మన మనస్సాక్షికి ఏది సరైనది అనిపిస్తుందో అది చేయడమే నిజమైన ధర్మాచరణ. దీనినే "హృదయ ధర్మం" అంటారు. నిజమైన ధర్మాచరణ అంటే కర్మలను చేస్తూనే, వాటి ఫలితాల పట్ల మమకారం లేకుండా ఉండటం. తామరాకు మీద నీటిబొట్టులా, సంసారంలో ఉంటూనే దేనికీ లొంగిపోకుండా తన కర్తవ్యాన్ని నిర్వహించడం అత్యున్నతమైన ఆధ్యాత్మిక స్థితి. ఇది చిత్తశుద్ధిని కలిగిస్తుంది. భగవద్గీత బోధించినట్లుగా, "కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన" అంటే పని చేయడం మీద మాత్రమే నీకు అధికారం ఉంది, ఫలితం మీద లేదు. ఫలాపేక్ష లేకుండా చేసే పని ఆధ్యాత్మికంగా మనిషిని బంధనాల నుండి విముక్తుడిని చేస్తుంది. కానీ కష్టాలు ఎదురైనప్పుడు మనల్ని కాపాడేది మన లోపల ఉన్న నిజాయితీ, విలువలే తప్ప పైన ఉన్న మెరుగులు కావు. ప్రకృతిలో ప్రతిదీ ఒక ధర్మాన్ని అనుసరిస్తుంది. సూర్యుడు సమయానికి ఉదయిస్తాడు, నదులు ప్రవహిస్తాయి. అలాగే మన జీవితంలో ఒక క్రమశిక్షణను అలవర్చుకోవడం ధర్మం. అది సరైన మార్గంలో నడిపించే ఒక దిక్సూచి. విజయానికి నీతిని, ధర్మాన్ని జోడిస్తే అప్పుడు విజయం అజేయం అవుతుంది. ధర్మం అంటే కట్టడి చేసే సంకెళ్లు కాదు.

**ఆధ్యాత్మిక ప్రయాణం**

మన చుట్టూ చీకటి (లేఆఫ్స్) ముసిరినప్పుడు, మన లోపల ఉన్న ధర్మం అనే దీపాన్ని వెలిగించుకోవాలి. బాహ్య ప్రపంచం మన ఉద్యోగాన్ని తీసుకోగలదు కానీ, మన జ్ఞానాన్ని, ధర్మాన్ని, ఉదాత్తమైన ఆలోచనలను ఎవరూ తీసుకోలేరు. ధర్మాచరణ అంటే బాధ్యతలను విస్మరించడం కాదు, బాధ్యతలను నెరవేరుస్తూనే వాటి ఫలితాలకు బందీ కాకుండా ఉండటం. మనం చేసే ప్రతి పనిని (అది కోడింగ్ అయినా, పెయింటింగ్ అయినా) ఉదాత్తమైన భావంతో చేసినప్పుడు, జీవితమే ఒక ఆధ్యాత్మిక ప్రయాణంగా మారుతుంది. ధర్మాచరణలో ప్రధానమైనది సాటి ప్రాణుల పట్ల కరుణ కలిగి ఉండటం. "ఆత్మవత్ సర్వభూతాని" అంటే అన్ని జీవులను తన వలెనే చూడటం. ఇతరులకు మేలు చేయడమే పుణ్యం, కీడు చేయడమే పాపం అనే భావనతో జీవించడం ఒక గొప్ప ఆధ్యాత్మిక సాధన. ధర్మాన్ని ఆచరించడం వల్ల ఇంద్రియ నిగ్రహం కలుగుతుంది. ఆహార విహారాల్లో, ఆలోచనల్లో ఒక



తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి
8008577834

ఆకాశ్ ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ప్రకాశ్ ఒక చిత్రకారుడు. ఇద్దరూ ప్రాణ స్నేహితులు. ఒకరోజు సాయంత్రం సముద్ర తీరాన నడుస్తుండగా వారి మధ్య ఒక ఆసక్తికరమైన చర్చ జరిగింది. "ప్రకాశ్, ఈ ప్రపంచం అంతా పోటీ. నేను ఆఫీసులో ఎప్పుడూ టెన్షన్ పడుతూ ఉంటాను. ఉద్యోగ భద్రత, టార్గెట్లు.. వీటి మధ్య 'ధర్మం' గురించి ఆలోచించే సమయం ఎక్కడిది? అసలు దైనందిన జీవితంలో ధర్మాచరణ సాధ్యమేనా?" అని ఆకాశ్ అడిగాడు. ప్రకాశ్ నవ్వుతూ సముద్రపు అలల వైపు చూపిస్తూ ఇలా అన్నాడు, "ఆకాశ్, ఈ అలలు ఎప్పుడూ ఒడ్డుకు వస్తూనే ఉంటాయి. అవి తమ బాధ్యతను (ధర్మాన్ని) నిర్వర్తిస్తున్నాయి. అలలు ఒడ్డును తాకినప్పుడు కొన్ని గవ్వలను వదిలి వెళ్తాయి, కొన్నిసార్లు సముద్రగర్భాన ఉన్న చెత్తను ఒడ్డుకు



# ...వనానికి ధర్మాచరణ

పద్ధతిని పాటించడం వల్ల మనస్సు ఏకాగ్రతను పొందుతుంది. ఇది ధ్యానానికి, తద్వారా దైవత్వానికి దారితీస్తుంది. ఆధ్యాత్మిక పరంగా ధర్మాచరణ అంటే ఏదో బాహ్య నియమాలను పాటించడం కాదు. అది మన అహంకారాన్ని తగ్గించుకుని, విశ్వజనీనమైన ప్రేమతో బాధ్యతాయుతమైన ప్రవర్తనతో జీవించడం. ధర్మబద్ధమైన జీవితం గడిపే వ్యక్తికి మరణ భయం ఉండదు. వారు ఎల్లప్పుడూ అంతర్గత శాంతిని అనుభవిస్తారు. "సత్యం వద – ధర్మం చర" (సత్యాన్నే మాట్లాడు – ధర్మాన్నే ఆచరించు) అనేది ఉపనిషత్తులు మనకు అందించిన పరమ సత్యం. సాధారణంగా మనం ఏదైనా పని చేసేటప్పుడు "నాకేం వస్తుంది?" అని ఆలోచిస్తాం. కానీ ఆధ్యాత్మిక ధర్మాచరణలో "ఫలాపేక్ష లేని పని" ప్రధానం. ఫలితం మీద ఆశ వదిలేసినప్పుడు, మనస్సు భయం, ఆందోళన నుండి విముక్తి పొందుతుంది. ఈ స్థితిలో చేసే పని అత్యంత నాణ్యతతో ఉంటుంది. ఇదే 'యోగం'. సంసారంలో ఉంటూ, అందరినీ ప్రేమిస్తూనే.. "ఎవరూ నా వారు కారు, అంతా ఈశ్వరేచ్ఛ" అనే భావనతో ఉండటం మనల్ని మానసిక వేదనల నుండి కాపాడుతుంది. బురదలో ఉన్నా అంటని తామర పువ్వులా జీవించడమే అసలైన ధర్మం.

**ధర్మాచరణతో ఉన్నతస్థితి**

మానవునికి ధర్మాచరణ ముఖ్యం, తాను జీవిస్తున్న సమాజ భద్రతకు, తన జీవన క్రమశిక్షణకు మానవుడు విధిగా ఆచరించనలసిన కొన్ని విశేష ధర్మాలను భాగవతం చెప్పింది. సత్యనిష్ఠ, దయాగుణం, తపస్సు, మనోనిగ్రహం, ఇంద్రియ నిగ్రహం, త్యాగం, నిజాయితీ, నిష్కపటం, ఓర్పు, వినయం మొదలైనవి ప్రతి వ్యక్తి పాటించవలసిన ఉత్తమ ధర్మాలు. ఇవి వ్యక్తిగతంగా తనకే గాక తాను జీవిస్తున్న సమాజానికి, సర్వమానవాళికి కూడా శ్రేయస్సును కలిగిస్తాయి. మానవులకు, జంతువులకు పరమాత్మ ధర్మాలను నిర్దేశించాడు. వినయం, సహనం, ఆచారం, పరాక్రమం మనిషికి సంస్కారం అందించే సాధనాలు. తనకు నచ్చని అంశాలను పరులమీద రుద్దకుండా చేయటం ధర్మం. తన దారిలో ఎవరి మాట వినకుండా ముందుకు నడవడం అధర్మం. అగ్ని వేడిని, నీరు చల్లదనాన్ని అందిస్తాయి. సింహం గర్జిస్తుంది. అటు ఇటూ పరుగెత్తుతూ చపలత్వాన్ని ప్రదర్శించడం లేడి లక్షణం. ఈ రకంగా ప్రతిదీ తన ధర్మాన్ని పాటింపజేయడం కేవలం పరమాత్మ సృజన. ఆయన సంకల్పం లేనిదే మానవ ధర్మం మృగ్యమే. ప్రతి పనిలో మనిషి అభివృద్ధిని ఆశిస్తాడు. అది సాధించాలంటే కఠోర సాధన అవసరం. సాధనే ధర్మం. అది మనిషిని పతనం కానివ్వకుండా కాపాడు తుంది. 'ధర్మో రక్షతి రక్షితః', ధర్మాన్ని ఎవరైతో కాపాడుతారో వారిని ధర్మమే కాపాడు తుంది. ధర్మాచరణ వ్యక్తిని, మనసును శుద్ధిపరుస్తుంది. ధర్మం అంటే సహజ గుణం. రచయితకు రాయడం ధర్మం. ఒక సైనికుడికి రక్షించడం ధర్మం. సహజ సిద్ధమైన ప్రతిభను లోక కళ్యాణం కోసం ఉపయోగించడమే ఆధ్యాత్మిక మార్గం. "నేను కేవలం ఒక నిమిత్త మాత్రుడిని, ప్రకృతి లేదా దైవం నా ద్వారా ఈ పని చేయిస్తోంది" అనే సాక్షి భావన కలగడం.

మనిషి ఆధ్యాత్మిక కర్మలను ధర్మబద్ధంగా ఆచరించినప్పుడే తనను. సమాజాన్ని, ఇతర ప్రాణుల్ని, ప్రకృతిని, ప్రపంచాన్ని రక్షించగలుగుతాడు. ధర్మం అనేది లేకపోతే పై వాటికి రక్షణ లేదు.

**స్వధర్మం-విధర్మం-పరధర్మం-ఉపధర్మం**

ధర్మాచరణ వలన అర్థ ప్రాప్తి, ధర్మాచరణం వల్లనే సుఖం, ధర్మం వల్లనే సమస్తం సాధించవచ్చన్న సత్యం మనకు తెలుస్తోంది. స్వధర్మానికి బాధ కలిగించేది– విధర్మం. ఇతరుల ప్రేరణతో ఇతరుల ధర్మాన్ని ఆచరించేది– పరధర్మం, భగవంతుడి పట్ల విశ్వాస రహితులైన వారు చేసేది, చెప్పేది–ఉపధర్మం, తన ధర్మాన్ని నిర్లక్ష్యం చేయడం, ధర్మానికి విపరీతార్థాలను తీసి వివరించడం అనే అయిదు 'అధర్మాలు' త్యజించ వలసినవిగా వేదవ్యాసుడు పేర్కొన్నాడు. కరుణ, ఆదర్శ గృహస్థ జీవనం, నిత్యకర్మాచరణశీలత లోక కల్యాణకారకాలు, భగవద్భక్తి మార్గ నిర్దేశాలు. వీటిని మరవడం అంటే మన ధర్మాన్ని మనం విస్మరించడమే అవుతుంది. కాలం గడిచేకొద్దీ ధనం వెళ్లిపోతుంది, మన వాళ్లనుకున్న వాళ్లు వెళ్లిపోతారు, అధికారం పోతుంది. జ్ఞాపకశక్తి కూడా పోతుంది. అన్నీ పోతాయి... అలాగే యవ్వనం కూడా. కానీ మిగిలిపోయేది ఏదైనా ఉందంటే ఆ వ్యక్తి ధార్మికంగా జీవించా.. లేదా? అన్నదే. నిజమైన ధర్మాచరణలో ప్రేమ అంతర్లీనంగా ఉంటుంది. స్వార్థం అంతమైన చోట, అక్కడ ధర్మం మొదలవుతుంది. రాసే ప్రతి అక్షరం, చేసే ప్రతి ఆలోచన లోకానికి హితాన్ని చేకూర్చాలనే సంకల్పం ఉంటే, అది అత్యున్నతమైన ఆధ్యాత్మిక ధర్మాచరణ అవుతుంది. దైనందిన జీవితం, సృజనాత్మక ప్రయాణం ఈ రెండూ వేర్వేరు కాదు. ఒకదానికొకటి ప్రతిబింబాలు. ఆధ్యాత్మిక

చేరవేస్తాయి. అవి ఆశించి ఏమీ చేయడం లేదు, కేవలం తమ స్వభావాన్ని అనుసరిస్తున్నాయి." మరుసటి రోజు వారిద్దరూ ఒక తోటలో కూర్చున్న ప్పుడు, అక్కడ ఒక అంధుడు నడవలేక ఇబ్బంది పడటం చూశారు. ఆకాశ్ వెంటనే వెళ్లి అతనికి దారి చూపించాడు. తిరిగి వచ్చాక "ఇది ధర్మం కదా?" అని ప్రకాశ్‌తో అన్నాడు. "అవును, కానీ దీనికంటే లోతైనది మరొకటి ఉంది. నువ్వు అతనికి సహాయం చేశావు కాబట్టి నీకు మనసులో ఒక రకమైన 'నేను మంచి చేశాను' అనే తృప్తి (అహంకారం) కలిగింది. కానీ నిజమైన ఉదాత్తత ఎక్కడ ఉందంటే సహాయం చేసిన విషయాన్ని మర్చిపోయి, అది నీ బాధ్యతగా మాత్రమే గుర్తించినప్పుడు. అంటే 'అంటీముట్ట నట్టు' ఉండటమని ప్రకాశ్ వివరించాడు. కొన్ని నెలల తర్వాత ఆకాశ్ కంపెనీలో లేఆఫ్స్ మొదలయ్యాయి. ఆకాశ్ చాలా ఆందోళనకు గురయ్యాడు. అప్పుడు ప్రకాశ్ అతడితో ''ఆకాశ్, నీ పని నువ్వు నిజాయితీగా చేయడం నీ ధర్మం. కానీ ఫలితం నీ చేతుల్లో లేదు. ఉద్యోగం ఉన్నా, పోయినా నీ లోపల ఉన్న 'శాంతి' మారకూడదు. అదే ఆధ్యాత్మిక ధర్మాచరణ. నువ్వు నీ వృత్తిని కేవలం జీవనా ధారంగా కాకుండా, లోకానికి నీవంతు సేవగా భావించు. అప్పుడు నీ సృజనాత్మకత పెరుగుతుంది, భయం పోతుంది" అని అన్నాడు. ఆ మాటలతో ఆకాశ్‌లో మార్పు వచ్చింది. అతడు ఆఫీసులో కేవలం జీతం కోసం కాకుండా, తన పని పట్ల మక్కువతో, ఇతరులకు సహాయం చేస్తూ పని చేయడం మొదలుపెట్టాడు. చిత్రంగా, ఇప్పుడతనికి ఉద్యోగం పోయినా సొంతంగా ఏదైనా స్టార్టప్ నిర్వహించగలననే ధీమాతో ఉన్నాడు.

ధర్మాచరణను వీటిలో అన్వయించు కోవడం అంటే మన ఉనికిని ఒక ఉన్నత స్థితికి తీసుకెళ్లడమే. దైనందిన జీవితంలో ధర్మాచరణ, నిత్యం మనం చేసే పనులలోనే ఆధ్యాత్మికతను వెతుక్కోవడం సాధ్యమే. ప్రస్తుత క్షణంలో జీవించడం. గతంలో జరిగిన పొరపాట్ల గురించి చింతించకుండా, భవిష్యత్తు గురించి ఆందోళన చెందకుండా, ఇప్పుడు చేస్తున్న పనిని పూర్తి ఏకాగ్రతతో చేయడమే గొప్ప ధర్మం.

**అంతర్మాతను అనుసరిద్దాం**

కష్ట సమయాల్లో లేదా ఇతరులు విమర్శించినప్పుడు ఉద్వేగానికి లోనుకాకుండా, నిలకడగా ఉండటం ఒక ఆధ్యాత్మిక సాధన. మనం చేసే వృత్తి ఏదైనా, అది సమాజానికి ఎలా ఉపయోగపడుతోంది అనే స్పృహ కలిగి ఉండటం. "నేను నా బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తున్నానా?" అని మనల్ని మనం ప్రశ్నించుకోవడమే ధర్మాచరణ. ఒక కళాకారుడిగా సృజన కేవలం వినోదం కోసం మాత్రమే కాకుండా, ఒక 'సాధన'గా మారాలి. రచనల్లో లేదా సృజనలో నిజాయితీ ఉండాలి. ప్రాచుర్యం కోసమో, ఎవరినో మెప్పించడానికో కాకుండా, అంతరా త్మకు సరైనది అనిపించిన భావాలను వ్యక్తీకరించడం 'సృజనాత్మక



ధర్మం' అవుతుంది. "ఈ కథను నేనే రాశాను" అనే అహంకారాన్ని పక్కన పెట్టి, ఒక ఉన్నత శక్తి ఈ సృజనను చేయిస్తోందని భావించినప్పుడు, ఆ రచనకు ఒక అద్భుతమైన శక్తి వస్తుంది. "విశ్వశ్రేయః కావ్యం" అన్నట్లుగా, మన సృజన చదివిన వారికి లేదా చూసిన వారికి ఒక మంచి ఆలోచనను, ప్రశాంతతను లేదా ధైర్యాన్ని అందించాలి. "అంటీముట్టనితనం" తో జీవితంలో బాధ్యతలను మోస్తున్నా, సృజనలో పాత్రలను సృష్టిస్తున్నా, ఆ పాత్రల సుఖదుఃఖాలకు ప్రభావితం కాకుండా ఉండటమే ఆధ్యాత్మికత. జీవితంలో సమస్యలు వచ్చినప్పుడు అవి 'ఆత్మ'కు సంబంధించినవి కావని గుర్తించడం. సృష్టించిన పాత్రల ఘర్షణలో చిక్కుకోకుండా, ఒక 'సాక్షి'గా వాటిని నడిపించడం. ఏదైనా కొత్త పనిని లేదా రచనను ప్రారంభించే ముందు, "నేను ఒక నిమిత్త మాత్రుడిని, ఈ పని లోక హితం కోసం సాగాలి" అని సంకల్పించుకోవాలి. ఇది అహంకారాన్ని తగ్గించి, సృజనాత్మకతను అనంతంగా వికసింపజేస్తుంది. మనల్ని నొప్పించిన వారిని క్షమించడం ఒక ఆధ్యాత్మిక సాధన.

కోపాన్ని అణచుకోవడం కాకుండా, అవతలి వారి అజ్ఞానాన్ని అర్థం చేసుకుని జాలి చూపడం ఉదాత్తమైన భావన. దైనందిన జీవితంలో ఎదురయ్యే చిన్న చిన్న ఘర్షణలను పెద్దవి చేయకుండా, హుందాగా వ్యవహరించడం ఇందులో భాగమే అవుతుంది. "నేను ఎవరు? నేను ఎక్కడి నుండి వచ్చాను? ఈ సృష్టి వెనుక ఉన్న రహస్యం ఏమిటి?" అనే తాత్విక ప్రశ్నలను మనసులో ఉంచుకోవడానికి దారి తీసే జిజ్ఞాస మనల్ని ప్రాపంచిక విషయాలకు అతీతంగా ఉంచుతుంది. "మనం ఏమి ఇస్తామో, అదే మనకు తిరిగి వస్తుంది." సమాజానికి మంచి ఆలోచనలను, ఉదాత్తమైన భావనలను అందిస్తే, జీవితం కూడా సహజంగానే ప్రశాంతంగా, అర్థవంతంగా మారుతుంది. ★





# యుద్ధమూ

**మధ్యప్రాచ్యంలో వరుస యుద్ధాలు వచ్చినందుకు, అవి మరింత తీవ్రరూపం దాలుస్తున్నందుకు అమెరికా ఆయుధ వ్యాపారులు తెగ సంబరపడుతున్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం చల్లబడటంతో ఆయుధ వ్యాపారం మందగించింది. ఇజ్రాయిల్-పాలస్తీనా యుద్ధం, ఇజ్రాయిల్-లెబనాన్ యుద్ధంగా పరిణమించడంతో అమ్మకాలు ఓ మోస్తరు పెరిగాయి. అయితే తొలుత ఉన్నంత ఉధృతంగా లేకపోవడంతో మారణాయుధాల విక్రయ లక్ష్యాలను చేరడం లేదు. అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్‌ల మధ్య యుద్ధం రావడంతో మంచి లాభాలు ఆర్జిస్తున్నారు అగ్రరాజ్యంలోని ఆయుధ వ్యాపారులు. ఈ యుద్ధంలోకి యెమెన్‌లోని హౌతీలు, ఇరాన్‌లోని షియా మిలిటెంట్లు కూడా జతకలిస్తే...సరుకు మరింత అమ్ముకోవచ్చని కొత్త ప్రణాళికలు రచిస్తున్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయిల్-హమాస్ యుద్ధాల తర్వాత అమెరికా ఆయుధ కంపెనీల లాభాలు అమాంతం పెరిగాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కన్నా ముందు ఆయుధాల అమ్మకం నీరసంగా ఉండేది. అడపాదడపా ఆఫ్రికా దేశాల్లోని మిలిటెంట్లకు, చిన్నచిన్న దేశాల ప్రభుత్వాలకు కొంచెం కొంచెం సరుకు అమ్ముకుని సర్దుకునేవారు.**

ఆయుధ ఉత్పత్తితో పోలిస్తే, అమ్మకాలు దిగువన ఉండేవి. ఆయుధ అమ్మకాలు ఢీలా పడితే..వ్యాపారులకే కాదు, అమెరికా ఆర్థిక వ్యవస్థకు కూడా బోలెడు నష్టం వాటిల్లుతుంది. ప్రపంచంలో ఏదో ఓ మూల ఏదో ఓ యుద్ధమో, ఉద్రిక్తతో ఉండాలని శ్వేతసౌధం ఎదురు చూస్తూ ఉంటుంది. పైకి శాంతి వచనాలు పలుకుతుంది కానీ, లోలోపల మారణహోమాలు జరగాలని ప్రార్థనలు చేస్తుంది.

సొంత దేశంలోని పాఠశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల 'గన్ కల్చర్' – తుపాకీ సంస్కృతి మరణమృదంగాలు మోగించినా పట్టించుకోకపోవడానికి కారణం..సంపదపై గల మక్కువ. అందుకే తుపాకుల వినియోగాన్ని నిషేధించడానికి అమెరికా ససేమిరా ఒప్పుకోదు. మృతులకు నివాళిగా కొవ్వొత్తులు వెలిగించి సంస్మరణగీతాలు పాడుతుంది కానీ, సమస్యను పరిష్కరించడానికి అమెరికాకు మనస్కరించదు. ఈ ఏడాది జనవరిలో అమెరికా ఆయుధ ఎగుమతులు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. 2023లో 238 బిలియన్ డాలర్ల ఆయుధాలను అమెరికా ఎగుమతి చేసింది. ఈ ఎగుమతులన్నీ ఉక్రెయిన్ యుద్ధ పుణ్యమే! అందుకే ఉక్రెయిన్‌కు వంతపాడుతూ ఉంటుంది. ప్రపంచ ఆయుధ తయారీ రంగాన్ని శాసిస్తున్నది పిడికెడు కంపెనీలే! అందులో



# వ్యాపారమే!

లాక్‌హీడ్ మార్టిన్ కంపెనీ ప్రధానమైంది. తర్వాతి వరుసలో బీఏఈ సిస్టమ్స్, రేథియోన్ టెక్నాలజీస్, నార్త్‌రోప్ గ్రుమ్మన్ కంపెనీలున్నాయి. ఈ వరుసలో చివరిది జనరల్ డైనమిక్స్ కంపెనీ. ఈ ఐదు కంపెనీలు భిన్న రకాలైన ఆయుధాలను ఉత్పత్తి చేస్తాయి. యుద్ధ విమానాలు, యుద్ధ ట్యాంకులు మొదలు మిసైళ్లు ఇతర ఎలక్ట్రానిక్ రణరంగ సామాగ్రిని తయారు చేస్తాయి.

తూర్పు ఐరోపా, పశ్చిమాసియా యుద్ధాలకు ముందు ఈ ఐదు కంపెనీలు తమ ఏజెంట్లను దేశదేశాలు తిప్పేవి. ఆయుధాలను కొనమని ప్రభుత్వాలను ప్రాధేయపడేవి. వివిధ దేశాలకు చెందిన అందమైన యువతులను ప్రత్యేక విమానాల్లో తిప్పుతూ...రక్షణ మంత్రులకు ఎరగా వేసేందుకు తెగ ఖర్చు పెట్టేవి. కానీ, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత ఈ కంపెనీల తీరు పూర్తిగా మారిపోయింది. ఇజ్రాయిల్-పాలస్తీనా యుద్ధం తర్వాత అయితే చెప్పనక్కరలేదు. అంతర్జాతీయ గిరాకీకి తగ్గట్టు ఆయుధాలు సరఫరా చేయలేమంటున్నాయి. తమ సరుకంతా..తాజాగా ఉండగానే విమానాలకు ఎత్తేస్తున్నట్టు చెప్పేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్ లో 'గన్ పౌడర్' కొరత ఆయుధ తయారీ రంగాన్ని అతలాకుతలం చేస్తోందని అందుకే డిమాండ్‌ను అందుకోలేమంటున్నాయి.

లాక్‌హీడ్ మార్టిన్ కంపెనీ ఆదాయం 2018లో 43 బిలియన్ డాలర్లు ఉంటే 2025 నాటికి అది 71 బిలియన్ డాలర్లకు చేరింది. నాలుగేళ్ల వ్యవధిలో 28 బిలియన్ డాలర్ల కొత్త లాభాలను సొంతం చేసుకుంది. రేథియోన్ టెక్నాలజీస్ ఆదాయం 2020తో పోలిస్తే 13శాతం వృద్ధితో 67 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఐరోపా ఆయుధ మార్కెట్ కీలక పాత్ర పోషించే బీఏఈ సిస్టమ్స్ లాభాలు ఏటా పది శాతం పెరుగుతూ 20 బిలియన్ పౌండ్లకు చేరింది. బీఏఈ సిస్టమ్స్ తన ఆయుధాలను ప్రధానంగా పశ్చిమాసియా, ఉక్రెయిన్ లోనే విక్రయించింది. ఏటా ధ్వంసరచన విస్తరిస్తున్నట్టుగా ఆయుధ తయారీ కంపెనీల లాభాలు పెరుగుతూ వస్తున్నాయి. ఈ ఐదు కంపెనీలకు ఇటీవలి యుద్ధం వల్ల సమకూరిన ఆదాయాలు కాకుండా యెమన్ అంతర్యుద్ధంలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో మునిగి తేలుతున్న సౌదీ అరేబియా, యూఏఈ సహా ఇతర గల్ఫ్ దేశాలకు నెలవారి రేషన్‌లా ఆయుధాల అమ్మకం వల్ల నిరంతరం ధన ప్రవాహం కొనసాగుతూనే ఉంటుంది. అంటే యుద్ధంతో అదనపు ఆదాయం సమకూరుతుంది అన్నమాట! ఇదంతా ప్రైవేటు కంపెనీల చిట్టాపద్దుల లెక్క.

అమెరికా ప్రభుత్వం అధికారికంగా చేసిన రక్షణ సాయం కథ మరింత ఆసక్తికరం. ఫిబ్రవరి, 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత ఉక్రెయిన్‌కు 55.3 బిలియన్ డాలర్ల విలువ చేసే ఆయుధాలను అందించింది అమెరికా. 2014లో ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి మొత్తంగా 58.1 బిలియన్ డాలర్ల సైనిక సాయం చేసింది. సాయంగా అందిన ఈ మొత్తం ఆయుధ సరఫరాలో డిఫెన్స్ కాంట్రాక్టర్లకు ఎంతమేర లాభాలు అందాయో మనం ఊహించుకోవాల్సిందే! ఈ లెక్కలు పూర్తిగా రహస్యం. అందుకే ప్రపంచంలోని ఏ దేశాలైనా సరే, రక్షణ సాయం ప్రకటించాయంటే, అమెరికా డిఫెన్స్ కాంట్రాక్టర్లు సంబరాల్లో మునిగి తేలతారు. రక్షణ మంత్రులు ఉబ్బితబ్బిబ్బవుతారు.

విచిత్రమేమిటంటే, యుద్ధాలు మొదలవ్వగానే ఆయా దేశాల్లోని నిరాశ్రయ ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఆహార పదార్థాలు అందించే దేశాలే అరుదు. ఆయుధాలు సాయం చేసేవే అధికం. అందుకు కారణం, మారణాయుధాల్లో లభించే లాభం ముందు 'పిడికెడు మెతుకులు' దిగదుడుపు. భారత్ మాత్రమే విలయం, ప్రళయం, యుద్ధం ఏది వచ్చినా, వెంటనే వైద్యసాయం ప్రకటించి, సపర్యలు చేసేందుకు, స్వచ్ఛంద సేవా వ్యవస్థను పురమాయిస్తుంది.

రష్యా భయంలో ఉన్న అనేక ఐరోపా దేశాలు ఆయుధ నిల్వల విషయంలో తమకు దూరదృష్టి లేకపోవడం ఇప్పుడు చింతిస్తున్నాయి. ఆయుధ ఉత్పత్తిపై 18 నాటో దేశాల పెట్టుబడులు మొత్తం కలిపితే 600 బిలియన్ డాలర్లు కూడా దాటకపోవడం గురించి విచారిస్తున్నాయి. యూరప్‌లో నెలకొంటున్న ఉద్రిక్తతలను చూసి మెల్లిగా జాగ్రత్త పడుతున్నాయి. నాటో సభ్య దేశాలన్నీ ఈ ఏడు తమ స్థూల జాతీయ ఆదాయంలో కనీసం రెండు శాతం రక్షణ రంగానికి కేటాయించేందుకు కసరత్తు చేస్తున్నాయి. దీంతో ఆయుధ తయారీ దిగ్గజ కంపెనీలు గెంతులు వేస్తున్నాయి. మరీ ముఖ్యంగా లాక్‌హీడ్ మార్టిన్ కంపెనీ, నార్త్‌రోప్ గ్రుమ్మన్ కంపెనీలు ఉత్పాదక సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా అడుగులు వేస్తున్నాయి. అగ్రరాజ్యానికి ఆయువుపట్టులాంటి పెంటగాన్ గత ఏడాది 315 బిలియన్ డాలర్లు ఆయుధ సేకరణకు కేటాయించింది. ఇందులో సింహభాగాన్ని లాక్‌హీడ్ మార్టిన్ కంపెనీ తన్నుకుపోయింది. అమెరికా తయారీ ఎఫ్-15, ఎఫ్-16 జెట్ విమానాలు, రష్యా తయారీ ఎస్‌యు-30, ఎంఐప్లస్-29 యుద్ధ విమానాలే ఇప్పుడు పశ్చిమాసియా గగనతలంలో ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాయి. తళతళలాడే కలష్నికోవ్‌లు, మురిపించే ఎం-౦4 రైఫిళ్ల సంగతి చెప్పనక్కరలేదు.

మారణాయుధ ఉత్పత్తి రంగంలో టెక్నాలజీ సృష్టిస్తున్న విప్లవాత్మక మార్పులు కూడా యుద్ధ లక్షణాన్ని మార్చేస్తున్నాయని మర్చిపోరాదు. విచ్చలవిడి తూటాల వినియోగం వల్ల 'గన్ పౌడర్' లభ్యత ఊహించలేనంతగా తగ్గిపోయింది. దీంతో తూటాల ఖరీదు రోజు రోజుకూ పెరుగుతోంది. ఉక్రెయిన్ యుద్ధం కన్నా ముందు రష్యా ఏకే సిరీస్ తూటాలను ఎగుమతి చేసేది. యుద్ధం మొదలైన తర్వాత ఎగుమతులను బాగా తగ్గించింది. తమకే తూటాల కొరత ఏర్పడుతోందని చెపుతోంది. గన్ పౌడర్ మార్కెట్ ఎంతలా విస్తరించిందంటే, 2031లో చేరుకోవాల్సిన లక్ష్యాలను 2023లోనే చేరుకొని ప్రస్తుతం దూసుకుపోతోంది.

ఇంతా చెప్పి ఈ చిన్నమాట చెప్పకపోతే వెలితి అవుతుంది. యుద్ధంలో లాభాలు ఆర్జించింది పశ్చిమ దేశాలే కాదు, మన తెలుగుసీమకూ పిసరంత భాగస్వామ్యం ఉంది. కానీ, అది రెండో ప్రపంచ యుద్ధకాలం నాటి మాట. రెండో ప్రపంచ యుద్ధంలో పొగాకు కొరతను ఎదుర్కొన్నది రష్యా. 'చుట్టలేకపోతే.. తుపాకీ కాల్చను' అన్నరీతిలో ఎర్రసైన్యం అవస్థలు పడింది. అలాంటి సమయంలో కోస్తా ప్రాంతం నుంచి ఎగుమతి చేసిన నాణ్యమైన పొగాకు రష్యాను రక్షించింది. పొగాకు ఎగుమతి చేసిన కోస్తాప్రాంత మోతుబరి రైతులు ఆ తర్వాత కాలంలో అనేక రంగాల్లో అపారమైన సంపదను గడించారు. వారి వారసులు కాల క్రమంలో రాజకీయాల్లో భాగస్వామ్యం సంపాదించారు.

ప్రకృతి నుంచి విడివడిన పశ్చిమ దేశాల సమాజం సంపద కోసం యుద్ధ మైదానాలను నిర్మించింది. ఇప్పుడు వాటిని ఆధునీకరిస్తోంది.కానీ సంధి, ఒప్పందాలతో శాంతిని సాధించాలని భారత్ ప్రపంచ దేశాలకు పిలుపునిస్తోంది. దౌత్యాన్ని ఆయుధంగా మలచుకొమ్మని సూచిస్తోంది.



**ప్రశాంత్ జోషి**
సీనియర్ జర్నలిస్ట్




# పిడిమన్ను పూజ –

**నేనింత పిడికెడు మట్టే / కలమెత్తితే నాకు ఓ దేశపు / జెండాకున్నంత పొగరుంది.** (శేషేంద్ర)

**తమిళనాడులోని కొన్ని ప్రాంతాలలో మట్టిని పూజించే సాంప్రదాయం ఉంది. రాయలసీమలోని గండికోట ప్రాంతంలోనూ ఈ ఆచారం ఉంది. కారణాంతరాల వల్ల తమ నేల తల్లిని విడిచి వేరే ప్రాంతాలలో స్థిరపడటానికి వెళ్లినట్లయితే, తమతో పాటు, తమకు తమ కుటుంబాలకు అన్నేళ్లపాటు అన్నం పెట్టిన నేలతల్లితో ఉన్న అనుబంధాన్ని వీడలేక, తమతోపాటు తలో పిడికెడు మట్టిని మూటగట్టుకొని పట్టుకెళ్లి పూజిస్తుంటారు. దీనినే “పిడి మన్ను పూజ” అంటారు.**

కొసరాజు రాఘవయ్య “గండికోట యుద్ధం” గ్రంథంలో రాయలసీమ గొప్పతనం గురించి రాస్తూ “నెల మూడువానలు నిండుగా గురిసి / పాడిపంటలు గల్గి పాల్వారూచుండీ / రాజుల కన్గుట్టు రతనాల సీమ/ చేటల వజ్రాలు చెరిగెడి చోట్లు / గోనెల వరహాలు కూరెడి యూళ్లు / పెరికల ముత్యాలు పరగు సంతలును / అంటూ రాయలసీమ ఆనాటి వైభవాన్ని కళ్లకు కట్టారు. పాడిపంటలు, ఖనిజ సంపద, వజ్ర వైడూర్యాలు, ముత్యాలు విరివిగా దొరికేచోటు రాయలసీమ. కవి చెప్పినట్లు “రాజుల కన్గుట్టు రతనాల సీమ” నిజంగానే సుల్తానులకు కన్ను కుట్టింది. గండికోట ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా జమ్మలమడుగు సమీపంలో పెన్నానది ఒడ్డున ఎర్రమల పర్వతాల మధ్య ఉన్న చారిత్రక దుర్గం. క్రీ॥శ॥ 1123లో కాకతీయుల కాలంలో నిర్మితమైన ఈ కోట పెమ్మసాని నాయకుల ఆధ్వర్యంలో విజయనగర సామ్రాజ్యానికి వెన్నుదన్నుగా నిలిచింది. దీనికి దక్షిణ భారతదేశ చరిత్రలో చారిత్రక ప్రాధాన్యం ఉంది. పెన్నానది పారుతూ ఏర్పడిన గండివలన ఈ కోటకు గండికోట అనే పేరు వచ్చింది. దీనికే జలదుర్గం, వనదుర్గం, గిరిదుర్గం అనే పేర్లున్నాయి. రాయలకాలం నాటి శిల్ప సంపద ఈ దుర్గంలో ఉండటాన్ని బట్టి దీన్ని రెండవ హంపీ అని కూడా పిలుస్తారు. గండికోటలో గల అనేక దేవాలయాలు విదేశీయుల దండయాత్రల మూలంగా దెబ్బ తిన్నాయి.

కడప మండలంలోని నేటి బద్వేలు, జమ్మల మడుగు, ప్రొద్దుటూరు, కమలాపురం తాలూకాలు, అనంతపురం జిల్లాలోని తాడిపత్రి తాలూకా, కర్నూలులోని కోయిలకుంట్ల తాలూకాలను చేరిన ప్రాంతం గండికోట సీమ అని ఉజ్జాయింపు లెక్క, గండి అనే గ్రామానికి చేరువలో నిర్మితమైన కోట కాబట్టి దీనికి గండికోట అనే పేరు వచ్చింది. గండికోట సీమను పాలించిన వారు పెమ్మసాని వారేనని సింగనమల కైఫీయత్తులు, గరికపర్రు, తలమంచిపట్నం, తాడిపత్రి యెనమదలలో దొరికిన పెమ్మసాని వారి శాసనాలవలన తెలుస్తున్నది. వీరు కమ్మవారు.

హరిహర బుక్కరాయల కాలంనాటి బెల్లంకొండ దుర్గాధిపతి పెమ్మసాని తిమ్మానాయుడు పెమ్మసాని వారికి మూల పురుషుడుగా కొసరాజు నిర్ణయించారు. ఆనాటి గండికోట పాలకుడైన మిక్కిలినేని రామనాయని భార్య రంగమాంబ ఈ పెమ్మసాని తిమ్మానాయని సోదరి. తిమ్మానాయుని కొడుకు కుమార తిమ్మానాయుడు గండికోటకు ఇల్లరికపు టల్లుడుగా వచ్చాడు. పెమ్మసాని వారు గండికోట రాజ్యానికి మూల పురుషుడయ్యాడు. పెమ్మసాని అనే ఇంటిపేరు పెమ్మ సాహిణి అన్న ప్రసిద్ధ వ్యక్తి నుంచి ఏర్పడిందని కొసరాజు ధృవీకరించారు.

పెమ్మసాని పాలకులలో చిట్టచివరివాడైన చిన తిమ్మానాయుడే గండికోట యుద్ధం కావ్యంలో కథానాయకుడు. చిన తిమ్మానాయుడుకు మంత్రిగా చెన్నంరాజు చెన్నప్పరాజు వ్యవహరించాడు. చిన్న తిమ్మానాయుడు శాస్త్రాలతో పాటు శస్త్రాలలోనూ ప్రావీణ్యాన్ని సంతరించుకున్నవాడు. ఈయన బావ నరసింహనాయుడు, గోవిందాంబ చెల్లెలు, చిన్నయ్య కుమారుడు. గోలకొండ నవాబుల వజీరు మీర్‌జుమ్లా హయాంలో ఆడిన కపట నాటకం వల్ల గండికోట పతనం జరిగింది. ఆ తరువాత ఆర్కాటు నవాబు, 18వ శతాబ్దిలో కడప నవాబుల ముట్టడి, హైదరాలీ, తూర్పు ఇండియా కుంఫిణీ వారి ఏలుబడి గండికోట చరిత్రలోని ముఖ్య ఘట్టాలు. గండికోట పతనం తరువాత ఆయన కుమారులు పిన్నయ్య గండికోటను వదిలి బంధుబలగంతో సురక్షిత ప్రాంతాలైన దక్షిణాన ద్రావిడ క్షోణికి గంప సంసారాలతో కదలిపోయారు. కాబట్టి వీరిని గంపకమ్మ వారని పిలుస్తారు. చెంగల్పట్టు మండలంలోని కావేటి రాజపురంలో స్థిరపడగా, వీరి సంబంధీకులు చెట్టుకొకరు, పుట్ట కొకరుగా చెదిరిపోయారు. వారు కూడా తమిళ ప్రాంతంలోనే స్థిరపడ్డారు. కమ్మవారి వివాహాది శుభకార్యాల్లో పెమ్మసాని తిమ్మనాయని తాంబూలం అని ప్రథమ తాంబూలం తీసి దేవరింట పూజా వేదికపై ఉంచడం నేటికి ప్రసిద్ధం. మీర్‌జుమ్లాకు పొదిలి లింగన్న ఆంధ్రదేశముపై ఆశను పురి కొల్పాడు. “మహమ్మదీయ ప్రభూ! మాటలేమిటికి, మూడు పూటల తిండి ముట్టు నందరకు / కరువన్న మాట నిఘంటువులో లేదు / రాయలేలిన తెన్గు రాజ్యమందెల్ల / గండికోటయే దండి గుండెగా నుండు బనగాన పల్లెలో వజ్రాలు పండు / మునిమడ్గులో రత్న పుంగనులే మెండు పెమ్మసాని బోదుల పెట్టనికోట / పట్టిన మీ ఖ్యాతి బలితమై యుండు” అని బోధించాడు.

మీర్‌జుమ్లాకు ఆంధ్రుల ప్రతాపము తెలుసు కనుక “తెలుగు యోధులశక్తిని చులకనగా చూడకు తమలో తమకు ఎన్ని తగవులున్నా పర పెత్తనం భరింపలేరు. ఐకమత్యాన రొమ్ము ఆన్చి పోరాడుతారు, స్వేచ్ఛకై పడి చచ్చి జీవమొద్దెదరు, పులి జున్ను తేగలరు. పోరాట యోధులు కాబట్టి మాయలు చేసి మచ్చిక చేసుకొని వారిని ఓడించాలేకాని ఎకాఎకి యుద్ధంలో గెలుపు సాధ్యం కాదు” అని చెప్పాడు.

లింగన్న వారిని బాగా రెచ్చగొట్టాడు. తల్లి కోటలో రామరాయల శిరస్సును ఈటెతో గుచ్చి పైకెత్తిన నాడు ప్రబల హిందూసేన పరుగులు తీసింది, ధర్మంగా యుద్ధం చేస్తే ధాత్రి దక్కుతుందా? తంత్రంతో గెలవాలని ఉద్బోధించాడు.

మీర్‌జుమ్లా సైన్య సమేతుడై బయలుదేరి వెళ్లి నగార మోగించగా పక్క సంస్థానాలు పాలించు దొరలు తత్తరపడ్డారు. ప్రాణాలు గుప్పిటబట్టి చింతించారు. కంపించారు. వారిలో కొందరు గగ్గోలు పెట్టారు. తిమ్మానాయనికి మీర్‌జుమ్లా రాయబారము పంపాడు. బనగాన పల్లెలో మునిమడ్గులోని వజ్రాల గనులు మా వశము గావించమని లేకుంటే నీ మీద దండు పంపించుతాను సిద్ధం కమ్మని చీటీ పంపించాడు మీర్‌జుమ్లా.

చిన తిమ్మానాయుడు దర్బారు నిర్వహించాడు. మంత్రి చెన్నమరాజు మాట్లాడాడు. యుద్ధము వద్దని రాజుని వారించాడు. లింగన్న మేక వన్నెపులి, గోల్కొండకు రహస్యవార్తలు చేరవేస్తున్నాడన్న సంగతి

వినబడుతున్నది అని అన్నాడు. కానీ నరసింహసేనాని నడుము బిగించాడు. ముష్కరులను పట్టి ముక్కలు చేసి పెన్నానదికి బలిపెడతానని, లింగన్నలు వేయిమంది వచ్చినా గండికోటను ఏమీ చేయలేరని ప్రకటించాడు.

తిమ్మానాయుడు వెలమవీరులకు, రెడ్డి యోధులకు, బలిజ నాయకులకు యుద్ధంలో సహక రించాలని దూతల ద్వారా వర్తమానం పంపాడు. వారి రాకకై ఎదురు చూడక తిమ్మానాయుడు తల్లి ఆశీర్వాదము తీసుకుని యుద్ధానికి బయలుదేరాడు. ప్రత్యక్షముగా రాజే ప్రథమంగా నిలిచి మూకలో ధైర్యం కలిగించేలా యుద్ధం చేశాడు. చెన్నమరాజుకు వయస్సు మగ్గిన ధవళ పేటంచు తలగుడ్డ చుట్టి, జందెమ్ము నడుమునకు సంధించి చుట్టి ముసలి చెన్నరాజు ద్వారా రక్షణ కార్యభారము వహించాడు. అల్లంత దూరాన పొదిలి లింగన కంట పడగా, ఓరి రాజద్రోహి, మతద్రోహి, నీచుల మోచేతి నీళ్లు తాగి తగుదునమ్మా అని యుద్ధానికొచ్చావా? అంటూ


"గండికోట యుద్ధం"
(ద్విపద కావ్యం)

కవిరత్న
జానపద కవి సార్వభౌమ
కొసరాజు రాఘవయ్య చౌదరి

ప్రచురణ
కమ్మజన సేవాసమితి
సాహితీ ప్రచురణ విభాగం,
గుంటూరు

కమ్మజన సేవాసమితి కార్యాలయం
బృందావన్‌గార్డెన్స్ గుంటూరు-522 006

# గండికోట యుద్ధం

వెంటపడి, కత్తివాటుపిడితో కొట్టగా మన్నించమని కాళ్లమీదపడ్డాడు. క్షమించి వదిలేశాడు. మూడు మాసాలు పోరు సాగినప్పటికీ మీర్‌జుమ్లాకు గెలుపు రాలేదు. మీర్‌జుమ్లా "ఇంత కష్టమ్ము మాకింత నష్టమ్ము ఏ లడాయి నీ సంభవింపలేదు (పేజీ-176) అన్నాడు.

లింగన్న నరసింహ నాయుని శిబిరమునకు రహస్యముగా వచ్చాడు. మంతనాలు చేసి మీర్‌జుమ్లా దగ్గరకు తీసుకొనివెళ్లాడు. మీర్‌జుమ్లా నరసింహ నాయునికి స్వాగతమిచ్చి శ్లాఘించాడు, "మునిమద్దు వజ్రాలగని నాకిస్తే నిన్ను రాజును చేస్తాను" అన్నాడు. అంగీకరించాడు నరసింహనాయుడు, "గుట్టు మట్టులు దారి గుర్తులు దెల్పె" నాడు (పేజి.188). "నారసింహా ఎంత నటన జేసితివి" అన్నాడు తిమ్మా నాయుడు. గోవిందమాంబ వెంటనే రావయ్యా చిన్నన్న! గండికోటకునంత్యఘడియ లేతెంచెను. తిమ్మానాయుడు గోవిందమ్మను (చెల్లెలు) యుద్ధమునకు పోవలదని వారించాడు అయినా "మంత్రి చెన్నమరాజు" మా గురుస్వామి నేర్పిన రణవిద్య నిల్వ బెట్టెదను (పేజి.201) అని సమాధాన మిచ్చి గోవిందమాంబ యుద్ధమునకు వెళ్లింది. తన బావ నరసింహులుతో వాదులాడింది "ప్రాణాధికమ్ముగా పరిగణించుచున్న ముద్దుల బావ నా మోసగించెదవు గండికోట రణమ్ము కథ వ్రాయునపుడు నీ పాత్రకెంతెంత నీచత్వ మంది చిత్రించెదరో'' (పేజీ. 207, 208) అని నరసింహుని తిట్టింది. ఇంతలో "సాహెబ్ నబీ బాకుచే నాయని ప్రక్కలో క్రుమ్మెను" (పేజీ-214). అతడు మరణించగా గోవిందాంబ మూర్ఛిల్లెను. గోవిందమాంబ అబ్దుల్ నబీని వధించింది. కాని ఆమె కూడా మరణించింది. అంతఃపుర స్త్రీలు అగ్నిప్రవేశము చేశారు. తిమ్మానాయుని సైన్యం చాలా వరకు నశించింది. మీర్‌జుమ్లా గుత్తిదుర్గాన్ని ఇవ్వడానికి అంగీకరించాడు. గండికోటను ఖాళీ చేసి మీర్‌జుమ్లా కిస్తే, తిమ్మానాయుడు చెన్నమరాజుతో ఆలోచించాడు. "బంగారమును చేతబట్టిన నేమి మట్టి ముద్దగ మారుచున్నది" అన్నాడు చెన్నమరాజు, తిమ్మానాయుడు ఈ సంధికి అంగీకరించాడు. "గోతిలో దించాడు ఘాతకుడతడు'' అయినా తిమ్మానాయుడు మీర్‌జుమ్లా మాట విని కోట నుండి బయటకు వచ్చాడు. కోట బయటకు వచ్చాక తెలిసింది తాను మోసపోయినాని. మీర్‌జుమ్లా తిమ్మా నాయుడికి విష ప్రయోగం చేశాడు. తిమ్మానాయుడు తన కుమారుడు పిన్నయ్యను పిలిచి చెన్నమరాజుకు అప్పగించి మరణించాడు. కుతుబ్‌షాహి విజయమును పొందాడు. శేషించిన రాజ సంబంధులు గండికోట వదలి "పెరిగిన చోటును మరచిపోలేక / బయలు దేరిరి ఆంధ్రభక్తులు వెలికి / తమిళదేశానకు తరలిన వారు / మహిసూర్ ప్రాంతాలకు మసలినవారు / పడమటి పాలెముల్ పట్టినవారు / కావేటి రాట్పురి కాణాచి కాగ / వివిధ ప్రాంతాలలో తలదాచుకున్నారు.

ఈ విధంగా గండికోట పరాయి పాలకుల వశమైంది. వీరిలో కొందరు విశ్వనాథ నాయకుని ఆశ్రయం పొందారు. విశ్వనాథ నాయకుడు పెమ్మసాని వారిని "కురివికుళం" సంస్థానానికి, రావెళ్ల వారిని ''ఇళయరస నేందళ్'' సంస్థానానికి అధిపతులుగా నియమించాడు. నేటి తమిళనాడు లోని విరుద్‌నగర్, తిరునల్వేలి, తూత్తుకుడి, జిల్లాలలోని కొన్ని ప్రాంతాలను వారికి అప్పగించాడు. అలా వచ్చిన వారి వారసులను నేటికీ "గండి కోటవారు" అనే పేరుతోనే స్థానికులు వ్యవహ రిస్తున్నారు, వీరంతా పిడిమన్నుకు గుడికట్టి పూజిస్తున్నారు.

మీర్‌జుమ్లా కొడుకు అమీన్ జుమ్లా అతివాగుడు గాడు. ''తానె గొల్కొండ సుల్తాను నటంచు కారుకూతలు గూసి గల్లంతు నడిపాడుగ" ఆ విషయం డిల్లీ పాదుషా షాజహాన్ వరకు వెళ్లిపోయింది. దాంతో మీర్‌జుమ్లాకు ఢిల్లీ నుండి కబురు రాగా మీర్‌జుమ్లా షాజహాన్‌కు కోహినూర్ వజ్రం సమర్పించాడు. ఈ ఘట్టం గురించి కొసరాజు ఇలా రాశారు..

**తళతళ దీప్తుల తిలకించు దాని**
**కోహినూరు పేరున గుణనిధులెల్ల**
**"మిహిర బింబము వంటి కోహినూరు నరసి**
**ఆహాహా! యనియె షాజహానంతవాడు**
**మెచ్చుల గురిపించి మేలు మేలనుచు**
**అభయమ్ము నీయదే"** (పేజీ-378) ఆ విధంగా షాజహాన్ మీర్ జుమ్లాను, అతడి కుమారుని క్షమించి వదిలివేసాడు.


మూలం:

1. గండికోట యుద్ధం – కొసరాజు రాఘవయ్య
2. బండి కట్టురా! బండి కట్టురా! గండికోటకీ – డా॥ సగిలి సుధారాణి
3. ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్ర – ఎ.వి.కోటిరెడ్డి పేజీ-17, 21-23





**డా. కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు

ఎండలు ప్రకృతిలోని పర్యావరణంలో సహజంగా జరిగే రుతు ప్రభావమైనప్పటికీ గత కొన్ని సంవత్సరాలుగా విపరీతమైన ఎండలు, ఉష్ణోగ్రతలు నమోదవడం మనలనందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్న అంశం. వేసవి వస్తుందంటేనే మనమందరం భయపడే స్థితికి చేరుకున్నాం. ఈ పరిస్థితులు నెలకొనడానికి ఎన్నో కారణాలున్నా, ముఖ్యమైన కారణాలను మనం విశ్లేషిస్తే ప్రకృతి ప్రకోపం తో పాటు జరుగుతున్న మానవ తప్పిదాలు ముఖ్య కారణాలుగా అనిపించక మానవు. ఎందుకంటే ప్రకృతిపరంగా ఎండలు రావడం సహజమైనప్పటికీ అనేక విధాలుగా పెరుగుతున్న ఆధునికీకరణ కార్యకలాపాలను మానవాళి చేపట్టినందున, మండుతున్న పొయ్యిలో ఆజ్యం పోసినట్లుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మన మనుగడకు గొడ్డలి పెట్టులా మారుతున్నాయనడంలో సందేహం లేదు. మనలో ప్రతి ఒక్కరినీ బాధించే విపరీత వాతావరణ మార్పులెందుకొస్తున్నాయో తెలుసు. అందులో మన ప్రతి ఒక్కరి భాగస్వామ్యముందని తెలుసు. అయినా నిమ్మకు నీరెత్తినట్లుండి పర్యావరణ పరిరక్షణపై కొంత కినుక వహిస్తున్నాం. దానికి ఫలితాన్ని నానాటికి మరింతగా అనుభవిస్తున్నాం.

### ఆరోగ్యం, ఉత్పాదకత కుదేలు

ఎండాకాలంలో వేడిగాలులుండడం సహజ మైనప్పటికీ పెరుగుతున్న భాష్పసాంద్రతలు ఈ వేడిగాలులతో కలిసి శరీరానికి వేడివల్ల కలిగే పీడనాన్ని (heat stress)పెంచి మనిషిని త్వరగా నీరసింపచేస్తాయి. అలాగే గాలిలో తేమ ఉండవలసిన మోతాదు కంటే తక్కువగా ఉన్నా కూడ పొడి వాతావరణంలో వేడి ఎక్కువగా ఉంటే దానిని "తట్టుకోలేని వేడిమి" (non survival heat condition) అంటారు. ఇది కూడా చాలా అపాయకరమైన స్థితి. మన

# ఉష్ణ గోళమై మండుతున్న భూగోళం




పెరుగుతున్న ఎండలతో పట్టణాలపై పడుతున్న ప్రభావాలను గమనిస్తే పట్టణ ప్రాంతాలు విపరీతమైన జనాభాతో, కిక్కిరిసిన భవనాలతో, కాంక్రీటు రోడ్లతో, భూమిమీద, ఆకాశంలో ఇంధనాన్ని ఉపయోగించి చేస్తున్న అనేక కార్యకలాపాలతో, చెట్లు నరికి కడుతున్న భవన సముదాయాలతో పట్టణ ప్రదేశాలు ఉష్ణ ద్వీపాలుగా మారుతున్నాయి. ఫలితంగా పర్యావరణం ప్రభావితమౌతోంది. దీంతో అటు పైనుంచి సూర్యుని ద్వారా ప్రసరిస్తున్న ఉష్ణోగ్రతలు, ఇటు కిందినుంచి మనమందరం ఇంధనాలను మండించడం ద్వారా వెలువడుతున్న ఉష్ణోగ్రతలు ఒక నిర్దుష్ట పరిమాణాలలో పెరగక అనూహ్యంగా పెరగడం వలన ఎండలు కాకుండా మండుతున్నాయి. నిజానికి ఈ మంట పెట్టిందేవరు? మనమే. ఫలితమనుభవిస్తున్న దెవరు? అదీ మనమే!. ఇది వరకు ఎండాకాలమొస్తే చెట్లకింద గడిపేవారు. ఇప్పుడు చెట్లు ఉన్న ప్రాంతాలు అన్నీ కాంక్రీట్ బిల్డింగులుగా మారాయి. అందుకే మనం పచ్చదనం, చల్లదనం రెండూ కోల్పోయాము. అభివృద్ధి మంచిదే కానీ అతివృద్ధి మంచిది కాదన్నది నిరూపితమైంది. ఇదే ప్రథమంగా మనం తీవ్రంగా ఆలోచించాల్సిన సమస్య. తక్షణంగా, తీక్షణంగా ఆలోచించాల్సిన సమయం ఇదే.

### భూమట్టం స్థాయి ఓజోన్ (స్మోగ్)

మనలో చాలామందికి తెలియని విషయమేమిటంటే మనమెంతసేపూ ఓజోన్ ఆకాశంలో మాత్రమే ఉంటుందని అనుకుంటున్నాము. కానీ మనం చేస్తున్న విపరీత పట్టణ కార్యకలాపాలవల్ల గ్రౌండ్ లెవెల్ ఓజోన్ (స్మోగ్) భూమిమీద ఏర్పడి, వెరసి మనం ఓజోన్ దుష్ప్రభావంలో కూరుకుపోతున్నాం. ఫలితంగా ఎన్నో అనారోగ్య సమస్యలు.

### అడుగంటిన భూగర్భ జలాలు

ఎండాకాలమొస్తే బోర్ చప్పుడేకాని నీటి చుక్కలు రావు, కారణం విపరీత నీటి వినియోగం, భూగర్భాలు ఎడారులవటం. ఇదివరకు నగరంలోని చెరువులు, కుంటలు వేసవిలో కూడా కళకళలాడుతుండేవి, ఇప్పుడు ఏవో బీడుపడ్డ పొలాలుగా మారాయి. ఎందుకంటే వాటిలో పడ్డ వర్షపు నీరు, గొంతెండి పోయిన భూగర్భంలో చేరి సెటిలయ్యే లోపల మనం బోర్లతో లాగేస్తున్నాం(ఎక్కువ నీరు తాగడం కంటే కడగడానికి, పరిశ్రమలకే ఖర్చవుతోంది). జీతం పడ్డ మొదటి వారంలోనే డబ్బంతా ఖర్చు చేసినట్లు నీటిని విచక్షణారహితంగా వాడుకుంటున్నాం. అందుకే ఇది ఎండాకాలం కాదు, మనం ఎండగట్టిన కాలం, ఎండిపోయిన జీవనం. పొయ్యి మనమే వెలిగించుకుని దానిమీద పెనం పెట్టి ఆ పెనం మీద మనమే కూర్చున్న వైనం. ఇదివరకు భూగర్భజలాలు సమృద్ధిగా ఉన్నప్పుడు భూమి, పచ్చని చెట్లు వేసవి తాపాన్ని తగ్గించేవి. ఇప్పుడవెక్కడ?చెట్టును గొడ్డలి నరికేసింది, భూమిని సిమెంటు, కంకర మింగేసింది. ఫలితం వేసవితాపం వేడి ప్రతాపం.

పట్టణాలలో ఈ పరిస్థితులు కూడా ఎక్కువే. ముఖ్యంగా 65 సంవత్సరాలు దాటిన వృద్ధులు, శిశువులు దీనివల్ల చాలా బాధ పడుతు న్నారు. అలాగే పట్టణాలలో ఇదివరకు ఒక చదరపు కి.మీ.కు 10 మంది వృద్ధులుండేవారైతే ఇప్పుడు 50 నుండి 100 వరకు ఉన్నారని సర్వేలు చెపుతున్నాయి. ఎండలో, ఆరుబయట తిరిగే వారికీ, పనిచేసే వారికీ అనారోగ్యం, నీరసం వల్ల ఉత్పాదకత తగ్గిపోతుంది. కాబట్టి ఎండాకాలంలో పనిచేసేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.. ముఖ్యంగా వాణిజ్యసంస్థలు, పరిశ్రమల యాజమాన్యాలు వీరికి తగు వసతులు కల్పించి వీరిని ఆదుకోవాలి.

### వేడి రాత్రులు-కాళ రాత్రులు

ఎండాకాలంలో ప్రజలు అత్యంత వేడి రాత్రులు చవి చూస్తుంటారు. ముఖ్యంగా రద్దీగా ఉండే పట్టణాలు, వాటి చుట్టుప్రక్కల ఉన్న గ్రామప్రాంతాలు ఈ సమస్యను ఎక్కువగా ఎదుర్కొంటాయి. దీనికి కారణం కాలుష్యం. అలాగే ఎండవేడిమి వల్ల

కాంక్రీట్ వేడెక్కడం, వేడి-సిమెంట్ పొరలలోకి పగలు చేరి, రాత్రుళ్లు అది పరిసరాలలోకి విడుదల అయ్యి రాత్రుళ్లు వేడెక్కుతున్నాయి. కాంక్రీట్ జంగల్ మనమే సృష్టించి పెరుగుతున్న ఉష్ణోగ్రతల గురించి మనమే దుఃఖించడంలో అర్థమే లేదు.

**పట్టణాలు విస్తీర్ణం సద్వినియోగం**

ఒక 100 చదరపు కి.మీ.ల విస్తీర్ణంలో ఉండాల్సిన ఇళ్లు 10 చదరపు కి. మీ.లలో కడితే ఇలాగే ఉంటుంది. పట్టణ ప్రణాళిక విభాగాలు ఈ విషయం గమనించాలి. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకే కంచంలో నలుగురు అన్నం తినడానికి కొట్టుకున్నట్లు ఒక చిన్న ప్రాంతంలో అనేక భవనాలు కట్టి వనరులకోసం కొట్టుకుంటున్నాం. పట్టణ ప్రణాళికా విభాగం వారు మితంగా, జనాభాకు అత్యవసరమైన కార్యకలాపాలకు నిర్దేశిత ప్రాంతాల్లో మాత్రమే అనుమతులు ఇస్తే పట్టణంలో లంగ్ స్పేస్ – పర్యావరణ పచ్చదనం పెరుగుతుంది. “రోడ్డుకిరువైపులా వాణిజ్య భవంతులు తక్కువ ఉంటే ట్రాఫిక్ సమస్యలు, భూ ఉష్ణోగ్రతలు పెరిగి ప్రజలు నిప్పులకుంపటిలో జీవించే బాధ తప్పుతుంది. పట్టణాలను ఇలా ప్రణాళికాబద్ధంగా విస్తృతం చేస్తే కాలుష్యం తగ్గుతుంది. పట్టణంలో ఇప్పుడున్న భవంతులను అదే సంఖ్యలో దూరదూర ప్రాంతాల్లో కడితే ప్రక్కనున్న గ్రామాలూ బాగుపడతాయి. అలాగే ఒకే ప్రాంతంలో కాలుష్యం పెరగదు. దీనికి తోడు కొందరు చెరువులు, కుంటలు కబ్జాచేసి భవనాలు కడుతున్నారు. కాలనీలలో తారు రోడ్లను తొలగించి కాంక్రీట్ రోడ్లు వేస్తున్నారు. తద్వారా వర్షపు నీరు భూమిలోకి ఇంకడానికి స్థలం లేకుండా చేస్తున్నారు. దీనివల్ల ఎండాకాలంలో భూమి వేడెక్కక ఏంచేస్తుంది? ఇది ఎవరినీ విమర్శించడం కానే కాదు, కేవలం సకారాత్మక ఆవేదనతో సూచనలు చేయడమే. ఇదంతా చూస్తుంటే ఒకప్పుడు మనం జాలిపడిన వన్యప్రాణుల జంతుప్రదర్శనశాలే బాగుందనిపిస్తోంది. కనీసం అక్కడైనా జంతువులకు సౌకర్యవంతమైన ఆవాసం, పచ్చదనం, సంరక్షణ ఇంకా కొనసాగుతోంది.




**విద్యుత్ సరఫరాతో ఊరట**

ఇంతటి విపరీతమైన పరిస్థితులలో కొంత సాంత్వన ఏమిటంటే ఒకవైపు విపరీతమైన పట్టణీకరణను ప్రోత్సహిస్తూనే, మరోవైపు గత దశాబ్ద కాలంగా ప్రభుత్వాలు చేసిన ఒక మంచి పనేమిటంటే విద్యుత్ సరఫరాను నిరంతరాయంగా చేస్తున్నారు. దీనివల్ల ఫ్యాన్లు, ఏసీల ద్వారా కొంత ఉపశమనం లభిస్తోంది. దీనికి ప్రభుత్వాన్ని పూర్తిగా అభినందించాలి. లేకపోతే మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్టు అయ్యేది, ప్రజలకు చాలా ఇబ్బంది అయ్యేది.

**పట్టణాల్లో జనసాంద్రత తగ్గాలి**

పట్టణాలు ఉన్నది మనం పట్టుకొని వేళ్లాడడానికి కాదు అన్నది ప్రతి ఒక్కరు ఆలోచించాలి: పట్టణాలు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. ఇక్కడ పనిచేసేవారందరూ దేశ ఆర్థిక ప్రగతిలో భాగస్వాములే. అంటే పనిచేసే సమర్థత ఉన్న ఉద్యోగ, వ్యాపారస్థులకు ఇక్కడ ఉండడంలో అర్థముంది. అంతేకానీ రిటైర్ అయిన ప్రతి ఒక్కరూ కూడా ఇక్కడే స్థిరపడి పట్టణ ప్రాంతంలో ఉండే ప్రాకృతిక వనరులమీద ఒత్తిడి పెంచుతున్నారు. తద్వారా జనసాంద్రత పెరిగి పట్టణాలు రద్దీగా ఉంటున్నాయి. నిజానికి రిటైర్ అయి ఏ పనిలేనివాళ్లు గ్రామాలకు వెళ్లి ప్రశాంతమైన జీవితం గడపొచ్చు. దీనివల్ల వారికే మంచిది. ప్రభుత్వాలు ఈ దిశలో వయోవృద్ధులకు గ్రామాలలో ముఖ్యంగా వైద్య సౌకర్యాలు కల్పిస్తే పట్టణ పరిస్థితి కొంతవరకు చక్కబడవచ్చు.

**వృక్షో రక్షతి రక్షితః**

ఈ నానుడిని ఎప్పుడో మరిచిపోయాం. వృక్షాలను రక్షిస్తే అవి మనలను రక్షిస్తాయని మన పెద్దలు ఎప్పుడో చెప్పారు. అయితే మనమేంచేస్తున్నాం! పట్టణీకరణలో భాగంగా వాటిని తొలగించి వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాం. ఇది వరకు రోడ్ల కిరువైపులా ఉన్న చెట్లు ఇప్పుడు ఒక్కొక్కటీ పలుకారణాల వల్ల కనుమరుగవుతున్నాయి. పాతవి పోతున్నాయి, కొత్తవి రావట్లేదు. ఏవో కొన్ని డిఫెన్స్ ఏరియాలు, ఐడీపిఎల్, బీహెచ్ఈఎల్ లాంటి పెద్ద సంస్థల పరిసరాల్లో తప్ప వనాలు, ఉపవనాలు కనుమరుగై ఎండలు మండడానికి ప్రస్తుత ఆధునిక పోకడలు కారణమయ్యాయి. పూర్వం అరణ్యంలో నగరాలుంటే ఇప్పుడు నగరాలలో చిన్న వనాలు మాత్రమే ఉన్నాయి. అవికూడా లుప్తమయితే ప్రజల ఆరోగ్యం పూర్తిగా అధోగతి పాలే.

WALTA అనే చట్టం ఇప్పుడుందో లేదో తెలియట్లేదు. అందుకే ఎండలు సమస్త జీవ జంతు జాలాన్నీ అతలాకుతలం చేస్తున్నాయి. ఇలా విశ్లేషించుకుంటూ పోతే ఎండల ప్రభావం వల్ల ఉత్పన్నమయ్యే దుష్పరిణామాలెన్నిటినో గుర్తించవచ్చు. ఎండలను నివారించలేం కానీ వాటికి మన విచ్చలవిడి ఆధునికీకరణ కార్యకలాపాలను జోడించి మన జీవితాలను దుర్భరం చేసుకోకపోతే చాలు. మానవాళికి కావలసింది అభివృద్ధి మాత్రమే కాదు, పర్యావరణహితమైన అభివృద్ధి కావాలి. అప్పుడే మనం సౌకర్యవంతంగా జీవించగలుగుతాము అన్నది అక్షర సత్యం. దీన్నే పర్యావరణం పట్ల మన బాధ్యత (ఎకలోజికల్ రెస్పాన్సిబిలిటీ) అంటారు. ఈ దిశలో మనం 2026 ప్రపంచ పర్యావరణ దినోత్సవపు ముఖ్య ఉద్దేశాన్ని, సందేశాన్ని మననం చేసుకోవాలి, ఆచరించాలి. అదేమిటంటే వాతావరణంలో వస్తున్న విపరీతమైన మార్పులను గమనించి, మనం భవిష్యత్తులో సుఖంగా జీవించడానికి కావలసిన జీవన విధాన మార్పులను త్వరితగతిన ఆచరణలో పెట్టాలి. లేకపోతే వినాశకాలం (డూమ్స్ డే) త్వరలోనే మనమందరం చూసే అవకాశముంది. ఇదే విషయాన్ని వియన్నాకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త హేంజ్ వాన్ ఫోర్స్టర్ కూడా హెచ్చరిస్తున్నారు.

“సర్వేజనాః సుఖినోభవంతు” ★

వృక్షాలను రక్షిస్తే అవి మనలను రక్షిస్తాయని మన పెద్దలు ఎప్పుడో చెప్పారు. అయితే మనమేంచేస్తున్నాం! పట్టణీకరణలో భాగంగా వాటిని తొలగించి వాతా వరణాన్ని వేడెక్కిస్తున్నాం. ఇది వరకు రోడ్ల కిరువైపులా ఉన్న చెట్లు ఇప్పుడు ఒక్కొక్కటీ పలుకారణాల వల్ల కనుమరుగవుతున్నాయి. పాతవి పోతున్నాయి, కొత్తవి రావట్లేదు. ఏవో కొన్ని డిఫెన్స్ ఏరియాలు, ఐడీపిఎల్, బీహెచ్ఈఎల్ లాంటి పెద్ద సంస్థల పరిసరాల్లో తప్ప వనాలు, ఉపవనాలు కనుమరుగై ఎండలు మండ డానికి ప్రస్తుత ఆధునికపోకడలు కారణ మయ్యాయి.



# సమస్యలు, సవాళ్లతో

**బిహార్ కొత్త ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధురికి అడుగడుగునా సమస్యలు, సవాళ్లే. మరి కొద్ది కాలం పాటు ఆయనకు ఈ అవస్థలు తప్పకపోవచ్చు. ఇటీవలి వరకూ నితీశ్ కుమార్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన సమ్రాట్ చౌధురి (రాకేశ్ కుమార్) ఈ పదవిలో నిలదొక్కుకోవడం, నితీశ్ కుమార్ ప్రభావం నుంచి బయటకు తీసుకు వచ్చి బీజేపీ భావజాలానికి అనుగుణంగా ప్రభుత్వాన్ని నిర్వహించడం కత్తి మీద సామే. సుమారు 46 ఏళ్లుగా బిహార్‌లో అధికారానికి దూరంగా ఉన్న బీజేపీకి ఈ రాష్ట్రం మీద పట్టు సాధించడం ఆషామాషీ వ్యవహారం కాదు. 1980లో తొలిసారిగా ఇక్కడ అధికారం చేపట్టిన బీజేపీ ఆ తర్వాత నుంచి తనకు తానుగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయింది. సుమారు 46 ఏళ్ల తర్వాత 57 ఏళ్ల సమ్రాట్ చౌధురి మొదటిసారిగా బీజేపీ తరపున ముఖ్యమంత్రిగా పదవిని చేపట్టారు.**

తమ పార్టీకి చెందిన వ్యక్తే ముఖ్యమంత్రి కావడం బీజేపీ కార్యకర్తలను, నాయకులను ఆనందోత్సాహాల్లో ముంచెత్తింది. "ఈ బడే భాయ్, ఛోటే భాయ్ సంబంధంలో చివరికి బడే భాయ్ పూర్తి స్థాయిలో అందలం ఎక్కడం జరిగింది" అని పార్టీ మద్దతుదార్లు పాట్నాలోని పార్టీ ప్రధాన కేంద్రంలో వ్యాఖ్యానించడం వినిపించింది. ఇంతవరకూ నితీశ్ కుమార్ నాయకత్వంలోని జనతాదళ్ (యు) పార్టీ ప్రభుత్వానికి కొమ్ము కాయాల్సి రావడం మీద వారు ఈ విధంగా అసంతృప్తిని, అసహనాన్ని, అసమ్మతిని వెళ్లగక్కినట్టు కనిపిస్తోంది. ఇదివరకటి ప్రభుత్వం మీద విమర్శలు, వ్యాఖ్యానాలు చేయడంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆచితూచి వ్యవహరించ దలచుకున్నట్టు కనిపిస్తోంది.

**బీజేపీకి కొత్త శక్తి**

బిహార్ రాష్ట్రంలో బీజేపీ తమ సొంత ముఖ్య మంత్రిని నియమించుకోవడమంటే ఆ పార్టీ ఒక పెద్ద మలుపు తిరిగినట్టే భావించాలి. రాష్ట్రంలో నాయకత్వ మార్పు చోటు చేసుకుంటుందనే వార్త బయటకు వచ్చిన దగ్గర నుంచి సమ్రాట్ చౌధురి పేరు వినిపించడం ప్రారంభించింది. కులపరంగా, అనుభవపరంగా, దక్షత పరంగా ఆయనకే ఎక్కువగా మద్దతు లభించడం, రాజకీయ చర్చల్లో ఎక్కువగా ఆయన ప్రస్తావనే రావడం మొదలైంది. రాజ్యసభకు వెళ్లడానికి నితీశ్ కుమార్ సిద్ధపడిన మరుక్షణం బీజేపీ ఈ అవకాశాన్ని చేజిక్కించుకోవాలని నిర్ణయించుకుంది. తమ పార్టీ వ్యక్తిని ముఖ్యమంత్రి పదవిలో కూర్చోబెట్టాలనే నిశ్చితాభిప్రాయానికి వచ్చింది. పాలనానుభవం పుష్కలంగా ఉండడంతో పాటు, కులపరంగా కూడా రాష్ట్రంలో పట్టు, పలుకుబడి కలిగిన ఈ కోయిరీ కుష్వాహా నాయకుడి వైపు బీజేపీ నాయకత్వం ఎక్కువగా మొగ్గు చూపింది.



రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పదవిని చేపట్టి నప్పటి నుంచి ఆయన వ్యవహారశైలి పూర్తిగా మారి పోయింది. ఇదివరకటి సాత్వికత స్థానంలో దూకుడు పెరిగింది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ వంటి నాయకుల తరహాలో ఆయన సత్వర ఫలితాల కోసం ప్రయత్నించడం స్పష్టంగా కనిపించింది. సమ్రాట్ చౌధురి పేరు ప్రస్తావనకు వచ్చినప్పుడు నితీశ్ కుమార్ కూడా దీనికి అభ్యంతర మేమీ చెప్పలేదు. ఎన్.డి.ఏ కూటమిలోని మిగిలిన భాగస్వామ్య పక్షాలకు కూడా ఈ పేరు విషయంలో అభ్యంతరమేమీ కనిపించలేదు. సుస్థిర ప్రభుత్వం, సంకీర్ణ కూటమి నిర్వహణ, ప్రజారంజక పాలన వంటి విషయాల్లో అవి సమ్రాట్ చౌధురికి పూర్తి మద్దతు ప్రకటించాయి.

**అభివృద్ధే పెద్ద సవాలు**

దేశంలోనే అత్యంత పేద రాష్ట్రమైన బిహార్‌ను సంపన్న రాష్ట్రంగా మార్చడం అంత తేలికైన వ్యవహారం కాదు. ఇది దేశంలోనే రెండవ అతి పెద్ద రాష్ట్రం. సుమారు 13.07 కోట్ల జనాభా కలిగిన ఈ రాష్ట్రం ప్రాథమిక సదుపాయాల కల్పనలో కూడా బాగా వెనుకబడి ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉంది. గత ఏడాది నవంబర్ నెలలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో నితీశ్ కుమార్ ప్రభుత్వం ప్రకటించిన అనేక వాగ్దానాలను నెరవేర్చడానికి నిధులు లభ్యం కాని పరిస్థితిలో రాష్ట్రం ఉంది. ఇక కులపరంగా రాష్ట్రం చీలికలు పేలికలయి ఉంది. నేరాలు, అవినీతి బాగా పెరిగిపోయాయి. శాంతి భద్రతలు అడుగంటిపోయాయి. పారిశ్రామికీకరణ స్తంభించిపోయింది. వ్యవసాయ రంగంలో ఎక్కడా పురోగతి కనిపించడం లేదు. సుమారు 94 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన రాష్ట్రంలో పట్టణాల విస్తీర్ణం 1096 చదరపు కిలోమీటర్లు మాత్రమే. అయినప్పటికీ ఈ రాష్ట్రం పట్టణీకరణకు నోచుకోలేదు. ఇటువంటి రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం, రాష్ట్ర జీడీపీని పెంచడం సమ్రాట్ చౌధురికి పెద్ద సవాలుగా పరిణమించనుంది.

**సమస్యలతో ఉక్కిరిబిక్కిరి**

బీజేపీ నాయకత్వంలోని ఎన్.డి.ఏ కూటమిలో ఉన్న జనతాదళ్(యు), లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్ పాశ్వాన్), హిందుస్థానీ అవామ్ మోర్చా (సెక్యులర్), రాష్ట్రీయ లోక్ మోర్చా వంటి పార్టీలను ఒప్పిస్తూ, మెప్పిస్తూ పురోగమించడం కూడా చిన్న విషయమేమీ కాదు. సుమారు ఇరవయ్యేళ్లపాటు నితీశ్ కుమార్‌ను అధికారంలో నిలబెట్టిన ఈబీసీలు, ఓబీసీలు, యాదవేతరులు, మహాదళితులతో కూడిన ఓటు బ్యాంకును ఛిన్నాభిన్నం కాకుండా కాపాడు

> గత ఏడాది నవంబర్ నెలలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో నితీశ్ కుమార్ ప్రభుత్వం ప్రకటించిన అనేక వాగ్దానాలను నెరవేర్చడానికి నిధులు లభ్యం కాని పరిస్థితిలో రాష్ట్రం ఉంది. ఇక కులపరంగా రాష్ట్రం చీలికలు వాలికలయి ఉంది. నేరాలు, అవినీతి బాగా పెరిగిపోయాయి. శాంతి భద్రతలు అడుగంటిపోయాయి. పారిశ్రామికీకరణ స్తంభించిపోయింది. వ్యవసాయ రంగంలో ఎక్కడా పురోగతి కనిపించడం లేదు.

# సమ్రాట్ ఎదురీత!



కోవడం మీద కూడా సమ్రాట్ సామర్థ్యం ఆధారపడి ఉంటుంది. రాష్ట్ర ప్రజలు కూడా ప్రతి విషయంలోనూ సమ్రాట్‌ను నితీశ్‌కుమార్‌తో పోల్చి చూసుకునే అవకాశం ఉంది. నితీశ్‌కుమార్ అనుసరించిన లౌకికవాదానికి, సమ్రాట్ అనుసరించబోయే లౌకికవాదానికి ఏ మాత్రం తేడా ఉన్నా జనతాదళ్ (యు) అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశం ఉంది.

కొంత కాలం పాటు రాష్ట్రీయ జనతాదళ్, ఆ తర్వాత జనతాదళ్(యు) పార్టీలలో ఉండి నాలుగేళ్ల క్రితమే బీజేపీలోకి వచ్చిన సమ్రాట్ తమ సొంత పార్టీ నేతలతో కూడా సర్దుకుపోవాల్సి ఉంటుంది. ఇక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పరమ అధ్వాన్న స్థితిలో ఉంది. అభివృద్ధి కార్యక్రమాల కంటే, సంపద వృద్ధి ప్రయత్నాలకంటే సంక్షేమ పథకాలు, ఉచిత పథకాలు ఎక్కువగా ఉండడంతో రాష్ట్ర ఖజానా పూర్తిగా ఖాళీ అయిపోయింది. రాష్ట్రంలోని మహిళలందరికీ నెలకు రూ.10,000 చొప్పున వారి బ్యాంక్ ఖాతాల్లో వేయడం వల్ల రాష్ట్ర ఖజానా మీద అదనంగా రూ. 30,000 కోట్ల భారం పడుతోంది.

మొత్తం మీద బిహార్ ప్రభుత్వం గత నాలుగైదేళ్లలో నాలుగు లక్షల కోట్ల రూపాయల అప్పు చేసింది. ప్రభుత్వం ఏటా రూ.23,000 కోట్లను కేవలం వడ్డీలకు చెల్లిస్తోంది. రాష్ట్ర తలసరి ఆదాయం దేశంలోనే అట్టడుగు స్థితిలో ఉంది. రాష్ట్రం రెండంకెల వృద్ధి రేటునైనా చూపించ గలుగుతుందా అన్న సందేహం కలుగుతోంది.

**రాష్ట్ర ఖజానా ఖాళీ**

"రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే స్థితిలో ఉంది. అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి ఏమాత్రం అవకాశం కనిపించడంలేదు. ఆర్థిక వనరులన్నీ అడుగంటిపోయాయి. అప్పులను వాయిదా వేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కాలం గడుపుతోంది. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం అవుతున్నందు వల్ల కొద్దిగా వెసులుబాటు లభిస్తోంది. కానీ, రాష్ట్ర భవిష్యత్తును తలచుకుంటే భయం వేస్తోంది" అని ఆర్థిక మంత్రిత్వ శాఖ గగ్గోలు పెడుతోంది. కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల నిర్మాణం, విద్యుత్ సరఫరా, పాఠశాలల నిర్వహణ, తాగునీటి సరఫరా వ్యవస్థలను నిర్వహించ గలుగుతోంది. ఇది ఎంత కాలం సాగుతుందన్నది అర్థం కాని విషయం. సమ్రాట్ చౌధురి సమర్థ వంతమైన నాయకుడని, కార్యదక్షుడని పేరుంది. అపారమైన పాలనాను భవం ఉంది. కేంద్ర ప్రభుత్వ అండదండలు కూడా ఉన్నందువల్ల సమ్రాట్ కొంత వరకైనా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

మొత్తం 243 స్థానాల శాసనసభలో 200 పైగా స్థానాల బలం ఉన్నందువల్ల సమ్రాట్ తన పథకాలు, కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లగలుగుతారని అనిపిస్తోంది. ప్రజా సంక్షేమానికే మొదటి ప్రాధాన్యం ఇస్తానని, ప్రజాసేవే తనకు ముఖ్యమని ఎన్నికల్లో ప్రచారం చేసి గెలిచిన సమ్రాట్ ఇప్పుడు ఈ అంశాలకు పూర్తిగా కట్టుబడి ఉండాల్సి ఉంటుంది.

తనను తాను నిరూపించుకోవడానికి కనీసం వంద రోజులైనా అవసరమవుతాయని సమ్రాట్ భావి స్తుండగా, ప్రజలు మాత్రం ప్రమాణ స్వీకారం చేసిన మొదటి రోజు నుంచే ఆయన వ్యవహార శైలిని గమనించడం ప్రారంభించారు. రాజకీయ కుటుంబా నికి చెందిన సమ్రాట్ చౌధురి సుమారు మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ఆయన తండ్రి శకుని చౌధురి గతంలో మంత్రిగా పని చేశారు.

గత కొన్నేళ్లుగా బిహార్ అవినీతిలోనూ, నేరా ల్లోనూ దేశంలోనే మొదటి స్థానంలో ఉంటూ వస్తోంది. మాఫియా రాజ్యమేలుతోంది. దీనివల్ల పెట్టుబడిదారుల్లో నమ్మకం సడలి, రాష్ట్రం వైపు కన్నెత్తి చూడడం లేదు. ఈ పరిస్థితి ప్రజల్లో కూడా అసంతృప్తిని, అశాంతిని పెంచుతోంది. ఈ పరిస్థితిని సమ్రాట్ ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా చక్కదిద్దని పక్షంలో రాష్ట్రంలో బీజేపీ పరిస్థితి తారుమారయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలో అవినీతిని, నేరాలను నిరోధించగలిగిన పక్షంలో ఇతర సమస్యలన్నీ చాలావరకు వాటంతటవే పరిష్కారమవుతాయని, సమ్రాట్ వీటిపై ముందుగా దృష్టి పెట్టగలిగితే ప్రజల్లో కూడా ఆయన ప్రభుత్వం పట్ల నమ్మకం పెరుగు తుందని పార్టీ నేతలు కూడా అభిప్రాయ పడుతున్నారు.



**జి.రాజశుక**
**సీనియర్ జర్నలిస్ట్**



# కశ్మీర్ లోయ నుండి 'ప్రచారక్‌లు', 'వానప్ర




**దాదాపు ఒక శతాబ్ద కాలంగా, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్-ఆర్ఎస్ఎస్ సంస్థాగత బలం దాని పూర్తికాల కార్యకర్తలైన ప్రచారక్‌ల నిశ్శబ్ద, నిరంతర నిబద్ధతపై ఆధారపడి ఉంది. వారి నిరాడంబర జీవితాలు, సంపూర్ణ అంకిత భావం దేశవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ విస్తరణకు రూపునిచ్చాయి. ఈ నిబద్ధత కశ్మీర్ లోయ తరహాలో మరెక్కడా అంత తీవ్రంగా పరీక్షకు గురికాలేదు. అక్కడ ప్రచారక్‌లు, విస్తారక్‌లు రాజకీయ అస్థిరతలు, సామాజిక ప్రతిఘటన, నిషేధాలు, జైలు శిక్షలు, హింసాత్మక కాలాలను ఎదుర్కొని సంస్థాగత జ్యోతిని సజీవంగా ఉంచడానికి కృషి చేశారు. గత వంద సంవత్సరాల ఆర్ఎస్ఎస్ చరిత్ర, కృషి, పోరాటం, పురోగతి, ప్రభావాన్ని విశ్లేషిస్తే, సంస్థలో పూర్తిసమయ కార్యకర్తల పాత్ర ప్రాముఖ్యత వెల్లడవుతుంది. సంస్థలోని పూర్తిసమయ కార్యకర్తలను సాధారణంగా 'ప్రచారక్' అని పిలుస్తారు.**

ఆర్ఎస్ఎస్‌కు ఈ విధానం ఆర్ఎస్ఎస్ ఏర్పడినంత పురాతనమైనది. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులైన డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ స్వయంగా జీవితాంతం ప్రచారక్‌గా ఉన్నారు. ఇది గత వేల సంవత్సరాలుగా సనాతన ధర్మంలో ప్రబలంగా ఉన్న 'సన్యాసాశ్రమం' ను పోలి ఉంటుంది. ఆర్ఎస్ఎస్ తన సంస్థాగత పునాదిని, నిర్మాణాన్ని విస్తరించుకోవడానికి కొన్ని ఆమోదయోగ్యమైన మార్పులు చేస్తూ, ప్రచారకత్వం అనే విధానం ద్వారా అదే సంప్రదాయాన్ని స్వీకరించింది. సాదాసీదా జీవనం, కఠోర నియమాలు, అప్పగించిన పనిపై నిరంతరం దృష్టి పెట్టడంపై ఆధారపడిన ఈ ప్రయోగంలో అది అపారమైన విజయాన్ని సాధించింది.

1940 దశాబ్దం మధ్యలో జగదీష్ అబ్రోల్, బల్‌రాజ్ మాధోక్, కేదార్‌నాథ్ సాహ్నిలతో కూడిన ప్రచారక్‌ల బృందం కశ్మీర్ లోయలో ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలను ప్రారంభించింది. కాలక్రమేణా 1940వ సం॥ చివరి నాటికి కశ్మీర్ లోయ నుండి యువ, విద్యావంతులైన, అంకితభావం గల స్వయంసేవకులు ప్రచారక్‌లుగా ఉద్భవించారు. వారిలో ఓంకార్ నాథ్ కక్, మఖన్ లాల్ హర్కారా (బమా) ఉన్నారు.

1950-51లో ప్రజాపరిషత్ ఉద్యమం ప్రారంభం కావడంతో, కశ్మీర్ లోయ నుండి ఒక స్వయంసేవకుల బృందం పూర్తికాల ప్రచారక్‌లుగా ఉద్భవించి, ఉద్యమాన్ని క్షేత్రస్థాయికి తీసుకువెళ్లడానికి జమ్మూ, కశ్మీర్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు నియమితులయ్యారు. కశ్మీర్ లోయకు చెందిన ఈ అంకితభావం గల ప్రచారక్‌ల బృందంలో అవతార్ క్రిషన్ కావ్, నిరంజన్ నాథ్ కౌల్, జంకినాథ్ ధోబీ, దేవకినందన్ నఖాసీ, బ్రిజ్‌నాథ్ మియాన్, సోమనాథ్ ఓగ్రా, ప్రాణనాథ్ మియాన్ వంటి ప్రముఖులు ఉన్నారు. వీరందరూ శ్రీనగర్ నగరానికి చెందినవారు. వారు ప్రజా పరిషత్ ఉద్యమం మొత్తం కాలం పాటు ప్రచారక్‌లుగా కొనసాగారు. వారిలో చాలా మందిని జమ్మూ, కాశ్మీర్‌లోని అప్పటి షేక్ అబ్దుల్లా ప్రభుత్వం అవాంఛనీయ వ్యక్తులుగా ప్రకటించింది. వారు ఆశయ సాధన కోసం ప్రగాఢమైన అంకితభావంతో, నిబద్ధతతో అవిశ్రాంతంగా పనిచేశారు. 1953లో ఆ ఉద్యమం ముగిసినప్పుడు మాత్రమే తమ ఇళ్లకు తిరిగి వచ్చారు.

1970వ దశకం ప్రారంభంలో, శ్రీనగర్‌కు చెందిన డిప్లొమా సివిల్ ఇంజనీర్ ఇందర్ క్రిషన్ జుత్షి మూడు సంవత్సరాల పాటు ప్రచారక్‌గా పనిచేశారు. ఆయన మూడవ సంవత్సరం ఓటీసీ (సంఘ శిక్షా వర్గ) శిక్షణ పొందిన స్వయంసేవక్ కూడా. ఆయన తర్వాత బారాముల్లాకు చెందిన డాక్టర్ రోషన్ లాల్ బాలి ప్రచారక్‌గా ఎదిగి, చాలా కాలం పాటు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రానికి సేవలందించారు. ఆ సమయంలో ఆయన తహసీల్ ప్రచారక్‌గా, జిల్లా ప్రచారక్‌గా, విభాగ ప్రచారక్‌గా కూడా పనిచేశారు. ఆయన ఒక హోమియోపతి వైద్యుడు. తరువాతి కాలంలో హిమాచల్‌ప్రదేశ్‌లో స్థిరపడ్డారు.

శ్రీనగర్‌లోని రైనావారికి చెందిన ఉపేందర్ భట్ 1975లో భదేర్వాలో తహసీల్ ప్రచారక్‌గా చేరారు.

భారత ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని ప్రకటించి, ఆ తర్వాత ఆర్ఎస్ఎస్‌ను నిషేధించిన రాత్రి, జమ్మూలోని వీర్ భవన్-రఘునాథ్‌పురాలో ఉన్న ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం నుండి పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అత్యవసర పరిస్థితి కొనసాగిన చాలా కాలం పాటు ఆయన జైలులోనే ఉన్నారు. మార్చి, 1977లో ఇందిరాగాంధీ ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలలో ఓడిపోయిన తరువాత, అత్యవసర పరిస్థితి ముగిసింది. ఆర్ఎస్ఎస్‌పై నిషేధాన్ని కూడా ఎత్తివేశారు.

1978వ సంవత్సరంలో, ఈ రచయిత తన గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తరువాత ప్రచారక్‌గా కూడా బయటకు వచ్చారు. నన్ను జమ్మూలో ఒక సంవత్సరం పాటు మహానగర్-సాయంకాల్ ప్రచారక్‌గా నియమించారు. ఆ తరువాత దోడా, భదేర్వా తహసీళ్లలో ఒక సంవత్సరం పాటు తహసీల్ ప్రచారక్‌గా నియమించారు. మూడవ సంవత్సరానికి, నాకు దోడా జిల్లా ప్రచారక్ బాధ్యతను అప్పగించారు. 1981వ సంవత్సరంలో, నేను శ్రీనగర్‌లోని నా ఇంటికి తిరిగి వచ్చాను. నా ప్రచారక్ పదవీకాలంలోనే 1980లో నా మూడవ సంవత్సరం ఓటీసీని పూర్తి చేసే అవకాశం నాకు లభించింది.

1985లో శ్రీనగర్‌లోని ప్రభుత్వ సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న అశోక్ కౌల్ తన ఉద్యోగాన్ని విడిచిపెట్టి, జీవితకాల ప్రచారక్‌గా చేరారు. గత నాలుగు దశాబ్దాలుగా ఆయన ఈ పాత్రను

# స్థులు' 'విస్తారక్‌లు'



నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు. సంస్థలో వివిధ స్థాయిలలో పలు హోదాలలో తన బాధ్యతలను నిర్వర్తించిన తర్వాత, 2012లో ఆయనను బీజేపీకి పంపించారు. ప్రస్తుతం ఆయన జమ్మూ కాశ్మీర్‌లో బీజేపీకి ప్రధాన కార్యదర్శి(సంస్థాగత)గా ఉన్నారు. గత ఒకటిన్నర దశాబ్దాలుగా ఆయన ఈ పదవిలో ఉంటూ, జమ్మూ, కశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలలో బీజేపీని ఒక అగ్రగామి రాజకీయ సంస్థగా తీర్చిదిద్దడంలో అపారమైన కృషి చేశారు.

కశ్మీర్‌లోని హిందూ సమాజం సామూహికంగా వలస వెళ్లిన అనంతర కాలంలో, కశ్మీర్ లోయకు చెందిన ఇద్దరు అంకితభావం గల స్వయంసేవకులు ప్రచారక్‌లుగా వచ్చారు. బారాముల్లాకు చెందిన వీరేందర్ కుచ్రూ, 1990వ దశకం మధ్యలో కొన్ని సంవత్సరాల పాటు ప్రచారక్‌గా పనిచేశారు. రాంబన్ తహసీల్‌కు నియమితులయ్యారు. దురదృష్టవశాత్తు, ఆయన తన ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత, కరోనావైరస్ మహమ్మారి బారిన పడి 2020లో చిన్న వయసులోనే మరణించారు.

ప్రస్తుతం లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతంలో ఆశిష్ గంజూ అనే యువ స్వయంసేవక్ గత మూడు సంవత్సరాలుగా లేహ్ జిల్లా ప్రచారక్‌గా పనిచేస్తున్నారు. ఆయన తల్లిదండ్రులు దక్షిణ కశ్మీర్‌లోని షోపియాన్‌కు చెందినవారు. ఆయన పోస్ట్–గ్రాడ్యుయేట్.

కశ్మీర్‌కు చెందిన అత్యంత జ్యేష్ఠ స్వయంసేవక్ అమర్‌నాథ్ వైష్ణవి, 1980లో ప్రభుత్వ ఉద్యోగం నుండి పదవీ విరమణ చేసిన తర్వాత, 1981లో ఆర్‌ఎస్‌ఎస్‌లో పూర్తికాల వానప్రస్థిగా చేరారు. ఆయనను విశ్వహిందూ పరిషత్‌కు నియమించారు. అక్కడ ఆయన ఐదు సంవత్సరాల పాటు జమ్మూ కశ్మీర్ రాష్ట్ర సంస్థాగత కార్యదర్శిగా పనిచేశారు. ఆ కాలంలో, అక్కడ నెలకొన్న తీవ్రవాద వాతావరణానికి ప్రతిస్పందనగా, ఆర్‌ఎస్‌ఎస్‌ను ఒక ముఖ్యమైన సంస్థగా సమాజంలో విశ్వాసాన్ని పెంపొందించేందుకు, ఆయన జమ్మూ కశ్మీర్ నుండి పంజాబ్‌కు 'బలిదానీ–జాతా'కు నాయకత్వం వహించారు. ఆయన ఐదు సంవత్సరాల పాటు వానప్రస్థిగా పనిచేసి, 1986లో లోయలోని తన ఇంటికి తిరిగి వచ్చారు. విస్తారక్‌ల వ్యవస్థ అనేది సాధారణంగా సంవత్సరం వరకు, ఒక చిన్న కాలానికి సంస్థకు పూర్తికాల సేవలను అంకితం చేయడానికి మరొక మార్గం. ఈ నేపథ్యంలో, గత యాభై సంవత్సరాలకు పైగా కశ్మీర్‌లోని ఆర్‌ఎస్‌ఎస్ స్వయంసేవకులు వివిధ సమయాల్లో ప్రముఖ పాత్ర పోషించారు. కశ్మీర్‌లో ఇటువంటి విస్తారక్‌ల మొదటి బృందం 1972 నుండి 1977 వరకు ఐదు సంవత్సరాల కాలానికి పనిచేసింది. కశ్మీర్ లోయలోని అన్ని ఉప ప్రాంతాలకు చెందిన ప్రముఖ యువ, విద్యావంతులైన స్వయంసేవకులు ఈ విషయంలో తమ వంతుగా సహకరించారు. ఆర్మీ రిటైర్డ్ కల్నల్ అశోక్ కౌల్, టెలికమ్యూనికేషన్ల శాఖలో రిటైర్డ్ సీనియర్ ఇంజనీర్ అనుపమ్ కౌల్, విస్తారక్‌లుగా జమ్మూ జిల్లాలో నియమితులయ్యారు. తరువాతి సంవత్సరం రాజిందర్ రైనా (కంపాసి) , చాంద్‌జీ భట్ వారిని అనుసరించారు. అదే సంవత్సరం రైనావారికి చెందిన జ్యేష్ఠ స్వయంసేవక్‌లు ఉత్పల్ కౌల్, ప్రమోద్ దుర్రానీ కూడా విస్తారక్‌లుగా ఉన్నారు. నిర్ణీత పద్ధతి ప్రకారం వారిని జమ్మూ నగరంలో పనిచేయడానికి నియమించారు. 1977–78లో, రాజిందర్ ప్రుంగూ జమ్మూ జిల్లా సరిహద్దు ప్రాంతంలో రెండుసార్లు విస్తారక్‌గా పనిచేశారు.

> **గత యాభై సంవత్సరాలకు పైగా కశ్మీర్‌లోని ఆర్‌ఎస్‌ఎస్ స్వయంసేవకులు వివిధ సమయాల్లో ప్రముఖ పాత్ర పోషించారు. కశ్మీర్‌లో ఇటువంటి విస్తారక్‌ల మొదటి బృందం 1972 నుండి 1977 వరకు ఐదు సంవత్సరాల కాలానికి పనిచేసింది. కశ్మీర్ లోయలోని అన్ని ఉప ప్రాంతాలకు చెందిన ప్రముఖ యువ, విద్యావంతులైన స్వయంసేవకులు ఈ విషయంలో తమ వంతుగా సహకరించారు.**

ఆర్‌ఎస్‌ఎస్ ప్రణాళిక, కార్యాచరణ ప్రకారం మార్చి, 1977లో లోక్‌సభ ఎన్నికలలో గెలిచిన ఠాకూర్ బల్దేవ్ సింగ్ కూడా ఆర్‌ఎస్‌ఎస్‌లో ఒక సామాన్య కార్యకర్త, నిర్వాహకుడిగా పనిచేశారు. ఎమర్జెన్సీ కాలంలో జైలులో ఉన్న శిబన్ క్రిషేన్ పండిత, 1970వ దశాబ్దం చివరి సంవత్సరాలలో విస్తారక్‌గా కూడా పనిచేశారు. ఆయనను జమ్మూ రాష్ట్రంలోని ఉధంపూర్ పట్టణానికి నియమించారు. పైన పేర్కొన్న చురుకైన స్వయంసేవకులందరూ వాస్తవానికి శ్రీనగర్ నగరానికి చెందినవారే.

అనేక సందర్భాలలో, ఉత్తర, దక్షిణ కాశ్మీర్‌కు చెందిన యువ, అంకితభావం గల స్వయంసేవకులు కూడా, ప్రధానంగా శ్రీనగర్ మధ్య జిల్లాకు చెందిన తమ సహచరులతో కలిసి, కశ్మీర్ లోయలో పూర్తికాల విస్తారక్‌లుగా కొంతకాలంపాటు సేవలందించారు.

1947 మారణకాండ, 1967 హిందూ ఉద్యమం, 1975–77 ఎమర్జెన్సీ కాలం, రామ జన్మభూమి ఉద్యమం, 1986లో లోయలోని ముస్లిం ఛాందస శక్తులు కశ్మీర్‌లోని దేవాలయాలు, పుణ్యక్షేత్రాలపై జరిపిన మతపరమైన దాడి వంటి అనేక సందర్భాలలో వారు విస్తారక్‌లుగా ఉన్నారు. సంస్థ వారిని నియమించిన ప్రదేశాలలో, వారికి తరచుగా స్వయంసేవకుల ఇళ్లలో వసతి కల్పించేవారు. కశ్మీర్ లోయలో ఆర్‌ఎస్‌ఎస్ పని ఎల్లప్పుడూ ఒక సవాలుగా ఉండేది. కానీ స్వయంసేవకుల అంకితభావం, నిబద్ధత సంస్థ కలలను నిజం చేశాయి. కశ్మీర్‌లోని చాలా మంది స్వయంసేవకులు ప్రభుత్వ ఉద్యోగులు కావడం మరో సవాలుగా ఉండేది. కశ్మీర్ లోయలోని ఆర్‌ఎస్‌ఎస్ స్వయంసేవకుల కఠినమైన శిక్షణ, స్ఫూర్తిదాయకమైన 'సంస్కారాలు' క్షేత్రస్థాయిలో ఎంతో ప్రభావాన్ని చూపాయి. స్వయంసేవకుల సిద్ధాంతం, కఠోర శ్రమ చరిత్రను సృష్టించింది.

**– అశ్వనీకుమార్ ప్రుంగు ('ఆర్గనైజర్' నుంచి)**

మార్క్సిజం-శ్రీరామరాజ్యం



# భారతంలో రాజనీతి

**మహాభారతంలో భీష్ముడు చేసిన బోధనల ఆధారంగా భారతదేశంలో రాజనీతి శాస్త్ర వికాసాన్ని గురించి శ్రీకరపాత్రీ స్వామి చెబుతున్నారు. భారతీయుల రాజనీతి హాబ్స్ వంటివారు చెప్పిన రాజనీతితో పోల్చినప్పుడు ఏ విధంగా మెరుగైనదో ఈ వ్యాసంలో విశ్లేషిస్తున్నారు.**

మన పూర్వికులు సామాజిక నియమాలను (మోరల్ లా) మాత్రమే రూపొందించారు. వాస్తవిక నియమాలను (పాజిటివ్ లా) రూపొందించ లేదు. కారణం ఏమిటంటే, అట్టి నియమాలను పాటించ డానికి తగినంతగా ప్రజలను ఒప్పగించగలిగే పాలకులెవరూ లేకపోయారు. ప్రజామోదాన్ని పొందడం మాత్రమే పాలనకు ఆధారభూతమైంది. భీష్ముడు చెప్పినదాన్ని బట్టి సమాజ నిర్మాణం సామాజిక అనుబంధాల ద్వారా లేదా పరస్పర ఒప్పందాల కారణంగా జరిగింది. కానీ నియమాలను రూపొందించిన తరువాత అలాంటి నియమాలను పాటించేవారు కరవయ్యారు.

ప్రజలు తమ చిత్తానుసారంగా నియమాలను ప్రారంభించారు. అప్పుడు వారికి ఒక పాలకుడు అవసరమయ్యాడు. ఆ పాలకుని నియంత్రణ లేదా దండన భయం చేత ప్రజలకు నియమాలను పాటించక తప్పని పరిస్థితి ఎదురైంది. దీనిని సాధించడం కోసమే...ప్రజలు బ్రహ్మదేవుని వద్దకు వెళ్లి... 'రాజు లేదా పాలకుడు లేకుండా మాకు అనేక కష్టనష్టాలు కలుగుతున్నాయి. అందువల్ల మా అందరికోసం ఎవరైనా సమర్థుడైన పాలకుడిని అనుగ్రహించండి. అతడిని మేమంతా గౌరవిస్తాం. అతడు మమ్మల్ని రక్షిస్తాడు'అని వినయంగా మొరపెట్టుకున్నారు.

అప్పుడు బ్రహ్మదేవుడు వారి ముందుకు అష్టలోకపాలకుల దివ్యప్రతాపం, తేజస్సు కలిగిన మనువును పిలిచాడు. కానీ మనువు పాలకునిగా బాధ్యతలు స్వీకరించడానికి అంగీకరించలేదు. 'రాజ్యపాలనలో పాపభీతి ఉంటుంది. రాజ్యపాలన చాలా కఠినమైన పని' అని బ్రహ్మదేవుడికి విన్నవించు కున్నాడు. 'నేరగాళ్లను రాజు దండించాల్సి ఉంటుంది. అన్నిటికంటే మిథ్యాచారాల పట్ల సంలగ్నమానసం కలిగిన ప్రజలను పాలించడం బహు కష్టంతో కూడుకున్నది' అని కూడా అన్నాడు. 'మీరు భయపడవద్దు. దండన ఇవ్వడం పాపం కాదు. అది పాపం చేసిన వాళ్లకు దక్కే ఫలితం మాత్రమే. మేమందరం మేము సంపాదించుకున్న పశుసంపదలో, బంగారంలో 50వ వంతును, ధన సంపాదనలో పదో భాగాన్ని రాజు కోశాగార వృద్ధికోసం సమర్పిస్తుంటాం. అలాగే ఉత్తమమైన వస్తువులను మీకు బహుమతిగా అందచేస్తుంటాం. ఆయుధాలు ధరించిన శూరులు మిమ్మల్ని అనుసరిస్తారు. ఈవిధంగా మీరు అజేయులై, ప్రతాపయుక్తులై విజయాలను అందుకోగలుగుతారు. రాజు ద్వారా రక్షణ పొందిన ప్రజలు చేసిన పుణ్యకార్యాలలో నాలుగో వంతు పుణ్యం రాజుకు వచ్చి చేరుతూ ఉంటుంది. ఈ రకంగా సుఖంగా లభించిన ధనం, ధర్మం, బలం వంటివాటితో ఉపబృంహితుడివై నీవు దేవతలను ఇంద్రుడు పాలించినట్లు మమ్మల్ని పాలించెదవు గాక! నీవు సూర్యునివలె ప్రకాశవంతునివై నీ విజయ ప్రస్థానాన్ని కొనసాగించు. శత్రువులను మర్దించు. నీకు జయమగును గాక!' అని ప్రజలు విన్నవించారు.

ఈ విధంగా ప్రజలు రాజును ఎన్నుకుని, రాజ్యాన్ని నిర్మించుకున్నారు. భారతదేశంలో సమాజ నిర్మాణం, అలాగే సామాజిక నియమాలకు స్థాయిని కల్పించడానికి, రాజ్యాన్ని స్థిరంగా ఉంచుకోవడానికి వీలుగా రాజ్యనిర్మాణాన్ని చేపట్టారు. అందువల్ల రాజుకు పాలన వ్యవహారాలను సక్రమంగా నిర్వహించుకోవడానికి తగినంత అధికారాలు మాత్రమే అప్పగించారు.

హాబ్స్ చెప్పిన కల్పనలను అనుసరించి, 'రాజుకు ప్రజలు తమపై అన్ని అధికారాలనూ అప్పగించలేదు. అందువల్ల హాబ్స్ 'లెవియాథన్' (దీర్ఘకాయులు) వంటి రాజు నిరంకుశుడు కాదు. అతని అధికారం పరిమితులకు లోబడినది. ఒకవేళ రాజు తన అధికారాలను దుర్వినియోగం చేస్తే ప్రజలకు అతడిని పదవీచ్యుతుడిని చేసే అధికారం ఉండేది. హాబ్స్ ప్రకారం, 'దీర్ఘకాయుడైన రాజుతో విరోధం పెట్టుకోవడం ఎప్పుడైనా సరే, న్యాయసమ్మతం కాదు.' కానీ భీష్ముడు చెప్పిన దాంట్లో అలా ఉండదు. ఉద్ధతుడు (కఠినుడు – గర్విష్ఠి) అయిన వేనుడి వంటి రాజును ప్రజాప్రతినిధులైన రుషులను పదవీచ్యుతుడిని చేయడమే కాదు; అతడిని నాశనం కూడా చేసేశారు. ఇదే భీష్ముడు సమ్మతించిన సామాజిక ఒప్పందం అనే సిద్ధాంతం లేదా సోషల్ కాంట్రాక్ట్ థియరీ.

కొంతమంది భీష్ముడు చెప్పిన మత్స్యన్యాయానికి చెందిన యుగమే హాబ్స్ చెప్పిన ప్రాకృతిక యుగమై ఉండవచ్చని తలపోస్తారు. కానీ భారతదేశంలోని వాస్తవస్థితి ఇటువంటిది కాదు. వస్తుతః కృతయుగం లోని ప్రజలందరూ ధర్మనిష్ఠులూ, పరమ వివేక సంపన్నులు, విజ్ఞానులు, సంయమం కలిగినవారు అని భారతం చెబుతోంది. కాలక్రమంలో సత్త్వగుణం లోపించడంతో ధర్మం క్షీణించింది. దానినుంచి రజోగుణం, తమోగుణం పెరిగి అధర్మం విస్తరించింది. దాంతోనే మత్స్యన్యాయం ఆవిర్భవించింది. ఈ మత్స్యన్యాయం ప్రాకృతిక అవస్థకు చెందినది కానేకాదు. కచ్చితంగా ప్రాకృతిక స్థితి వికృతి చెందిన కారణంగా చొచ్చుకు వచ్చినదే. శాస్త్రీయ సిద్ధాంతాల ప్రకారం క్రమానుగత అభివృద్ధి కాదు; క్షీణతే కనిపిస్తోంది.

కారణ సృష్టికి అత్యంత సమీపంలో సృష్టించబడిన ప్రజలు (ప్రాణులు) సాత్త్వికులు, ధర్మాత్ములు, విచారణశీలురు, స్వీయ నియంత్రణ కలిగిన వారుగా ఉండేవారు. ఈ విధంగా ప్రతి కృతయుగంలో సత్త్వగుణ వికాసం అధికంగా ఉండేది. ప్రతి గ్రీష్మంలో వేడిమి, ప్రతి హేమంతంలో చలి మాదిరిగానే కృతయుగం మళ్లీమళ్లీ వస్తుంటుంది. అలా కృతయుగంలో సత్త్వగుణం విశేషంగా వికాసం చెందుతుంటుంది. అందువల్ల మత్స్యన్యాయమనే అవస్థా వికారం కూడా కనిపిస్తుంది కానీ, అది స్వాభావికమైనది కాదు.

**హిందీమూలం : కరపాత్రీ స్వామి**
**అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ**

# అభినందనీయ ప్రయత్నం

దుగ్గిరాల రాజకిశోర్ గారిని తలచుకోగానే మూడు పదాలు గుర్తొస్తాయి.

పట్టుదల .. ప్రతిభ .. పరాక్రమం !!

ఏదైనా పట్టుకుంటే లోలోతుల్లోకి వెళ్లాలన్న పట్టుదల. ఆ విషయంలో ఇతరులకు అవగతం కాని కోణాలను వెలికి తీయగలిగే అపారమైన ప్రతిభ. నమ్మిన దాని కోసం వెనకడుగు వేయని, ముందుకే నడిచే పరాక్రమం.

నేషనల్ బుక్ ట్రస్ట్ సలహా మండలి సభ్యులుగా 2018లో కలిసి పని చేసిన నాటినుంచి ఈ మూడు గుణాలు ఆయనలో నానాటికీ మరింతగా ప్రస్ఫుటం అవుతున్నాయే తప్ప ప్రభ తగ్గడం లేదన్నది నా స్వానుభవం.

ఛత్రపతి శివాజీ మహారాజు గురువైన సమర్థ గురు శ్రీరామదాసు వ్యక్తికి "ప్రయత్న, ప్రచీతి, ప్రబోధ''లు ఆవశ్యకం అని చెప్పేవారు. ఒక విషయంపై నిరంతర ప్రయత్నం, దానిని అనుభవం పూర్వకంగా తెలుసుకోవడం .. ప్రచీతి, ఆ తెలుసుకున్న దానిని ఇతరులకు చెప్పడం ప్రబోధం – ఇవే సర్వమానవ కర్తవ్యాలు అన్నదే ఆయన జీవన సారాంశం.

రాజకిశోర్ గారిది కూడా అదే బాట. ఇదే లక్షణం ఈ రచనలోనూ ద్యోతకమవుతుంది.

విప్లవ స్ఫులింగం భగత్‌సింగ్‌కి సుత్తీ కొడవలి తగిలించి, ఆయన జీవన కాలంలో చేరని పార్టీలో శాశ్వత సభ్యత్వం ఇచ్చేవారు కొందరైతే, సిక్కుగా జీవించిన ఆయనకు ఆంగ్లేయుల కోటూసూటూ వేసి కానీ తృప్తిపడని వారు ఇంకొందరు. తమ సిద్ధాంతాల సెంట్లు పూసేవారు కొందరు. తమ ఆలోచనల అంట్లు కట్టేవారు మరి కొందరు.

భగత్‌సింగ్‌కి అత్యంత సన్నిహిత సహచరులైన బటుకేశ్వర దత్త, రాజగురు, సుఖదేవ్ థాపర్, చంద్రశేఖర్ అజాద్, భగవతీ చరణ్, దుర్గా హామీ, రామ్ ప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్‌లకు సోకాల్డ్ సోషలిజం ఎందుకు అంటలేదు? హిందుత్వ ప్రతీకగా కమ్యూనిస్టు వర్గం పగలూ రాత్రీ పడీపడీ తిట్టే సావర్కర్ వ్రాసిన "1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం" పుస్తకం భగత్‌సింగ్‌కి ఎందుకు ఆరాధ్య గ్రంథం అయింది? పచ్చి ఆర్యసమాజిస్టు లాలా లజపత్ రాయ్ మరణానికి ప్రతీకారం తీర్చుకునేందుకు పరమ "నాస్తిక" భగత్ సింగ్ ఎందుకు ఉద్యుక్తుడయ్యాడు?

ఈ ప్రశ్నలు మనసు లోకే రాకుండా కమ్యూనిస్టు గోబెల్స్ గాళ్లు బెల్స్ మోగించేస్తూంటారు. ఇలాంటి కోలాహలాల కాకోఫోనీలో అసలు నిజం తెలుసుకోవాలంటే భగత్ సింగ్ ఏమన్నాడో, ఏం రాశాడో తెలుసుకోవాలి.

అది గుర్తించడమే ప్రతిభ. అది చేయాలనుకోవడమే పరాక్రమం. చేసి చూపించడమే పట్టుదల. అధ్యయనం చేయడమే ప్రయత్నం. అనుభూతితో దాన్నే పలవరించడం ప్రచీతి. దాన్ని పుస్తక శిశువు రూపంలో పురుడు పోయడమే ప్రబోధం. వీటన్నిటి ఫలస్వరూపమే ఈ రచన.

భగత్‌సింగ్‌ను ఆయన మాటల్లోనే ప్రస్తుతీకరించి, కల్తీ లేని భారత భక్తి సింహుడిని పరిచయం చేయడమే రాజకిశోర్‌గారి లక్ష్యం.

ఈ ప్రయత్నానికి అభినందనాలు.

దాని సారళ్యానికి అభివందనాలు.

దాని సాఫల్యానికి ఆంతరిక ఆకాంక్షలు.

**– కస్తూరి రాకా సుధాకరరావు**




**భగత్‌సింగ్ భావజ్వాలలు**

**రచన:** ప్రొఫెసర్ దుగ్గిరాల రాజకిశోర్

**పుటలు: 63**

**వెల: 60 రూ.లు**

**ప్రతులకు:** 8008264690

---

**కవిత**

# మధ్య ప్రాచ్యం



ఇదొక తైలవర్ణ చిత్రం
త్రినేత్రం
ధూర్తం విషపాత్రం
ఎవడి చమురుబావిలోకి దూకి
వాడే ఆత్మహత్య చేసుకుంటున్నాడు.
చిరునామా దొరకని మానవత్వం
సెమిటిక్ కరాళ నృత్యం
ఇది ట్రంపరితనం
గంజాయివనం
ఈ దారి మొహంజొదారి
కుక్కతోక పట్టుకున్న గోదారి
యామాచార్యుని రహదారి
అస్రువారి
ఇది పిచ్చివాడి చేతిలోని రాయి
గాయపడ్డ పావురాయి
అసురునికి తురాయి
ఏది నిజం? హ్యూమనిజం
ఏది పథం? ధర్మరథం.
ఔనన్నా కాదన్నా
ఇది నల్లట్టల పుస్తకం సాగిస్తున్న
మతయుద్ధం–అసంబద్ధం



ప్రొ. ముదిగొండ శివప్రసాద్
విశ్రాంత ఆచార్యుడు

కథ

**ప్రొఫెసర్ శ్రీవాత్సవ సోషియాలజిలో దిట్ట. ప్రొఫెసర్‌గా, వైస్‌ఛాన్సలర్‌గా యూజీసీ మెంబర్‌గా పనిచేసి 15 ఏళ్ల క్రితం రిటైర్ అయ్యాడు. అయినా ఇప్పటికి ఎకడమిక్‌గా చురుకుగా ఉండి, దేశవిదేశీ విశ్వవిద్యాలయాలకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా వెళ్లి లెక్చర్స్ ఇస్తుంటాడు. ఐరోపా ఖండ దేశాలకు ఆహ్వానం మీదవెళ్లి, పక్షం రోజులు లెక్చర్స్, కాన్ఫరెన్స్‌లు ముగించుకుని క్రితం రోజే తిరిగి ఢిల్లీ వచ్చాడు.**

ఢిల్లీలోని తన పాతకాలపు బంగళాముందు లాన్‌లో కూర్చుని, టీ తాగుతూ ఆ పక్షం రోజుల్లో వచ్చిన పోస్ట్ చూసుకుంటున్నాడు. అందులో పుస్తకాలు, ఆహ్వానపత్రాలు వంటివి ఉన్నాయి. ఒక్కొక్కటి చూస్తున్న శ్రీవాత్సవ కళ్లు ఒక ఇన్విటేషన్ కార్డ్‌మీద పడి ఆగిపోయింది.

మరుసటిరోజు కానిస్టిట్యూషన్ క్లబ్‌లో 'నో..ఐ యామ్ నాట్ ఎ హిందూ' అనే పుస్తకం ఆవిష్కరణ సభ ఇన్విటేషన్. రచయిత ప్రొ॥ కంచయ్య. ఆ పుస్తకం ముందు తన మాతృభాషలో రాయగా ఆ తర్వాత అటువంటి ఆలోచనలకు విస్తృత ప్రచారం ఇచ్చేందుకు పనిచేస్తున్న కొందరు ఆంగ్లంలోకి అనువదించినదని అర్థమయ్యేలా ఇన్విటేషన్ కార్డ్ వెనుక రచయిత గురించి రాసిన దానిలో ప్రస్తావించారు.

ఆ పుస్తకం టైటిల్, రచయిత పేరు రెండు వింతగా అనిపించాయి ప్రొఫెసర్ శ్రీవాత్సవ్‌కి. మన దేశ రాజ్యాంగం మత స్వాతంత్ర్యం ఇచ్చింది. ఏ మతం అయినా స్వీకరించవచ్చు. ఇప్పటికే చాలామంది తమకు ఇతరత్రా లభించే లబ్ధినిబట్టి మతం మారటం చేస్తున్నారు. అలా మతం మార్చుకునేవారిని ఎవరు బలవంతంగా ఆపటం లేదు. నువు మా మతం వదిలి వెళ్లిపోతే మా మతం ఏం కావాలి! అని ఎవర్నీ ఎవరు అడగటంలేదు. అందునా హిందూ మతస్తులు అస్సలు అడగరు. కర్మ సిద్ధాంతాన్ని నమ్మినవారు



# కంచయ్య కథ

డా॥ దుగ్గరాజు శ్రీనివాసరావు



కాబట్టి వాడి ఖర్మాన వాడు పోతాడు అని సర్దిచెప్పుకుంటారు.

అంతటి మతస్వేచ్ఛ ఉన్న ఈ దేశంలో 'నో ఐ యామ్ నాట్ ఎ హిందూ' అని రాయటం ఏమిటి! అన్నది ప్రొఫెసర్ శ్రీవాత్సవకి వచ్చిన సందేహం. తనకు ఇష్టం వచ్చిన మతంలోకి మారే స్వేచ్ఛ ఉన్నచోట హాయిగా కొత్త మతం పుచ్చుకుని ఆ మతం కొత్త గుర్తులు ప్రదర్శించక, హిందూమతంలోనే ఉంటూ 'నో ఐ యామ్ నాట్ ఎ హిందూ' అనే పేరుతో పుస్తకం రాయటం అంటే రచయితకు కొంచెం తిక్క అయినా ఉండాలి, లేకుంటే మరేదో ఎజెండా అయినా ఉండి ఉండాలనుకున్నాడు ప్రొఫెసర్ శ్రీవాత్సవ. కాబట్టి రేపు తప్పని సరిగా ఆ మీటింగ్ వెళ్లి ఆ రచయిత ఏం చెబుతాడో విని తీరాలని తన అప్పాయింట్‌మెంట్స్‌లో నోట్ చేసుకున్నాడు.

ఆ రాత్రి సరిగా నిద్రపోలేకపోయాడు ప్రొఫెసర్ శ్రీవాత్సవ. ఇంట్లోవాళ్లు అది జెట్‌ల్యాగ్‌వల్ల అనుకున్నారు. కాని శ్రీవాత్సవకి మాత్రమే తెలుసు అది ఆ పుస్తకం టైటిల్, రచయిత పేరు మీద తన్నుకు వస్తున్న ఆలోచనల వల్ల నిద్రపట్టలేదని. ఆ రచయిత పేరు కంచయ్య అనేది కొత్తగా ఉన్నా ఎక్కడో విన్నట్టు, పరిచయం ఉన్న పేరులా వినిపిస్తున్నది ఆయనకు.

ఎడతెగని ఆలోచనతోనే మరుసటి రోజు కానిస్టిట్యూషన్ క్లబ్‌కి చేరాడు శ్రీవాత్సవ.

అక్కడ అందరూ పరిచయస్తులే. చాలామంది ఆయనకు దగ్గర చదువుకున్నవారు కూడా. అంత పెద్దాయన ఓపిక చేసుకుని వచ్చినందుకు సంతోషపడుతున్నవారు కొందరైతే, ఈయన్నెందుకు పిలిచారు అని కంగారు పడుతున్నవారు కొందరున్నారు. అందులో ముఖ్యుడు ఆ పుస్తక రచయిత ప్రొ॥ కంచయ్య.

మీటింగ్ ప్రారంభానికి సమయం ఉందని వి.ఐ.పి.లకు కేటాయించిన గదిలో కూర్చున్నాడు ప్రొఫెసర్ శ్రీవాత్సవ. అందరూ అక్కడికి వచ్చి ఆయన్ని పలకరించి, నమస్కారం జెప్పి వెళు చున్నాడు. అక్కడున్న ఇతర ఎకడమిక్ ప్రముఖులతో మాట్లాడుతున్న శ్రీ వాత్సవ దగ్గరకు ఆ ఫంక్షన్ నిర్వాహకులు వచ్చి 'వీరే పుస్తక రచయిత ప్రొఫెసర్ కంచయ్య, ఫలానా యూనివర్సిటీలో పనిచేసి రిటైర్డ్ అయ్యారు' అని పరిచయం చేశారు.

ఆ కంచయ్యని చూడగానే, అతని వాటం, పెట్టిన నమస్కారం తీరు కలిపి ప్రొఫెసర్ శ్రీవాత్సవని 40 ఏళ్లు వెనక్కు తీసుకువెళ్లింది. అప్పుడు గుర్తుకు వచ్చింది. ఆ పేరు ఎక్కడా, ఎప్పుడు విన్నది. వయసుతో వచ్చిన మార్పు తప్పించి నలభై ఏళ్లక్రితం తాను చూసినపుడు ఉన్న మిడిగుడ్లు, దొంగచూపులలో ఏ మార్పు లేదు.

సభ మొదలయ్యే సమయానికి ప్రొఫెసర్ శ్రీ వాత్సవని ముందు వరుసలో తీసుకవెళ్లి కూర్చోపెట్టారు. వేదిక మీదున్నవారు తమ తమ బాధ్యతగా ప్రసంగాలు చేస్తుంటే ప్రొఫెసర్ శ్రీ వాత్సవ తన ఆలోచనల్లో తానున్నాడు.

నలభై సంవత్సరాల క్రితం ఒక విశ్వవిద్యాలయ టీచింగ్ పోస్ట్‌ల సెలక్షన్ కమిటీలో యూజీసీ నామినీగా తాను వెళ్లినపుడు జరిగినది గుర్తుకొస్తున్నది ఆయనకు.

మిగిలిన అన్ని సబ్జక్ట్ ఇంటర్వ్యూలు అయిపోయాయి. ఇక సోషియాలజీ విభాగం, తన సొంత సబ్జక్ట్ కాబట్టి ఈ తరం పరిశోధక విద్యార్థులను శ్రద్ధగా ఇంటర్వ్యూ చేసి వారికి సూచనలు ఇవ్వాలి అనుకుంటున్నాడు ప్రొఫెసర్ శ్రీవాత్సవ. సరిగా ఆ సమయంలో అక్కడికి వచ్చాడు కంచయ్య.

ఒక్క ప్రశ్నకూ సరైన సమాధానం చెప్పలేదు. ఇతగాడి కన్న ఎంతో మెరిట్ ఉన్న విద్యార్థులు వచ్చారు. అందులో ఒకరిని సెలక్ట్ చేస్తే యూనివర్శిటీకి, డిపార్ట్‌మెంట్‌కి మేలు అనుకుంటుండగా, సెలక్షన్ కమిటీ హోదాలో వైస్‌ఛాన్సలర్ ఆ పోస్ట్‌కి కంచయ్యని సెలక్ట్ చెయ్యాలనటం ప్రొఫెసర్ శ్రీవాత్సవకి ఆశ్చర్యం కలిగించింది."నోరు విప్పని వాడికి లెక్చరర్ ఉద్యోగం ఏమిటి?" అని అడిగాడు కూడా.

"ఈ విషయంలో నేను నిస్సహాయుడిని ప్రొఫెసర్. ఆ పోస్ట్ అతని సామాజిక వర్గానికి ప్రత్యేకంగా రిజర్వ్ చేయబడున్నది. ఆ సామాజిక వర్గంకి చెందిన ఏకైక క్యాండిడేట్ అతనే. కంచయ్యకి రాజకీయ పెద్దలతో మంచి పరిచయాలు న్నాయి. వారి ద్వారా ఒత్తిడి తెచ్చి సోషియాలజీ డిపార్ట్‌మెంట్ పోస్ట్, తన సామాజిక వర్గానికి వచ్చేలా రోస్టర్‌ని మార్పించాడు కూడా! ఇప్పటికే అడ్డమైన వాగుడు క్యాంపస్‌లో వాగుతున్నాడు. ఇక ఇప్పుడు అతన్ని కాదన్నామనుకోండి, మీరు నేను అగ్రకులాల ప్రొఫెసర్లం కాబట్టి అణగారిన వర్గాలను పైకి రాకుండా కిందికి తొక్కే ప్రయత్నం చేశారంటూ కొత్త ప్రచారం చేస్తాడండీ" అనాడు వైస్ ఛాన్సలర్.

"ఒక్క రీసర్చి పబ్లికేషన్‌లేదు. ఐదేళ్లు గడిచినా థీసిస్ రాసే ప్రయత్నం చెయ్యటం లేదు. కేవలం తన కులాన్ని ఆయుధంగా పెట్టుకుని ఉద్యోగం సంపా దించాలను కుంటున్నాడా ఈ కంచయ్య..?" అని ప్రొఫెసర్ శ్రీవాత్సవ ప్రశ్నిం

చాడు.

'కులాన్ని పట్టుకుని ఎదగాలనుకుంటున్న ఈ కంచెయ్యల వల్ల మీ యూనివర్సిటీ ప్రతిష్ఠ దెబ్బతింటుంది జాగ్రత్త...' అని తాను చేసిన హెచ్చరిక కూడా గుర్తుకు వచ్చింది ప్రొఫెసర్ శ్రీవాత్సవకి.

వీడి పేరు మాత్రమే కాదు బుద్ధి కూడా విచిత్రంగానే ఉంది అనుకుంటూ తప్పనిసరి పరిస్థితుల్లో కంచయ్యని ఉద్యోగానికి సెలక్ట్ చేయాల్సిన వైనం మదిలో తిరిగింది.

అలా నలభై ఏళ్ల క్రితం తాను చేసిన సెలక్షన్ పాపం ఇప్పుడు ఈ రూపంలో కానిస్టిట్యూషన్ క్లబ్ వేదికని ఎక్కింది.

డబ్బు ఏదైనా చెయ్యగలదు మన దేశంలో అనే మాట స్థానంలో కులం అడ్డుపెట్టుకుని ఏదైనా చెయ్యగలరు కొందరు అనేది కొత్త మాటగా చేర్చాలి అనుకున్నాడు శ్రీవాత్సవ.

వేదికమీద నుండి కంచెయ్య, ఆయన వర్గీయులు చేస్తున్న ప్రసంగాలు, రచయితను ఆకాశానికి ఎత్తుతున్న తీరు, అతని మేధస్సు, అతగాడు తీసుకువచ్చిన కొత్త సామాజిక వాదనల మీద పొగడ్తలతో నిండిపోనున్నాయి. అవి విన్న తర్వాత తాను తన మనసులోని మాటను చెప్పకుండా వెళ్లిపోతే సమాజానికి ద్రోహం చేసినట్లవుతుంది అనిపించింది ప్రొఫెసర్ శ్రీవాత్సవ్‌కి. ఆ విషయమే చిన్న స్లిప్ మీద రాసి సభ అధ్యక్షస్థానంలో ఉన్నవారికి పంపించాడు.

కాదనలేక, అత్యంత ఇబ్బందికరమైన ముఖంతోనే ప్రొఫెసర్ శ్రీవాత్సవను ప్రసంగించవలసిందిగా ఆహ్వానించారు.

చేతికర్ర సహాయంతో నెమ్మదిగా వేదిక ఎక్కిన ప్రొఫెసర్ శ్రీవాత్సవ ఏం మాట్లాడతాడోనని అంతా ఎదురు చూస్తున్నారు. తన మాటలతో సభను ఏం చేస్తాడోనన్న భయం ఆర్గనైజర్స్‌ది. కంచయ్య ముఖంలో ఆందోళన.

గొంతు సవరించుకుని, ఈ వయసులో తాను ఎంత కష్టపడి వచ్చింది చెప్పి ఆ తర్వాత ప్రొ॥



"అన్నింటిని, అందరిని ప్రశ్నించమంటూ లెక్చర్స్ ఇచ్చే కంచయ్యని మనం ఈ విషయంలో ప్రశ్నించవద్దా! ఇక్కడ ఆర్గనైజర్స్, సభికుల్లో ఉన్నవారిలో అధిక శాతం కూడా 'ప్రశ్నించాలి' అని సూచించే వర్గంలోనివారే కదా! మరి వారికి కంచయ్యను ప్రశ్నించాలనే ఆలోచన ఎందుకు రాదు! కంచయ్యలాంటి నిచ్చెన మెట్లు వాడుకుని పైకి ఎక్కి అసలు నిచ్చెనే లేదు... ఉన్నా నాకెన్నడూ సహాయపడలేదు అనేవారి వల్ల సమాజానికి, దేశానికి ప్రమాదం..."

కంచయ్యకి అభినందనలు అన్నాడు. ప్రొఫెసర్ శ్రీవాత్సవ ఎంత అణుచుకుందామనుకున్నా ఆయన గొంతులో అభినందనలు అనే పదంలోని వ్యంగ్యం స్ఫురించింది.

"పుస్తకం టైటిల్ "నో ఐ యామ్ నాట్ ఎ హిందూ". మన స్వాతంత్ర్యం ఇచ్చిన దేశంలో ఇటువంటి టైటిల్‌లో పుస్తకం రావటమే ఒక చిత్రం" అని చిన్న పాజ్ ఇచ్చాడు. ఇక ఆయన తదుపరి మాటలు ఎలా ఉంటాయోనన్న ఆసక్తి పెరిగింది సభికుల్లో.

"కంచెయ్యగారు చెప్పినట్టు హిందూ మతంలో కులం ఉంది. అది వరమో! శాపమో! తెలియదు. కాని ఇప్పటికి ఉంది. ఆ కుల వ్యవస్థను వ్యతిరేకించవచ్చు. అలా ఎందరో వ్యకిరేకించారు. కొందరు నాస్తికులయ్యారు, మరికొందరు ఇతర మతాలలోకి వెళ్లారు. ఇదీ వాస్తవం" అంటూ కంచయ్య వైపు చూశాడు. తన వాదానికి ప్రొఫెసర్ శ్రీవాత్సవ నుండి మద్దతు వస్తున్నదన్న ఆనందం కంచయ్య ముఖంలో కొద్దిగా కనిపించింది.

కాని ఇంతలోనే అతని ముఖ కవళికలు మారిపోయాయి. "కంచయ్యగారు తన జీవితమంతా హిందూమతంలోని కులాన్ని పట్టుకునే గడిపారు. అతనికి ఉద్యోగం దక్కింది అతని కులంవల్ల. ఎందరో మెరిటోరియస్ యువతీ యువకులను కాదని, అతని కులం ఆధారంగానే కంచయ్యను అప్పుడు ఆ లెక్చరర్ పోస్ట్‌కి ఎంపిక చేసిన వారిలో నేనూ ఉన్నాను. అతగాడు కులం ఆధారంగానే రీడర్ అయ్యాడు, ప్రొఫెసర్ కూడా అయ్యాడు. కులం ఆధారంగా ఉన్నత స్థానానికి చేరిన కంచయ్య ఇప్పుడు "నో ఐ యామ్ నాట్ ఎ హిందూ" అంటూ పుస్తకం రాసి, దేశమంతా ప్రచారానికి తిరుగుతుంటే నాకు ఆశ్చర్యం వేస్తోంది. అరవై ఏళ్లకు పైబడి హిందూమతంలో ఉండి, ఆ మతం ద్వారా అందే అన్ని రకాల లబ్ధి పొంది, ఎదిగి చివరికి ఇలా రాశాడంటే అతని మెంటాలిటీని మనం ఎలా అర్థం చేసుకోవాలి!"

"అన్నింటిని, అందరిని ప్రశ్నించమంటూ లెక్చర్స్ ఇచ్చే కంచయ్యని మనం ఈ విషయంలో ప్రశ్నించవద్దా! ఇక్కడ ఆర్గనైజర్స్, సభికుల్లో ఉన్నవారిలో అధిక శాతం కూడా 'ప్రశ్నించాలి' అని సూచించే వర్గంలోనివారే కదా! మరి వారికి కంచయ్యను ప్రశ్నించాలనే ఆలోచన ఎందుకు రాదు! కంచయ్యలాంటి నిచ్చెన మెట్లు వాడుకుని పైకి ఎక్కి అసలు నిచ్చెనే లేదు... ఉన్నా నాకెన్నడూ సహాయపడలేదు అనేవారి వల్ల సమాజానికి, దేశానికి ప్రమాదం..." అలా ప్రొఫెసర్ శ్రీవాత్సవ ప్రసంగం చేస్తుంటే ఆయన ముఖంలోని ఆవేదన, అలసట గుర్తించిన ఒక యువకుడు మంచినీళ్ల గ్లాసు తెచ్చి ఇచ్చాడు.

శ్రీవాస్తవ మంచి నీళ్లు తాగి, ముఖం తుడుచుకుని ఒక్కసారి కంచయ్యవైపు చూద్దామనుకుని తల తిప్పేసరికి కంచయ్య కూర్చున్న కుర్చీ ఖాళీగా ఉంది. పక్కన కూర్చున్న మరో ఇద్దరు కుర్చీలు వదిలేసి వెళ్లిపోయారు. ఎదురుగా శ్రోతల్లో కొందరు నిలబడి చప్పట్లతో హాలుని మారుమోగిస్తున్నారు.

ఇక ఇంతకన్నా చెప్పాల్సిన పనిలేదని ప్రొఫెసర్ శ్రీవాత్సవ వేదిక దిగి కిందికి వస్తుంటే అవతల దూరంగా నిలబడి బిక్కముఖం వేసుకుని నిలుచున్న కంచయ్య కనిపించాడు. తన ఇమేజ్ మొత్తాన్ని చెరిపేసి, నగ్నంగా నిలబెట్టిన పెద్దాయన శ్రీవాత్సవను చూస్తూ... ★


## డిజైనర్ కావలెను

**జాగృతి వారపత్రికలో పనిచేయుటకు గ్రాఫిక్ డిజైనర్ కావాలి. ఫొటో షాప్, పేజీ మేకర్‌లో పేజీలు డిజైన్ చేసిన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం. తెలుగు టైపింగ్ వచ్చి ఉండాలి. డిగ్రీ/ఇంటర్మీడియట్ పాసైనవారు అర్హులు. ఎంపికైన అభ్యర్థి హైదరాబాద్‌లోని కాచిగూడలో గల మా కార్యాలయంలో పనిచేయాల్సి ఉంటుంది. జీతం: రూ.16,000/- నుంచి రూ.20,000/- (ప్రతిభను బట్టి). ఆసక్తి గల అభ్యర్థులు jagritiweekly@gmail.com కు పూర్తి బయోడేటాను పంపించండి.**

**వివరాలకు: 9959991304**



# చదరంగంలో వైశాలి సంచలనం

**మేధో క్రీడ చదరంగం పురుషుల, మహిళల విభాగాలలో నవతరం గ్రాండ్ మాస్టర్లు గుకేశ్, ప్రజ్ఞానంద్, దివ్యదేశ్ ముఖ్, వైశాలీ కొనసాగు తున్నారు. టీమ్ విభాగాలలో మాత్రమే కాదు.. వ్యక్తిగత విభాగాలలోనూ చైనా, నార్వే, అమెరికా, రష్యా దేశాల ఆధిపత్యానికి భారత క్రీడాకారులు గండికొడుతూ వస్తున్నారు.**

చదరంగ ఒలింపియాడ్ పురుషుల, మహిళల విభాగాలలో ఇప్పటికే బంగారు పతకాలు సాధించిన భారత్‌కు పురుషుల ప్రపంచ టైటిల్‌ను గ్రాండ్ మాస్టర్ గుకేశ్ సాధించిపెడితే, మహిళల యువజన ప్రపంచ టైటిల్‌ను దివ్య దేశ్ ముఖ్ సంపాదించడం ద్వారా భారత్ సత్తాను చాటింది.

### గుకేశ్ బాటలో వైశాలీ

ప్రపంచ చదరంగ టైటిల్ అర్హత కోసం జరిగే పురుషుల, మహిళల క్యాండిడేట్స్ టోర్నీలలో సైతం భారత గ్రాండ్ మాస్టర్లు అబ్బురపరచే విజయాలు సాధిస్తున్నారు. పురుషుల క్యాండిడేట్స్ టైటిల్స్‌ను గతంలో ఐదుసార్లు విశ్వవిజేత విశ్వనాథన్ ఆనంద్, ప్రస్తుత విజేత గుకేశ్ సాధిస్తే, మహిళల విభాగంలో తొలిసారిగా తమిళనాడు సంచలనం వైశాలీ రమేశ్ బాబు సాధించడం ద్వారా సరికొత్త రికార్డు నమోదు చేసింది.

ఈ ఏడాది జరిగే ప్రపంచ మహిళల చదరంగ టైటిల్ కోసం జరిగిన అర్హత (క్యాండిడేట్స్) సమరాన్ని సైప్రస్ వేదికగా నిర్వహించారు. ఈ టోర్నీలో పలువురు ప్రపంచ మేటి మహిళా గ్రాండ్ మాస్టర్లను కంగు తినిపించడం ద్వారా 21 సంవత్సరాల వైశాలి విజేతగా నిలిచింది. అంతేకాదు ప్రపంచ టైటిల్ పోరులో ప్రస్తుత ప్రపంచ చాంపియన్, చైనాకు చెందిన జువెన్‌జున్‌తో తలపడనుంది.

### ఆఖరి రౌండ్ విజయంతో

వివిధ దేశాలకు చెందిన అరడజనుమంది విఖ్యాత గ్రాండ్ మాస్టర్లతో సాగిన 14 రౌండ్ల సమరంలో పడుతూలేస్తూ సాగిన వైశాలీ కీలక రౌండ్లలో విశ్వరూపమే ప్రదర్శించింది. క్యాండిడేట్స్ టోర్నీ మొదటి ఐదురౌండ్లలో స్థాయికి తగ్గట్టుగా రాణించలేకపోయిన ఆమె ఆ తరువాత నుంచి నిలకడగా రాణిస్తూ 13వ రౌండ్ పోరు ముగిసే సమయానికి బిబిసారా అసుబయేవా, జుజినెర్‌లతో కలిసి సంయుక్త అగ్రస్థానంలో నిలిచింది. టైటిల్ విజేతగా నిలవాలంటే నెగ్గి తీరాల్సిన చివరి (14వ) రౌండ్ పోరులో క్యాథరీనా లాగ్నోను చిత్తు చేసి అగ్రస్థానంలో నిలిచింది. మరో ఆఖరిరౌండ్ పోరులో అసుబయేవాను భారత మరో గ్రాండ్ మాస్టర్ దివ్య దేశ్ ముఖ్ నిలువరించడంతో అత్యధిక పాయింట్లతో విజేతగా నిలువగలిగింది.

మొత్తం 14 రౌండ్లలో కాథరీనా, అలెగ్జాండ్రా గోర్యచకినాలపై కీలక విజయాలు సాధించడం, అన్నా ముజిచుక్‌తో పోరును డ్రాగా ముగించడం ఆమె విజయానికి మార్గం సుగమం చేసింది.

మరికొద్ది మాసాలలో జరిగే 3లక్షల యూరోల ప్రైజ్ మనీ ప్రపంచ టైటిల్ పోరులో చైనా సూపర్ గ్రాండ్ మాస్టర్ జు వెన్ జున్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. సీనియర్ గ్రాండ్ మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక సాధించలేని ఘనతను చిన్నవయసులోనే వైశాలీ సాధించడం విశేషం.

### అరుదైన రికార్డులు

తమిళనాడు నుంచి అంతర్జాతీయ చదరంగం లోకి దూసుకొచ్చిన వైశాలీ తన తమ్ముడు ప్రజ్ఞానంద్‌తో కలిసి ఓ అరుదైన రికార్డు నెలకొల్పింది. 2500 ఎలో రేటింగ్ సాధించిన భారత మూడో గ్రాండ్ మాస్టర్‌గా రికార్డుల్లో చేరింది. విశ్వనాధన్ ఆనంద్, కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, దివ్యేందు బారువా, ప్రజ్ఞానందల సరసన నిలిచింది.

ప్రపంచ చదరంగ చరిత్రలోనే 2500 ఎలో రేటింగ్ సాధించిన తొలి అక్కా- తమ్ముడు జోడీగా వైశాలీ, ప్రజ్ఞానంద్ చరిత్ర సృష్టించారు. తమిళనాడు ప్రభుత్వంతో పాటు భారత ప్రధాని నరేంద్ర మోడీ నుండి ప్రశంసలు అందుకొన్న ఆమె త్వరలో జరిగే ప్రపంచ టైటిల్‌ను సైతం కైవసం చేసుకోగలిగితే అది సరికొత్త చరిత్రే అవుతుంది.

గ్రాండ్ మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక సాధించలేని ప్రపంచ టైటిల్‌ను చిరుప్రాయంలోనే వైశాలీ సాధించాలని కోరుకొందాం.!



**కృష్ణారావు చాప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969



**ములుగు:** భూపాలపల్లి జిల్లా ములుగులో జరిగిన హిందూ సమ్మేళనంలో భువనేశ్వరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కమలానందభారతి ఆశీః ప్రసంగం చేశారు. ఇందులో అఖిల భారత ధర్మజాగరణ సహ సంయోజక్ ఏలె శ్యాం, సేవికాసమితి ప్రాంత బౌద్ధిక్‌ప్రముఖ్ రూప పాల్గొని ప్రసంగించారు. ఈ సమ్మేళనంలో 10,200 మంది పాల్గొన్నారు.



**ఇందూరు**లోని మారుతీనగర్ బస్తీలో జరిగిన హిందూ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న దక్షిణమధ్య క్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్. ఈ కార్యక్రమంలో పూజ్యశ్రీ రామానందరాయ్ ఇస్కాన్, శ్రీ పిట్ల కృష్ణ మహరాజ్‌లతో పాటు 1480 మంది పాల్గొన్నారు.



**హనుమకొండ**లోని అడ్వకేట్స్‌కాలనీలో జరిగిన హిందూ సమ్మేళన దృశ్యం. ఈ సమ్మేళనంలో తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేశ్, విశ్వహిందూపరిషత్ ప్రాంత ఉపాధ్యక్షురాలు సునీతా రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



**భాగ్యనగర్ :** మధురానగర్, వెంకటరెడ్డిబస్తీలో జరిగిన హిందూ సమ్మేళనంలో రుగ్వేద ఘనాపాఠి బ్రహ్మశ్రీ నరేంద్ర కాప్రే గురుజీ, సేవికా సమితి భాగ్యనగర్ విభాగ్ కార్యవాహిక గోవర్ధనం ప్రసన్నలక్ష్మి, వనవాసి కల్యాణాశ్రమం దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి తాడేపల్లి శివరామకృష్ణ పాల్గొని ప్రసంగించారు. ఈ సమ్మేళనంలో 1420 మంది హాజరయ్యారు.








**నారాయణపేట :** దివ్యాంగులు ఆర్థికంగా స్వశక్తితో అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో ఉపాధి కల్పన కేంద్రాలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా సక్ష్యం సంస్థ పనిచేస్తున్నది. ఇందులో భాగంగా ఏప్రిల్ 19న నారాయణపేట జిల్లా మక్తల్‌లో స్వయంఉపాధి కల్పన కొరకు దివ్యాంగ యువకునికి టీ స్టాల్‌ను ప్రారంభిస్తున్న సక్షమ్‌బృందం. **వనపర్తి జిల్లా** సక్షమ్ ఆధ్వర్యంలో అమరచింతలో దివ్యాంగ మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ, ఉపాధి కేంద్రం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో సక్షమ్ అఖిల భారత సంఘటనామంత్రి చంద్రశేఖరరావు, తెలంగాణ అధ్యక్షులు దయాకర్, కార్యదర్శి విక్రమ్, ప్రాంత సంరక్షకులు డాక్టర్ వేదప్రకాశ్ పాల్గొన్నారు.





**భాగ్యనగర్ :** చార్మినార్ భాగ్ ఆర్యాబాద్ బస్తీలో జరిగిన హిందూ సమ్మేళనంలో విభాగ్ పర్యావరణ ప్రముఖ్ రాజగోపాల్, సేవికాసమితి దిల్‌సుఖ్‌నగర్ భాగ్ కార్యవాహిక రేణుక, శ్రీశ్రీశ్రీ సదాగురు సర్వేశ్వరపురి స్వామిజీ పాల్గొని ప్రసంగించారు. ఈ సమ్మేళనంలో 620 మంది పాల్గొన్నారు.






**ప్రకాశం జిల్లా:** మార్కాపురంలో ఏప్రిల్ 19న జరిగిన వైభవ భారతం కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రాంత ప్రచారప్రముఖ్ భయ్యా వాసు, నెల్లూరు విభాగ్ సంఘచాలక్ పల్నాటి రామదండు, ప్రకాశం జిల్లా సంఘచాలక్ రావినూతల రాంప్రసాద్ పాల్గొన్నారు. 150 మంది వివిధ రంగాల ప్రముఖులు ఉపస్థితులయ్యారు.







**తెనాలి :** శ్రీ సోమేపల్లి సోమయ్య స్మారక సేవా అధ్యయన సంస్థ ఆధ్వర్యంలో తెనాలి, డీఎల్ కాంతరావు కళావేదికలో ఏప్రిల్ 17 న ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సోమయ్య గారితో పరిచయం ఉన్న 112 మంది కార్యకర్తలు ఇందులో పాల్గొన్నారు. సభకు హరిపూర్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. సంస్థ కోశాధికారి హనుమంతరావు, టిఎస్ఆర్ మూర్తి, క్షేత్రప్రచారక్ భరత్ పాల్గొని మార్గదర్శనం చేశారు. హిందుత్వం కోసం కృషి చేస్తున్న అట్టడుగు వర్గాలలోని 8 మంది సమాజసేవకులను సన్మానించారు. సంస్థపేరుతో సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు.

# ఖరీదైన కోటు | కథ



ఒక దొంగ... విలాసాలకు సరిపడేంత డబ్బు తన దగ్గర లేకపోవడంతో దొరికినంత దోచుకుందామని ఒక సత్రంలో తలదాచుకున్నాడు. రెండు రోజులు గడిచినా తన పాచిక పారక పోవడంతో నిరాశచెంది, ఏదో ఆలోచిస్తూ గది బయటకొచ్చి నిలబడ్డాడు. ఎంతో ఖరీదైన కొత్త కోటు వేసుకున్న సత్రం యజమాని తన గది ముందు కుర్చీలో కూర్చొని ఉండటం గమనించిన దొంగ మెల్లగా వెళ్లి అతనితో మాటలు కలిపాడు.

వారి ముచ్చట్లు మంచి ఊపు మీదుండగా దొంగ అత్యంత భయంకరంగా, అచ్చం తోడేలులా ఆవలించాడు. అదివిన్న యజమానికి ఒళ్లు జలదరించి "ఎందుకింత భయంకరంగా ఆవలిస్తావు?" అని అడిగాడు. "అది ఒక పెద్ద కథ. మీరు నమ్మినా,నమ్మలేకపోయినా చెప్పడం నా కర్తవ్యం. నేను ఇలా ఎప్పుడైతే మూడోసారి ఆవలిస్తానో, అప్పుడు నేను తోడేలులా మారిపోయి మనుషుల మీద దాడిచేస్తాను. ఇది గత జన్మలో నేను చేసిన పాపాల ఫలితం. అలా జరగకుండా ఉండాలంటే ఆ సమయంలో ఎవరైనా నా దుస్తులను గట్టిగా పట్టుకోవాలి. లేదంటే నేను నా దుస్తులన్నీ చింపేసి తోడేలులా మారిపోతాను" అని నమ్మబలికాడు దొంగ. ఇదంతా చెబుతూనే రెండోసారి కూడా ఆవలించాడు.

అది విన్న సత్రం యజమాని అక్కడి నుండి లేచి పారిపోవడానికి ప్రయత్నించగా, "అయ్యా! ఎక్కడికెళుతున్నారు. నన్ను పట్టుకోండి. లేదంటే నేను నా దుస్తులు చింపుకుని తోడేలులా మారిపోతాను" అని హెచ్చరిస్తూ, అతన్ని గట్టిగా పట్టుకున్నాడు. దొంగ చేతిలో నుంచి తప్పించుకోవాలని సత్రం యజమాని ప్రయత్నించాడు. సాధ్యం కాకపోవడంతో కోటును వదిలించుకుని తప్పించుకుని కాళ్లకు బుద్ధిచెప్పాడు. కోటు దొంగ చేతిలోనే ఉండిపోయింది. దొంగ తన పంట పండిందనుకుని ఆ కోటుతో ఉడాయించాడు. ★

## మంచిమాట

శత్రువులను వదిలించుకోవాలంటే,
వాళ్లను స్నేహితులుగా చేసుకోవడం
కన్నా మంచి మార్గం లేదు.

## మెదడుకు మేత

ఆకు చిటికెడు
కాయ మూరెడు..
ఏమిటది?

జవాబు : మునగ కాయ

## పద్యం

అప్పిచ్చువాడు వెద్యుఁడు
నెప్పుడు నెడతెగక (బాఱు నేఱును,ద్విజుఁడున్
జొప్పడిన యూర నుండుము
చొప్పడకున్నట్టి యూర జొరకుము సుమతీ!

**భావం :** రుణం ఇచ్చేవాడు, వైద్యుడును, నిరంతరం ఎడతెగక ప్రవహించే నది, బ్రాహ్మణుడు గల గ్రామంలో నివసించాలి. అలాంటి వసరులు, వసతులు లేని చోట ఊరిలోకి ప్రవేశించనే కూడదు..

## శ్లోకం

ఈర్ష్యీ ఘృణీ త్వసంతుష్టః క్రోధనో నిత్యశంకితః
పరభాగ్యోజీవీ చ షడేతే దుఃఖ భాగినః

**భావం :** అసూయపరుడు, జుగుప్స (ఏవగింపు) కలవాడు, సంతృప్తిలేని వాడు, కోపస్వభావం కలవాడు, నిత్యం శంకించే మనస్తత్వం కలవాడు, ఇతరుల సంపదపై ఆధారపడి జీవించేవాడు... ఈ ఆరుగురు దుఃఖ పొందుతారు.

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| సైక్రో ఫోబియా | మురికి |
| రూపో ఫోబియా | చలి |
| ఒంబ్రో ఫోబియా | కాంతి |
| హోమిచ్‌లో ఫోబియా | వర్షం |
| అస్ట్రో ఫోబియా | పొగమంచు |

సమాధానాలు : సైక్రో ఫోబియా–చలి; రూపో ఫోబియా–మురికి; ఒంబ్రో ఫోబియా–వర్షం; హోమిచ్‌లో ఫోబియా–పొగమంచు; అస్ట్రో ఫోబియా–కాంతి.

## శాస్త్రవేత్తలు

### పంచానన్ మహేశ్వరి



భారతీయ ప్రముఖ వృక్షశాస్త్రజ్ఞుడు, రాయల్ సొసైటీ సభ్యుడు. 1904 నవంబర్ 9న జైపూరులో జన్మించారు. అంజిస్పెర్మస్‌ను టెస్ట్ ట్యూబ్‌లో పెంచే సాంకేతికతను ఆవిష్కరించినందుకుగాను ఆయన ప్రసిద్ధుడయ్యారు. ఈ ఆవిష్కరణతో గతంలో పెంచడానికి సాధ్యపడని కాని కొన్ని సంకర జాతి మొక్కలను కృత్రిమంగా పెంచగలిగారు. 1934లో బెంగళూరులోని భారతీయ విజ్ఞానశాస్త్ర అకాడమీ గౌరవ సభ్యుడయ్యారు. 1965లో ఆయన రాయల్ సొసైటీ ఫెలోగా ఎంపికయ్యారు. ఈ గౌరవం పొందిన భారతీయ వృక్షశాస్త్రవేత్తల్లో పంచానన్ రెండో వ్యక్తిగా నిలిచారు. భారతీయ సైన్స్ కాంగ్రెస్ సంఘం బీర్బల్ సాహ్నీ మెడల్‌తో (1968) ఆయనను సత్కరించింది.

## జనరల్ నాలెడ్జ్

1. ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినదించిన స్వాతంత్ర్య సమరయోధుడు?
2. సాత్పూరా వన్యప్రాణి సంరక్షణ కేంద్రం ఏ రాష్ట్రంలో ఉంది?
3. 'NIA' విస్తరించండి?

జవాబులు : 1. భగత్ సింగ్; 2. మధ్యప్రదేశ్; 3. నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ

## భక్తాగ్రేసరులు

### ముమ్మిడివరం బాలయోగి



ఏకాగ్రత కుదిరితే ప్రజాసమూహం మధ్య కూడా తపస్సు చేయవచ్చని,అందుకోసం అడవులకో, హిమాలయాలకో వెళ్లనవసరంలేదని చాటిన ఈ కాలపు ఆధ్యాత్మికవేత్త ముమ్మిడివరం బాలయోగి. గంగయ్య, రామమ్మ దంపతుల కుమారుడైన ఆయన పూర్వనామం సుబ్బారావు. ఆయన పదేళ్ల వయస్సు వరకు గోపాలకుడిగా పనిచేసి, పదిహేనేళ్ల వయసులో ఆధ్యాత్మిక బాటపట్టారు. ఒక కొబ్బరి చెట్టు కింద కృష్ణ భగవానుడు, నారదమహర్షి గల చిత్రపటాన్ని ముందుంచుకొని పద్మాసన స్థితిలో తపస్సు ప్రారంభించారు. అన్న పానాదులను త్యజించి తపోనిష్ఠలో ఉండేవారు. ఆయన దర్శనానికి ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చేవారు. అలా 27 నెలలకు తనను దర్శింపవచ్చిన కాకినాడకు చెందిన వ్యాసం సత్తిరాజుతో 'కొందరి వలన నా తపస్సుకు అంతరాయం కలుగుతోంది. ఏకాంతానికి భంగం వాటిల్లుతోంది. తలుపులు, తాళాలు లేని మందిరానికి ఏర్పాట్లు చేయించండి. దైవారాధన కోసం నిత్యం కొద్దిగా పాలు, నీరు భక్తిగా లోపల ఉంచండి' అని కోరారు. నాటి నుంచి ఆయన మహాసమాధి పొందే వరకు (1946–1985) మహాశివరాత్రి మరునాడు దర్శనమిచ్చేవారు. ఆయన జీవితకాలంలో ఏటా ఆయన దర్శించుకొనే ఫ్రెంచ్ బేలే నృత్య కళాకారిణి పమిలా స్కార్ట్ తమ భాషలో ఆయనపై గ్రంథాన్ని రాశారు. ప్రముఖ నటుడు చిత్తూరు నాగయ్య నటించిన 'భక్తపోతన' చిత్ర ప్రభావంతో సుబ్బారావు, బాలయోగిగా మారాడనే ప్రచారమూ ఉంది.



# వారఫలాలు

**27 ఏప్రిల్ -3 మే ,2026**



సింహంభట్ల సుబ్బారావు
6300674054



### మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

కొత్త విషయాలు తెలుసుకుంటారు. ఇంటి నిర్మాణాలలో కొంత పురోగతి కనిపిస్తుంది. వ్యాపారస్తులు విస్తరణ కార్యక్రమాలు ముమ్మరం చేస్తారు. ఉద్యోగస్తులకు విధుల్లో అవాంతరాలు తొలగి ఊరట లభిస్తుంది. పారిశ్రామికవేత్తలు కొత్త సంస్థల ఏర్పాటుపై దృష్టి పెడతారు. రచయితలు, క్రీడాకారులు ఆశయాలను నెరవేర్చుకుంటారు. 27,28 తేదీలలో ఆకస్మిక ప్రయాణాలు. బంధువులతో విభేదాలు. శివాష్టకం పఠించండి



### వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

కొత్త వ్యక్తులు పరిచయమవుతారు. సంఘసేవలో పాల్గొంటారు. మీ ఖ్యాతి మరింత పెరుగుతుంది. వ్యాపారరంగం వారు తమ సంస్థల విస్తృతికి మరిన్ని చర్యలు చేపడతారు. ఉద్యోగస్తులు మరింత సంతోష దాయకంగా గడుపుతారు. కళాకారులకు అవకాశాలు ఊహించనిరీతిలో లభిస్తాయి. రచయితలు, శాస్త్ర వేత్తలకు ఆహ్వానాలు అందుతాయి. 28,29 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. బాధ్యతలు పెరుగుతాయి. ఆంజనేయ దండకం పఠించండి.



### మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

సంఘసేవలో భాగస్వాములవుతారు. దేవాలయాలు సందర్శిస్తారు. కీలక వ్యక్తులు పరిచయమవుతారు. వ్యాపారస్తులు భాగస్వాముల నుండి సహాయం స్వీకరిస్తారు. ఉద్యోగులు విధుల్లో తమ సత్తాను చాటుకుంటారు. రాజకీయవేత్తలు సంతోషకరంగా గడుపుతారు. రచయితలు, కళాకారులు కొన్ని అవకాశాలు సాధిస్తారు. 30, మే1 తేదీల్లో దూర ప్రయాణాలు. స్వల్ప అనారోగ్య సూచనలు. గణేశ్‌స్తోత్రాలు పఠించండి.



### కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

తరచూప్రయాణాలు చేస్తారు. కొన్ని నిర్ణయాలను వాయిదా వేసుకుంటారు. ఆరోగ్యంపై కొంత శ్రద్ధ అవసరం. వ్యాపారస్తులు ఆచితూచి వ్యవహరించడం మంచిది. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలు మీద పడే అవకాశం. పారిశ్రామికవేత్తలు ఒడిదుడుకుల మధ్య గడుపుతారు. క్రీడాకారులు, శాస్త్రవేత్తలు అనుకున్న అవకాశాలు పొందలేక నిరుత్సాహ పడతారు. 29,30 తేదీల్లో శుభవార్తలు. వాహన యోగం. శ్రీరామరక్షా స్తోత్రాలు పఠించండి.



### సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

సంఘంలో ఆదరణ పొందుతారు. కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటారు. వ్యాపారులకు విస్తరణ యత్నాలు సఫలమవుతాయి. ఉద్యోగులకు ఒక సంతోషకర సమాచారం అందుతుంది. పారిశ్రామిక వేత్తలు తమ కృషితో మరింత వృద్ధి చెందుతారు. పరిశోధకులు, వైద్యరంగం వారికి మరింత గుర్తింపు లభిస్తుంది. మే 2,3 తేదీల్లో కుటుంబంలో ఒత్తిడులు. ఆకస్మిక ప్రయాణాలు. శివాష్టకం పఠించండి.



### కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

శుభ కార్యాలకు డబ్బు వెచ్చిస్తారు. వ్యాపారస్తులు మరింత ఉత్సాహంగా ముందడుగు వేస్తారు. ఉద్యోగస్తులకు విధి నిర్వహణలో మరింత ప్రోత్సాహం లభిస్తుంది. రాజకీయవేత్తలు యుక్తితో కొన్ని వ్యవహారాలు పూర్తిచేస్తారు. కళాకారులు, క్రీడాకారులు ఊహించని విధంగా కొన్ని అవకాశాలు దక్కించుకుంటారు. 27,28తేదీల్లో ధనవ్యయం. కుటుంబంలో సమస్యలు. దేవీస్తుతి మంచిది.



### తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

నూతన విద్యావకాశాలు లభిస్తాయి. ప్రముఖ వ్యక్తులు పరిచయంకాగలరు. ఆలయాలు, ఆశ్రమాలు సందర్శిస్తారు. వ్యాపారులు లాభాల దిశగా పయనిస్తారు. ఉద్యోగులకు విధుల్లో అవాంతరాలు తొలగుతాయి. కళాకారులకు అవకాశాలు అప్రయత్నంగా దక్కుతాయి. రచయితలు, క్రీడాకారులకు ప్రోత్సాహకరంగాఉంటుంది.మే1,2తేదీల్లో దూర ప్రయాణాలు. ఆస్తులపై వివాదాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.



### వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

శుభవార్తలు అందుతాయి. పరిస్థితులు అనుకూలించి వ్యాపారులు మరింతగా పెట్టుబడులు పొందుతారు. ఉద్యోగులు విధి నిర్వహణలో ఆటం కాలు అధిగమిస్తారు. రాజకీయవేత్తలకు ఉత్సాహవంతమైన కాలం. రచయితలు, క్రీడాకారులు ఆహ్వానాలు అందుకుంటారు. 30, మే 1 తేదీల్లో వృథా ఖర్చులు. మానసిక ఆందోళన. నవగ్రహస్తోత్రాలు పఠించండి.



### ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు. రాబడి అనూహ్యంగా దక్కుతుంది. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలలో పురోగతి. ఉద్యోగస్తులు కోరుకున్న మార్పులు ఉంటాయి. రాజకీయవేత్తలు తమ సత్తా చాటుకుని అవకాశాలు సద్వినియోగం చేసుకుంటారు. శాస్త్రవేత్తలు, కళాకారులకు ఆహ్వానాలు అందుతాయి. 28,29 తేదీల్లో అనారోగ్యం. దూరప్రయాణాలు. కుజగ్రహస్తోత్రాలు పఠించండి.



### మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

వ్యాపారస్తులు ఎంతోకాలంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమిస్తారు. ఉద్యోగస్తులకు సంతోషకరమైన సమాచారం అందుతుంది. రాజకీయవేత్తలు కొన్ని విషయాలలో రాజీమార్గం అనుసరిస్తారు. పరిశోధకులు, టెక్నాలజీ రంగం వారికి చెప్పుకోతగిన ప్రగతి కనిపిస్తుంది. 28,29 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. ఆరోగ్యసమస్యలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.



### కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ఒక ఆహ్వానం అంది ఉత్సాహంగా గడుపుతారు. వాహన సౌఖ్యం. కీలక నిర్ణయాలు తీసు కుంటారు. వ్యాపారస్తులు విస్తరణ కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. ఉద్యోగస్తులు కొన్ని హోదాలు దక్కించుకుంటారు. పారిశ్రామికవేత్తలు ప్రతిభను చాటుకుంటారు. కళాకారులు శాస్త్రవేత్తలు మంచి గుర్తింపు పొందుతారు. 30,మే1 తేదీల్లో ధనవ్యయం. మానసిక ఆందోళన. శ్రీరామస్తోత్రాలు పఠించండి.



### మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఆదాయానికి పడ్డ ఇబ్బందులు తొలగి ఊరట చెందుతారు. ఇంటి నిర్మాణాలపై దృష్టి సారిస్తారు. పరిచయాలు విస్తృతమవుతాయి. వ్యాపారులు అనూహ్యమైన రీతిలో లాభాలు గడిస్తారు. ఉద్యోగులకు సంతోషకర సమాచారం రావచ్చు. రాజకీయ వేత్తలు కొత్త పదవులు దక్కించుకుంటారు. వైద్య, సాంకేతిక రంగాల వారు మరిన్ని అవకాశాలు పొందుతారు. మే 2,3 తేదీల్లో వృథా ఖర్చులు. బంధువులతో తగాదాలు. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

# పదరసం-561

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | | 2 | 3 | | | 4 | 5 | 6 |
| | | 7 | | | | 8 | | | |
| | 9 | | 10 | | | | | | |
| 11 | | | | | | | | 12 | |
| 13 | | | 14 | | 15 | | 16 | | 17 |
| | | 18 | | | 19 | 20 | | | |
| 21 | 22 | | | 23 | | | | 24 | |
| 25 | | | 26 | | | | 27 | | |
| | 28 | | | | | 29 | | | 30 |
| 31 | | | 32 | | | | | 33 | |

## ఆధారాలు

**అడ్డం**

1. ఊరు, పల్లె (2)
2. వింత, ఆశ్చర్యం (3)
4. అనురాగం, ప్రేమ (3)
7. కెరటం, అల... చెల్లాచెదరు (3)
8. అందమైన కన్నులు కలది (4)
10. తెనాలి రామకృష్ణుడిని ఇలా అంటారు (5)
11. వానరం, బ్రహ్మచారికి పోలిక (3)
13. మన్మథసతి.. అటు నుంచి (2)
14. కృత్తిక నక్షత్ర సంబంధిత నెల (3)
16. చందనం, అగరు (3)
19. ఆడలేడి (3)
21. ఎత్తుగడ, వ్యూహం (3)
23. తెలుగు తొలి సంవత్సరం (3)
24. ప్రాతఃకాలం, మరునాడు (2)
25. భూమిక, గిన్నె (2)
26. కుదువ (3)
28. పశ్చిమ దిశ (4)
29. సౌందర్యం, సొగసు (2)
31. అనుకూలం, పొందిక (2)
32. మృత్యువులో యుద్ధం (2)
33. వెల, భూమి (2)

**నిలువు**

1. కొండ, రాయి (2)
2. అధికం (3)
3. గణపతి నాటక కర్త ఇంటిపేరు (5)
4. విజ్ఞప్తి, విన్నపం (3)
5. యముడే..తిరగబడ్డాడు (2)
6. కూతురు (3)
8. కుకవికి వ్యతిరేకం (3)
9. పంచదార (3)
11. బుద్ధి, మనసు (2)
12. కర్ణుడి పెంపుడు తల్లి (2)
15. విరటుని కొలువులో ధర్మజుడు (4)
16. ఈ గోవు పాలు గరిటడైనా చాలట (2)
17. గతం, పూర్వం (3)
18. వేడి, ఉష్ణం (2)
20. శాపం కాదు... కింద నుంచి (2)
21. పాపాయిని పిలవండి (2)
22. చిత్తరువు (4)
23. గ్రంథభాగం, ప్రసంగం (4)
26. కమలం, పద్మం (3)
27. అహం, గర్వం (2)
29. ఒడి, నాటకంలో ఒక భాగం (2)
30. భార్య, ఇల్లాలు (2)

## పదరసం - 560 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 న | 2 వ | ల | | 3 ఊ | 4 హ | | 5 పె | రు | 6 పా |
| 7 గ | డి | | 8 శా | ర్వ | రి | | ద | | ట్టు |
| వు | | 9 రం | ఖ | శి | | 10 సా | వి | 11 త్రి | |
| | 12 నా | గు | లు | | 13 న | దం | | శూ | |
| 14 చె | లు | లు | | 15 అ | న్న | | 16 శ్రీ | లం | 17 క |
| 18 లి | క | | | 19 న | య | 20 న | శ్రీ | | లీ |
| మి | | 21 అ | 22 మ | లం | | గ | | 23 ర | |
| | 24 జ | గ | తి | | 25 స | రి | 26 గ | మ | 27 ప |
| 28 పొ | గ | డ్త | | 29 గ | తి | | 30 గ | ణి | తం |
| | డం | | 31 ప | ణం | | 32 జ | నం | | గం |



# నివురుగప్పిన నిప్పులా చిత్రసీమ!

సంక్రాంతి సీజన్‌లో విడుదలైన చిరంజీవి 'మన శంకర వరప్రసాద్ గారు', నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు', శర్వానంద్ 'నారీ నారీ నడుమ మురారి' చిత్రాలు విజయం సాధించడంతో తెలుగు సినిమా కాస్తంత ఊపిరి పీల్చుకుంది. కానీ ఆ తర్వాత మూడు మాసాలు గడిచినా ఒక్క సినిమా కూడా ఆ స్థాయి విజచం సాధించకపోవడంతో పరిశ్రమ అతలాకుతలం అవుతోంది. ఫిబ్రవరి, మార్చి మాసాల్లో చెప్పుకోదగ్గ విజయం దక్కకపోవడం, ఏప్రిల్‌లో ఇప్పటికే 18 సినిమాలు విడుదలైనా ఏవీ ఆశించిన స్థాయిలో సక్సెస్ కాకపోవడంతో చిన్న నిర్మాతలు ఆందోళన చెందుతున్నారు. దానికి తోడు పలు సమస్యల కారణంగా సినిమా రంగం నివురు గప్పిన నిప్పును తలపిస్తోంది.

## పర్సంటేజ్‌కై ఎగ్జిబిటర్స్ ఒత్తిడి

గత కొన్నేళ్లుగా సింగిల్ థియేటర్ల నిర్వహణ కష్టసాధ్యం కావడంతో ఎగ్జిబిటర్లు వాటిని ఫంక్షన్ హాల్స్‌గానో, గోడౌన్లుగానో మార్చుకుంటున్నారు. సినిమా ప్రదర్శన మీద విపరీతమైన ఆసక్తి ఉన్న కొందరు వేరే ఆస్తులు అమ్ముకుని నాలుగైదు దశాబ్దాల క్రితం థియేటర్లను కట్టుకున్నారు. కానీ నాటి పరిస్థితి ఇప్పుడు లేదు. పాడైపోయిన థియేటర్లను రిపేర్ చేయించాలన్నా, వాటికి పూర్వ వైభవం తీసుకు రావాలన్నా కోట్ల రూపాయలు ఖర్చు చేయాలి. కానీ దానికి తగ్గ రాబడి వచ్చేలా లేదు.

పైగా ప్రస్తుత యువత చిత్ర ప్రదర్శనపై కంటే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు, వేరే వ్యాపారాలకు అలవాటు పడ్డారు. దాంతో సింగిల్ థియేటర్ల మనుగడ ప్రశ్నార్థకమైంది. ఇప్పుడు ఉన్న వందల థియేటర్లను నష్టాలతో నడపలేక కొందరు పర్సంటేజ్ సిస్టమ్‌లోనే సినిమాలను ప్రదర్శిస్తామని చెబుతున్నారు. అందుకు అగ్ర నిర్మాతలు అంగీకరించడం లేదు. అద్దె పద్ధతిలో అయితే కలెక్షన్లతో సంబంధం లేకుండా క్రమం తప్పకుండా ఆదాయం వస్తుందన్నది వారి వాదన. నిజానికి ఇవాళ థియేటర్లకు జనం రావడం బాగా తగ్గిపోయిన నేపథ్యంలో పర్సంటేజ్ కంటే రెంట్ వల్లే ఎగ్జిబిటర్లు లాభపడతారు. అయితే కొంతమంది నిర్మాతలు, పంపిణీదారులు అదే, పర్సంటేజీల్లో ఏది తక్కువైతే దానిని పాటిస్తున్నారు. కాదూ కూడదంటే థియేటర్లను మూసేసుకుంటామని సింగిల్ థియేటర్స్ ఎగ్జిబిటర్స్ అల్టిమేటమ్ ఇస్తున్నారు.

## ఓటీటీతో ఎదురు దెబ్బ

ఎగ్జిబిటర్స్ సమస్య ఇలా ఉంటే... ఓటీటీ సంస్థలు నిర్మాతల వెన్నును పూర్తి స్థాయిలో విరిచేస్తున్నాయి. ఒకప్పుడు థియేట్రికల్ రైట్స్‌తో పాటు శాటిలైట్, ఓటీటీ స్ట్రీమింగ్ రైట్స్‌తో కోట్లు గడించ వచ్చని నిర్మాతలు భావించారు. అయితే ఓటీటీ హక్కులు అమ్మేసుకుంటుండంతో శాటిలైట్ హక్కుల ఆదాయం నామ మాత్రం అయిపోయింది. చిన్న సినిమా విడుదలైన మూడు, నాలుగు వారాలకే ఓటీటీలో ప్రదర్శితమవుతోంది. అదే డబ్బింగ్ సినిమాలైతే.. థియేట్రికల్ రిలీజ్ కాస్తంత ఆలస్యమైతే... రెండోవారంలోనే ఓటీటీలో ప్రత్యక్ష మౌతోంది. పెద్ద హీరోల సినిమాలు పరాజయం పాలైనా... ఆరేడు వారాల్లో ఓటీటీలో వస్తుంది కదాని ఎవ్వరూ థియేటర్లకు వెళ్లడం లేదు. దాంతో కచ్చితంగా థియేట్రికల్ రిలీజ్ అయిన రెండు నెలల తర్వాత మాత్రమే ఓటీటీకి ఇవ్వాలనే నిబంధన పాటించాలని నిర్మాతలపై వారి అసోసియేషన్ ఒత్తిడి చేస్తోంది. మరో పక్క ఓటీటీ సంస్థతో ముందే అగ్రిమెంట్ చేసుకున్న అగ్ర నిర్మాతలు... ఒకవేళ సినిమా అనుకున్న సమయంలో పూర్తి చేయలేక విడుదల తేదీని వాయిదా వేస్తే... ఓటీటీ సంస్థలు తామిచ్చే రాయల్టీలో కోత పెడుతున్నాయి. దాంతో హాఫ్ కుక్కుడ్‌గానే సినిమాలను విడుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఓటీటీ ఒప్పందాలు తమకు ఉపయోగపడతాయనుకున్న నిర్మాతలకు నేడవి గుదిబండగా మారాయి. దాంతో ఓటీటీ సంస్థలను ఎలా నియంత్రించాలి? వారితో ఒప్పందం తీసుకునే ప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. అనేది నిర్ణయించడానికి దక్షిణాదికి చెందిన నిర్మాతలు సౌతిండియన్ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసి, చర్చలు జరుపుతున్నారు.

## డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ పై కన్నెర్ర

గతంలో సినిమాను రీల్స్ ద్వారా ఎగ్జిబిటర్స్‌కు పంపేవారు. కానీ సాంకేతిక రంగంలో వచ్చిన మార్పులతో ఇప్పుడు ఆ పద్ధతి పోయింది. రెండు మూడు దశాబ్దాలుగా శాటిలైట్ ద్వారానే సినిమా కంటెంట్‌ను థియేటర్లకు పంపుతున్నారు. దాంతో రూ.వేలు ఉండే ప్రింట్ ధర ఆదా అయ్యింది. అత్యధిక థియేటర్లలో ఒకేసారి సినిమా ప్రదర్శించే సౌలభ్యం కలిగింది. గతంలో ఎ, బి, సి సెంటర్స్‌లో సినిమాలు ఒకదాని తర్వాత మరో దానిలో ప్రదర్శిత మయ్యేవి. ఇప్పుడు అన్ని కేంద్రాల్లో ఒకే రోజున ఒకే సమయానికి, అత్యధిక ఆటలు ఆర్థికంగా వేసే అవకాశం కలిగింది. అది తమకు వరంగా నిర్మాతలు భావించారు. అయితే శాటిలైట్ ద్వారా పంపించే డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ ఛార్జీలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. ఈ ఛార్జీలు తగ్గించాలని నిర్మాతలు ఎప్పటి నుండి డిమాండ్ చేస్తున్నా ఫలితంలేదు. కేరళ నిర్మాతల మండలి.. ఇటీవల డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ వ్యవస్థలోకి అడుగుపెట్టి, తమ నిర్మాతలకు నామమాత్రం ఛార్జీలతో సేవలు అందిస్తోంది. ఇక్కడా అదే అమలు చేయాలని తెలుగు నిర్మాతలు కోరుతున్నారు.

కాగా, పెద్ద, చిన్న అనే తేడా లేకుండా ఇవాళ ఏ సినిమా కూడా అనుకున్న తేదీకి విడుదల కావడం లేదు. అందుకు కారణాలు అనేకం. గత నెల రోజులుగా మధ్య ఆసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా కొన్ని సినిమాల షెడ్యూల్స్ వాయిదా పడ్డాయి. అలానే విదేశీ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని తీసిన 'టాక్సిక్' లాంటి పాన్ ఇండియా సినిమాల విడుదల పోస్ట్ పోన్ అయ్యింది. రామ్‌చరణ్ 'పెద్ది' కూడా అనుకున్న సమయానికి షూటింగ్ పూర్తి కాకపోవడంతో అదీ వాయిదా పడింది. ఇలా పెద్ద సినిమాల రిలీజ్ వాయిదాపడటంతో దానికి ముందు, వెనుక రావాల్సిన చిన్న సినిమాల పరిస్థితి అగమ్యగోచరంగా మారిపోయింది. రకరకాల సమస్యలతో సినిమా రంగం ఇప్పుడు బిక్కచచ్చిపోయి ఉంది. చిన్న సినిమాలు విడుదల అవతున్నా... అవి ఘన విజయాన్ని సాధించాయనే ప్రచారం మీడియాలో జరుగుతున్నా... వాస్తవాలు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి.

**– అరుణ,** సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు
















వెల : ₹.80/- వెల : ₹.60/- వెల : ₹.270/- వెల : ₹.80/- వెల : ₹.54/-













వెల : ₹.800/900 : 999/1200 వెల : ₹.250/- వెల : ₹.130/- వెల : ₹.200/-
















వెల:₹.999/- సెట్ వెల:₹.450/- వెల :₹.699/- వెల : ₹.400/- వెల : ₹.145/-

**పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

**సాహిత్య నికేతన్ :** కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

**సాహిత్య నికేతన్ :** వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

**సాహిత్య నికేతన్ :** ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 28




మిమ్మల్ని ఆలోచింపజేసే ఇంటర్వ్యూలు,
ఆసక్తిని రేకెత్తించే సామాజిక, సాంస్కృతిక అంశాలను
జాగృతి ఇప్పుడు యూట్యూబ్ ద్వారా అందిస్తోంది.
జాతీయ దృష్టికోణంతో వివిధ అంశాలపై
మంచి ఆలోచనలు మన ముందుంచుతోంది.
రండి, జాగృతి యూట్యూబ్ ఛానల్‌ను చూడండి, సబ్‌స్క్రైబ్
చేయండి, మీ అభిప్రాయాలు అందరితో పంచుకోండి.

www.youtube.com/@Jagrititv

చెప్పండి మెచ్చండి పంచండి